ఏప్రిల్
2023

204

సంపుటి :18 సంచిక : 11

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

డిజిటల్ గుత్తాధిపతుల చేతుల్లో మీడియా
నేటికీ కొనసాగుతున్న ఫ్యూడల్ సంస్కృతి
కుషాను సామ్రాజ్యం
గుజరాత్ మారణకాండ: నేటికీ వెంటాడుతున్న పీడకల
అదాని సేవలో ఆర్ఎస్ఎస్-బిజెపి
భక్తి: నాడు-నేడు
ఆంటోనియో గ్రాంసీ: ఆధిపత్యం, ప్రతి-ఆధిపత్యం
భారతదేశ వారసత్వ మూలాలు
రుగ్వేదంలో సృష్టి గురించిన వివేచన

వేద వాఙ్మయం

# రుగ్వేదంలో సృష్టి గురించిన వివేచన

పిబి చారి

ఋగ్వేద రుషులు ఈ సృష్టి ఎలా ఏర్పడింది అన్న దానిమీద మొదటిసారిగా చేసిన ఆలోచన ఋగ్వేద పదవ మండలంలో కడపటి సూక్తంలో ఉన్నది. ఈ సూక్తంలో ఏడు రుక్కులు ఉన్నాయి. వాటి అర్థం:

–అప్పుడు భవమూ లేదు అభవమూలేదు.

–అంతరిక్షము లేదు దానికి అవతల ఆకాశమూ లేదు

–దీని నంతటినీ (ఆకాశాన్ని) ఎవరిలా కప్పారు? ఎక్కడి నుంచి వచ్చింది ది? ఎవరు దీన్ని రక్షిస్తున్నారు?

–మొదట్లో అందులో జలం ఉండేదా?

–అప్పుడు మృత్యువు లేదు, అమరత్వమూ లేదు ఏకాకి అయిన ఒక స్వయం శక్తి మాత్రమే అప్పుడు ఉంది.

–అది ఒక్కటే ఉంది. దానికి పైన ఇంకేమీ లేదు. అంతా అంధకారం. విశ్వమంతా నీరు. ఆ నీటిలోని శూన్య ప్రదేశంలో ఆ శక్తి దాగుకొని ఉన్నది.

ఆ కోర్కే మనసుకు బీజం, మొదటగా కోర్కె జనించింది.

–అప్పుడు రుషులు తమ హృదయాల్లో వెతుక్కున్నారు. అభవానికి భవానికి సంబంధాన్ని వెతుకుతున్నారు. ఈ విశ్వానికి మూల కారణమైన అనాది శక్తిని ఎవరు తయారు చేశారు?

–దానికదే తయారయిందా? ఈ విశ్వానికి అవతలగా, ద్యౌ లోకంలో ఉండి అన్నింటినీ పరిపాలిస్తున్న అన్నిటికీ స్వామి అయిన ఆ శక్తి కి మాత్రమే తెలియును, తెలియదు.

పైన ఉదహరించిన నాసదీయ సూక్త మంత్రాలలో కొన్ని ప్రశ్నలు లేవనెత్తిన బడ్డాయి. ఆ ప్రశ్నలే తర్వాతికాలంలో దర్శనాల కి మూలం అయ్యాయి. ఈ విశ్వం మొదట్లో ఎలా ఉండేది? అన్న ప్రశ్నకు ఒకరేమో "సత్" అని సమాధానం ఇచ్చారు. అంటే ఈ విశ్వం మొదటి నుండి ఇలాగే ఉండేది అన్నాడు. మరొకరు "అసత్"అన్నారు. అంటే ఈ సృష్టికి ముందు ఏమీ లేదు అన్నారు. అలాగే ఈ విశ్వమంతా అభేద్యమైన జలరాశితో నిండి ఉంది అన్న వాక్యము పై సూక్తంలో వచ్చింది. దానిని ఆధారం చేసుకునే తరువాతి ఉపనిషత్ కాల పురుషులు మొదట్లో "ఈ జలమే ఉండేది" అన్నారు.

నాసదీయ సూక్తం రుషి చాలాభాగం ప్రకృతిని అనుసరించే ఆలోచించాడు. ఈ విశ్వానికి మూలాన్ని వెతుకుతూ "అగాధమైన జలమే ఉండేది" అని చెప్పాడు. అంతలో ప్రకృతిని వదిలి పెట్టి శూన్యంలోకి గెంతేశాడు. ఏదో కనిపించని శక్తిని ఊహించాడు. శూన్యంలో ఆ శక్తి ఉన్నట్లు కల్పించుకున్నారు. చివరకు తన కల్పనను కూడా అయోమయం చేస్తూ, ఈ విశ్వాన్నంతటికి సర్వ దర్శి అయిన శాసకుడిని ఊహించి, ఈ విశ్వాన్ని తయారుచేయటానికి తయారు చేయక పోవడానికి ఈ విశ్వాన్ని గురించి మనం తెలుసుకోవడానికి తెలుసుకో లేక పోవడానికి బాధ్యతను సర్వ దర్శి అయిన ఆ శాసకుడి తలకు చుట్టి మౌనాన్ని వహించాడు.

### పశు బలి నరబలులు:

రుగ్వేద కాలంలో యజ్ఞాలలో పశు బలితోపాటు నరబలులు కూడా ఉండేవి. ఆ విషయాన్ని అయితరేయ బ్రాహ్మణంలోని 7-13-16 సూక్తంలో వివరంగా చెప్పబడింది. యజ్ఞం మొదలైంది. ఆ యజ్ఞానికి హోత విశ్వామిత్రుడు. ఉద్గాత అయాశ్యుడు. పురోహితుడు అజీగర్తుడు. ఈ అజీగర్తుడు 300 గోవుల దానానికి దురాశపడి తన కొడుకైన శునశ్శేపుడిని తన చేతులతో యజ్ఞ పశువుగా నరికి బలి ఇవ్వడానికి సిద్ధం అవుతాడు. కానీ శునశ్శేపుడు తన తండ్రి నుండి తప్పించుకుని విశ్వామిత్రుని తండ్రిగా చేసుకునే తలంపుతోనే వెళ్లి విశ్వామిత్రుడి ఒడిలో కూర్చుంటాడు. భంగపడిన అజీగర్తుడు పశ్చాత్తాపంతో తన కొడుకుని ఇచ్చేయమని విశ్వామిత్రుని అడుగుతాడు. అయినా విశ్వామిత్రుడు శునశ్శేపుడిని అతని తండ్రికి అప్పగించటానికి అంగీకరించడు. అప్పుడు అజీగర్తుడు అతని తల్లిదండ్రులు మేమున్నాము నీవు మా దగ్గరికి రా అని పిలుస్తారు. నీవు అంగిరస అజిగర్త పుత్రుడవు, నీవు నీ తండ్రి తాతల గృహాన్ని విడువవద్దు మా వద్దకు రమ్ము అని బ్రతిమిలాడాడు కొడుకుని. అప్పుడు కొడుకు అంటాడు నేను శూద్రుడు కూడా ముట్టని ఆ వస్తువును (కత్తి) నీ చేతిలో ఉండగా చూశాను. నీవు 300 గోవులు నా ప్రాణం కన్నా ఎక్కువ అనుకున్నావు అని తండ్రితో అంటాడు. అప్పుడు అజీగర్తుడు పుత్రా! చేసినదానికి నేను పశ్చాతాప పడుతున్నాను, ఆ పాపాన్ని నివారించుకోవడానికి నీకు నూరు ఆవులను ఇస్తాను రా అంటాడు. ఒక సారి పాపం చేయడానికి వెనుకాడని వాడివి మరొకసారి పాపం చేస్తావు. నీవు చేసిన పాపం ఏ విధంగానూ నివారించబడదు. నేను రాను అంటాడు శునశ్శేపుడు. ఈ సంభాషణను బట్టి యజ్ఞాలలో ఆనాడు నరబలి ఉండేదని దానిని విశ్వామిత్రుడు నివారించి అడ్డుకట్ట వేశాడని మనకు అర్థమవుతుంది. నరబలి నుండి కాపాడబడిన శునశ్శేపుడిని విశ్వామిత్రుడు దత్తత చేసుకుంటాడు. దేవరాత అని అతనికి పేరు పెట్టి తన కొడుకులకు నాయకుడిగా చేస్తాడు.

### అన్నాచెల్లెళ్ల వివాహ బంధాలు:

ఋగ్వేదం కన్నా కాస్త ముందు కాలంలో అన్నాచెల్లెళ్ల మధ్య వివాహ సంబంధాలు ఉండేవి. రుగ్వేదంలో ఆ అవశేషాలను వర్ణిస్తూ అన్నాచెల్లెళ్ల మధ్య ఒక సంవాదాన్ని తెలియజేస్తుంది ఋగ్వేదం. యమ, యమీ వీరిద్దరూ కవల సోదరసోదరీలు. (10-10) ఈ సూక్తం వారి మధ్య సంభాషణ వివరిస్తుంది. యమి తన అన్నను.. నీకు నేను సఖిగా ఉంటాను నీవు నాకు సఖుడవై ఉండమని అడుగుతుంది. నీ పట్ల నాకు కోరికగా ఉన్నది. ఒకే చోట కలిసి జంటగా నిద్రించుటకు వచ్చాను. భర్త కొరకు భార్య వలే నేను నా శరీరాన్ని బహిరంగ పరుస్తాను. అప్పుడు అన్న అయిన యముడు నీ సఖుడనై ఈ సఖ్యత కోరను. ఎందుకంటే నీవు నా సోదరివి. ఇందులకు

(మిగతా 35వ పేజీలో)



రచయిత హైదరాబాద్‌లోని ఇసిఐఎల్‌లో రిటైర్డ్ సీనియర్ మేనేజర్

## ఈ సంచికలో...

1. ఋగ్వేదంలో సృష్టి గురించిన వివేచన
పిబి చారి ......2

2. డిజిటల్ గుత్తాధిపతుల చేతుల్లో మీడియా
ప్రబీర్ పుర్కాయస్థ ........4

3. నేటికీ కొనసాగుతున్న ఫ్యూడల్ సంస్కృతి.
ఎస్ వీరయ్య........11

4. కుషాను సామ్రాజ్యం
ఎంవిఎస్ శర్మ .........14

5. గుజరాత్ మారణకాండ: నేటికీ వెంటాడుతున్న పీడకల
క్రిస్టోఫె జెఫర్‌లాట్ ........17

6. అదాని సేవలో ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి
ఎ కోటి రెడ్డి ........19

7. భక్తి: నాడు-నేడు
గణేష్ దేవి.......22

8. ఆంటోనియో గ్రాంసీ: ఆధిపత్యం, ప్రతి-ఆధిపత్యం
ఎస్ వెంకట్రావు.......24

9. భారతదేశ వారసత్వ మూలాలు
కేశవన్ వెలుతట్.......32



సంపాదకుడు:
ఎస్.వెంకట్రావు

సంపాదక వర్గం:
పాటూరు రామయ్య
బి.వి.రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్.వీరయ్య
తెలకపల్లి రవి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
ఫోన్: ఎడిటర్ : 94900 99333

ముద్రణ: ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# మీడియా

స్వాతంత్ర్యానికి పూర్వం మన దేశంలో ప్రాశ్చాత్య మీడియా స్వంత లాభాల కోసం, భారత ప్రజలపై తాము సాగిస్తున్న వలస దోపిడీని సమర్ధించుకోడానికి పని చేయగా ఆ వలస బేహారుల దోపిడీకి వ్యతిరేకంగా, స్వదేశీ ప్రజల ప్రయోజనాలను కాపాడ్డం కోసం భారతీయ మీడియా పుట్టింది. స్వాతంత్ర్యోద్యమంలో అనేక మంది స్వంత ఆస్తులు అమ్ముకుని పత్రికలు స్థాపించారు. మీడియా నాడు జాతీయోద్యమానికి వెన్నుదన్నుగా నిలిచింది. అందుకే ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం, లౌకిక తత్వం, వెనుకబడ్డ ప్రజల, ప్రాంతాల అభివృద్ధి, భిన్నత్వంలో ఏకత్వాన్ని పరిరక్షించడం, భిన్న జాతుల ఆకాంక్షలను ప్రతిబింబించడం మీడియా ప్రధాన స్వభావంగా ఉండింది.

నేడు, 3 దశాబ్దాల నయా-ఉదారవాద విధానాల అమలు అనంతర మీడియా స్వభావం మారింది. ప్రజల ప్రయోజనాల స్థానంలో కార్పొరేట్ల ప్రయోజనాలు కాపాడ్డమే మీడియా ప్రధాన వ్యాపకమయింది. అందుకే హిందూత్వ శక్తులు లౌకిక తత్వానికి, జాతీయ సమైక్యతకు తూట్లు పొడుస్తున్నా కార్పొరేట్ మీడియా నోరెత్తడం లేదు. అదానీలు, అంబానీలు ఎన్ని అక్రమాలకు పాల్పడుతున్నా, మోడీ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని వారికి ముట్టజెపుతున్నా మౌనం పాటిస్తోంది. ప్రజల మీద అన్యాయంగా రోజురోజుకూ భారాలు మోపుతున్నా అది పట్టించుకోవడం లేదు. రైతు వ్యతిరేక నల్ల చట్టాల కోసం లక్షలాది మంది రైతులు ఏడాదిపాటు అకుంఠిత దీక్షతో చారిత్రాత్మక పోరాటం చేస్తే ఈ మీడియా వారి పోరాట స్ఫూర్తినిపైగానీ, వారి సమస్యలపైగానీ మాట్లాడ కుండా ఉద్యమంలో బొక్కలు వెదకడమే పనిగా పెట్టుకుంది. మోడీ ప్రభుత్వ దందాలు, పచ్చి ప్రజా వ్యతిరేక విధానాలు దానికి కనబడ్డమే లేదు. పాలక కాషాయ పార్టీ నేతలు నిత్యం చేస్తున్న విద్వేష ప్రకటనలు, ప్రభుత్వ అండతో మైనారిటీలపై వారు జరుపుతున్న అకృత్యాలు మీడియా దృష్టికే రావడం లేదు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులు హరిస్తున్నా, అధికార సంస్థలను అరచేతిలో పెట్టుకుని ప్రతిపక్షాలను వేధంపులకూ, నిర్బంధానికీ గురిచేస్తున్నా, ఎన్నికైన ప్రజా ప్రతినిధులను సంతలో సరుకులా కొనుగోలు చేస్తున్నా ఈ మీడియా గుడ్లప్పగించి చూస్తోంది.

మీడియా ఎందుకింతలా మారిపోయింది? 2019 తరువాత మోడీ ప్రభుత్వ హయాంలో భారత దేశంలో కార్పొరేట్-మతతత్వ శక్తులు దుష్టకూటమిగా ఏర్పడ్డాయి. అధికారంలోని ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి కార్పొరేట్ పెట్టుబడిదారులు, వారి విదేశీ మిత్రుల ప్రయోజనాలు కాపాడ్డమే లక్ష్యంగా పనిచేస్తుంటే దేశ ప్రజల్లో మతతత్వాన్ని, విద్వేష రాజకీయాలను చొప్పించడం ద్వారా ప్రజల దృష్టిని నిజ జీవిత సమస్యలనుండి మళ్లించేందుకు కార్పొరేట్ మీడియా పనిచేస్తోంది. అందుకే దానికి భారత దేశం 'వెలిగి పోతున్నది' అన్న ప్రచారమే తప్ప ప్రజలు పడుతున్న బాధలు కనిపించడం లేదు. గిట్టుబాటు ధరల్లేక దివాళాతీసిన రైతాంగం, వారి ఆత్మహత్యలు కనిపించడం లేదు. ఉపాధి కోల్పోతున్న కార్మికులు, యువత నిరుద్యోగం, దివాళా తీస్తున్న చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు దాని దృష్టికి రావడం లేదు.

అయితే నాటి పాత్రికేయ విలువల కోసం నిలబడి, ఆచరణలో పెడుతూ ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న పాత్రికేయులు, మీడియా సంస్థలు నేడూ అనేకం ఉన్నాయి. అవి ప్రజల నిజమైన ఆశలనూ, ఆకాంక్షలనూ ప్రతిబింబిస్తున్నాయి. ప్రజల కోసం గొంతు వినిపిస్తున్నాయి. కానీ పుష్కలమైన పెట్టుబడులు, కొత్త సాంకేతికతలను చేజిక్కించుకున్న కార్పొరేట్ మీడియా ముందు వాటి గొంతులు బలహీన పడుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యానికి మరింత ప్రమాదకరం. అందుకే కార్పొరేట్ మీడియా తప్పుడు ప్రచాలను తిప్పికొట్టడానికి ప్రత్యామ్నాయ మీడియాను బలోపేతం చేయడం నేటి మన ముఖ్య కర్తవ్యాల్లో ఒకటిగా ఉండాలి!

ఈ మాసం ముఖ్యాంశం

# డిజిటల్ గుత్తాధిపతుల చేతుల్లో మీడియా

**ప్రబీర్ పుర్కాయస్థ**



**రచయిత న్యూస్ క్లిక్ వెబ్ పోర్టల్ సంపాదకుడు, సైన్సు ప్రచార కార్యకర్త. సైన్సు, సమాజం అంశాలపై వందల కొద్దీ వ్యాసాలు, అనేక పుస్తకాలు రచించారు.**

ఈ రోజు డిజిటల్ మీడియా మన జీవితాలలోకి ఎక్కువగా చొచ్చుకొస్తున్నది, అది సామాజిక మాధ్యమంగానా, డిజిటల్ తరగతి గదుల రూపంలోనా లేదా నెట్‌ఫ్లిక్స్ లాంటి ఓటిటి మాధ్యమాల ద్వారానా అన్నది వేరే విషయం. ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచ కప్ లాంటి ప్రతిష్టాత్మక పోటీలు కూడా టివి తో పాటు ఇతర యాప్‌ల ద్వారా కూడా ప్రసారం చేయబడుతున్నాయి. ఈనాటి యువత తమ మొబైల్ ఫోన్‌లతో అవినాభావ సంబంధాన్ని కలిగి ఉన్నారు. తమ మొబైల్‌లలో విషయాలు లోడవటానికి మధ్య మాత్రమే మనకు సమయం కేటాయిస్తున్నారు. డిజిటల్ మీడియాతో పాటుగా డిజిటల్ ప్లాట్‌ఫారంలు కూడా పెరుగుతున్నాయి. అవి అతి పెద్ద గుత్తాధిపత్య సంస్థలుగా రూపొందుతూ మనకు ఏ వార్తలు, వినోదాన్ని అందించాలి, అన్న అంశాలను నిర్ణయిస్తున్నాయి.

సాధారణంగా గూగుల్, ఫేస్‌బుక్/మెటాలను సామాజిక మాధ్యమాలని పిలుస్తుంటాము. వాటిని ఇతర మాధ్యమాల కంటే భిన్నంగా చూస్తాము, కానీ నిజానికి ఇవన్నీ ప్రసార మాధ్యమాలలో అంతర్భాగమని గుర్తించాలి. సామాజిక మాధ్యమాలుగా వాటిని పిలవడం అంటే పాత మాధ్యమాల నుంచి వాటిని వేరు చేయడం, అలా వేరు చేయడం వలన పాతకాలంలో వాడిన ప్రసారమాధ్యమాల వంటివే ఈ సామాజిక మాధ్యమాలు కూడా అన్న భావన మరుగున పడుతున్నది. నిజానికి ఈ కొత్త ప్రసార మాధ్యమాలు ప్రసార మాధ్యమాల్లో ఒక కొత్త విభాగం మాత్రమే.

ఒక మార్క్సిస్టుగా అసలు ఈ మాధ్యమాలు తమ ఆదాయాన్ని ఎలా పొందుతున్నాయన్నది కీలకమైన ప్రశ్న వేసుకోవాలి. పాతకాలం నాటి ప్రచార మాధ్యమాల ఆదాయ వనరులు, ఇప్పటి ఆధునిక కాలంలోని ప్రసార మాధ్యమాల ఆదాయ వనరులు ఒక్కటిగానే ఉన్నాయి. రెండిటికి ఆధారం ప్రకటనలే. ఈ డిజిటల్ వేదికలు గుత్తాధిపత్యాన్ని ఎలా సంపాదించాయి, మొత్తం మాధ్యమం స్వరూపాన్నే ఎలా మార్చేసాయో ఇప్పుడు చూద్దాం.

**డిజిటల్ విప్లవానికి పూర్వరంగం**

డిజిటల్ విప్లవం కొత్త డిజిటల్ గుత్తాధిపతులను తయారు చేసింది. కేవలం గూగుల్, ఫేస్‌బుక్‌లు మాత్రమే కాదు. 2006లో కేవలం మైక్రోసాఫ్ట్ కంపెనీ మాత్రమే ప్రపంచంలోని పది అతిపెద్ద గుత్తాధిపతుల జాబితాలో ఉండేది. ఈ రోజు అతిపెద్ద పది కంపెనీలలో సగానికి పైగా–ఆరు కంపెనీలు–డిజిటల్ గుత్తాధిపతుల చేతుల్లో ఉన్నాయి. సౌదీ అరంకో అనే ప్రపంచంలోనే అతి పెద్ద చమురు కంపెనీని ఆపిల్ దాటేసింది. ప్రపంచంలోని ఐదు గుత్తసంస్థలలో మిగతా నాలుగు డిజిటల్ కంపెనీలు ఉన్నాయి. వాటి మార్కెట్ వాటా లక్షల కోట్ల డాలర్లు ఉంది. ఐ ఫోన్‌ల ఉత్పత్తిలో ఆపిల్ దే అగ్రస్థానం, కానీ తన ఉత్పత్తుల కోసం ఆపిల్‌కి సొంత పరిశ్రమ లేదు. ప్రపంచంలో అతిపెద్ద ఆరు గుత్తాధిపత్య కంపెనీలలో రెండు – గూగుల్, ఫేస్‌బుక్–సామాజిక మాధ్యమాలకి సంబంధించిన కంపెనీలు ఉన్నాయి. నిజానికి గూగుల్ ఆదాయంలో అత్యధిక భాగం సామాజిక మాధ్యమం ద్వారా కాక దాని సెర్చ్ ఇంజిన్ ద్వారా వస్తున్నది. గణాంకాలను(డేటా) ఒక ఉత్పాదక వస్తువుగా పరిగణించడం డిజిటల్ విప్లవంపై మనకున్న తప్పుడు అవగాహన. ఇది డిజిటల్ ఆర్థికవ్యవస్థను శక్తివంతంగా చేస్తోంది. ప్రపంచ ఆర్థిక వేదిక దీనిని 'కొత్త చమురుగా' వర్ణిస్తున్నది. ఇటలీకి చెందిన ఆటోనోమిస్టాస్ ఆలోచనలు గల వారు, అల్గోరిథమ్స్ వలన ప్రభావితులైన వారు, తమ గణనాల ద్వారా 'అల్గోరిథం మిగులు'ను ఎలా ఉత్పత్తి చేస్తున్నదో తెలియచేస్తున్నారు. వాస్తవ ప్రపంచంలో డాటాను, అల్గోరిథమ్‌ను ఏ కంపెనీలు, ఏ అంశాల కోసం వాడుకుంటున్నాయన్న విషయాన్ని వారు గుర్తించటం లేదు. డిజిటల్ సంస్థలన్నీ ఒకే విధమైనవి కాదు. అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్, ఫేస్‌బుక్‌లు డాటాను, ఆల్గోరిథమ్స్‌ను తమ అవసరాలకు అనుగుణంగా, విభిన్న ప్రయోజనాలకు వినియోగించుకుంటున్నారు.

మనం ప్రపంచంలోని అతిపెద్ద పది గుత్తాధిపత్య డిజిటల్ కంపెనీల వ్యాపార స్వరూపాలను పరిశీలిస్తే, అవెంత భిన్నమైనవో అర్థం అవుతుంది. అందులో నిజానికి గూగుల్, ఫేస్‌బుక్, ఈ రెండు కంపెనీలే సామాజిక మధ్యమాలలో గుత్తాధిపత్యం కలవి. తమను ఉపయోగించుకుంటున్న వారిని పట్టుకుని ఇతర రంగాలలోనూ, ఉదాహరణకి ద్రవ్య (గూగుల్ పే, వాట్స్ అప్ పే) యాప్‌లలో వినియోగించుకుంటున్నారు. అయినప్పటికీ ఈనాటికీ వాటి ఆదాయాలలో అధిక భాగం వాణిజ్య ప్రకటనల ద్వారానే పొందుతున్నాయి. తమను ఉపయోగించుకునే వినియోగదారుల వివరాలను ప్రకటనలు ఇచ్చేవారికి అమ్ముకోడం ద్వారానే ఆ రెండు సంస్థలు ఆదాయం పొందుతున్నాయి. అంటే పాతపద్ధతే, వాణిజ్య ప్రకటనలే.

10 పెద్ద గుత్త కంపెనీలలో మిగిలిన నాలుగు కంపెనీలవి కూడా గుత్త డిజిటల్ వ్యాపారాలే. అయినా రూపాలు వేరు. డిజిటల్ విభాగాలు ఉన్నప్పటికీ ఇది వరకటి నుండి వాల్‌మార్ట్ చేస్తున్నట్టే అమెజాన్ వస్తువులను కొని, అమ్ముతున్నది. విండోస్ గుత్తాధిపత్యం, ఇతర సాఫ్ట్‌వేర్‌లపై యాజమాన్య హక్కులు ఉండటం, సేవలు అందిస్తున్నందువలన అత్యధిక ఆదాయం పొందుతున్నప్పటికీ, మైక్రోసాఫ్ట్‌కి ప్రధానంగా ఆదాయం సమకూర్చిపెట్టేది ఆపిల్ లాగే మైక్రోసాఫ్ట్ బ్రాండ్, ముఖ్యంగా ఐ ఫోన్. టిఎస్ఎంసి (తైవాన్ సెమి కండక్టర్స్ ) అనే

చిప్స్ తయారుచేసే ప్రపంచంలోని అతి పెద్ద సంస్థ ఇప్పుడు కొత్తగా ఈ పది గుత్తాధిపత్య కంపెనీల జాబితాలో చేరింది. డిజిటల్ విప్లవం పెట్టుబడిదారీ నిర్మాణంలోనే మార్పులు తీసుకు వస్తున్నది. అసలింతకీ డిజిటల్ విప్లవం అంటే ఏమిటి?

ఈ డిజిటల్ విప్లవానికి రెండు ఇరుసులు ఉన్నాయి. ఒకటి సమాచార వ్యవస్థ, దాని బ్రాండ్ విడ్త్. రెండోది, ఈ సమాచార వ్యవస్థ రూపొందించిన మదింపు సాధనాల శక్తి. డిజిటల్ ప్రసార సాధనాలు ప్రసార వ్యవస్థలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పు అంతర్జాలం. దీని ద్వారానే మనం ఏ సమాచారాన్నయినా పొంద గలుగుతున్నాము, పంపగలుగుతున్నాము. మనం వాడే పరికరాలు ఒకదానికొకటి అను సంధానించబడడం ద్వారా ఇది సాధ్యపడు తున్నది.

ప్రసార వ్యవస్థ ఎంత విస్తృతంగా వ్యాపించి ఉందో, ఎంత సమాచారాన్ని(డాటా) పంపుతున్నదో ఒక చిన్న ఉదాహరణ ద్వారా తెలుసుకోవచ్చు. అంతర్జాల అనుసంధానం ఏడాదికి దాదాపుగా 40 శాతం వృద్ధి చెందు తుండగా, వాటిని ఉపయోగించే పరికరాల ఉత్పత్తి 18 శాతం వృద్ధి చెందుతున్నది. పెద్ద ఎత్తున వ్యాప్తి చెందడం వలన ప్రసార సాధనాలను మరింత శక్తివంతంగా రూపొందించ వలసి ఉంది. అంటే శక్తివంతమైన చిప్స్ తయారు చేయవలసి ఉంది.

ఈ చిప్స్ విశ్లేషణా శక్తి మీడియాకు అంత ప్రధానమైనవిగా ఎందుకున్నాయి? చిప్స్ ప్రసార మాధ్యమాలలోకి రెండు విధాలుగా ప్రవేశిస్తాయి. చందమామపైకి వెళ్లిన అపోలో 11 లో వాడిన కంప్యూటర్ చిప్స్ కన్నా ఈ రోజు మనం వాడే రోజువారీ మొబైల్ ఫోన్ వేలాది రెట్లు విశ్లేషణా శక్తి కలిగివున్నది. అందువలనే మనం కదులుతున్న వస్తువులను – అది సినిమా అయినా మరేదయినా అయినా– మొబైల్‌లో వాస్తవంగా చూడగలుగుతున్నాము. ఫేస్‌బుక్‌లో వీడియో గానీ, యు ట్యూబ్‌లో ఆటలు గాని చూస్తున్నాము.

ఈ డేటా అంతటికి వాణిజ్య విలువలున్నాయని, అదే డిజిటల్ విప్లవం అని అపోహ ఉంది. ఇది గూగుల్, ఫేస్‌బుక్ మన వద్ద నుండి డేటా సేకరించడం, ఆ డేటాని అంతులేని సంపాదనకు ఆలంబనగా వాడుకుంటున్నారని అవగాహన వలన కలిగింది. అయితే ఈ అవగాహన డిజిటల్ విప్లవాన్ని సామాజిక మాధ్యమానికే పరిమితం చేయడమే కాక డిజిటల్ కంపెనీలు మిగులును ఏ విధంగా పొందు తున్నాయి, ఎవరి నుండి పొందుతున్నాయో తెలుసుకోకుండా చేస్తుంది.

> **“ 2015 లో (ముద్రణ) ప్రచురణ, టివి ల కంటే ప్రకటనల మొత్తం వాటిమొత్తం ఆదాయాలలో దాదాపు నాలుగో వంతు ఉండగా, 2022 లో 10 శాతానికి పడిపోయాయి. ఏడేళ్ల కాలంలో, ఒక సంస్థకు వచ్చే ఆదాయాలు ఇంత భారీ స్థాయిలో పడిపోవడం అంటే, గణనీయయంగా దిగజారినట్టే లెక్క. ఆ మేరకు లాభపడ్డదంతా డిజిటల్ వేదికే. ”**

### అంతర్జాల కాలంలో ప్రసార మాధ్యమాలు, ప్రకటనలు

గత దశాబ్దంలో వాణిజ్య ప్రకటనల నుండి వచ్చే లాభాలు, డిజిటల్ గుత్త పెట్టుబడిదారుల వైపుకు నిర్ణయాత్మక స్థాయిలో మరలిపోయాయి. 2015 లో (ముద్రణ) ప్రచురణ, టివి ల కంటే ప్రకటనల మొత్తం వాటిమొత్తం ఆదాయాలలో దాదాపు నాలుగో వంతు ఉండగా, 2022 లో 10 శాతానికి పడిపోయాయి. ఏడేళ్ల కాలంలో, ఒక సంస్థకు వచ్చే ఆదాయాలు ఇంత భారీ స్థాయిలో పడిపోవడం అంటే, గణనీయయంగా దిగజారినట్టే లెక్క. ఆ మేరకు లాభపడ్డదంతా డిజిటల్ వేదికే. ఇదే కాలంలో, అంటే 2015కి డిజిటల్ కంపెనీలకు ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయాలు, వాటి మొత్తం అదాయంలో పావు వంతు ఉండగా, 2022కి సగానికి పెరిగింది. 2021లో గూగుల్‌కి వచ్చిన మొత్తం ఆదాయం 258 బిలియన్ల డాలర్లు కాగా, అందులో 81 శాతం ప్రకటనల ద్వారా వచ్చింది. మెటాగా ప్రస్తుతం పిలవబడుతున్న ఇదివరకటి ఫేస్‌బుక్‌కి 2021లో వచ్చిన మొత్తం 118 బిలియన్ల ఆదాయంలో 97.4 శాతం ప్రకటనల ద్వారా వచ్చింది. అందువలన మనం గూగుల్, ఫేస్‌బుక్ లను ప్రసార మాధ్యమాలు, ప్రకటనల నేపథ్యంలో పరిశీలించాలి.

ఇతర మీడియా వేదికల కన్నా డిజిటల్ మీడియా వేదికలు ఏ విధంగా భిన్నంగా ఉన్నాయో లేదా ఒకే పోలికలు కలిగి ఉన్నాయో పరిశీలించడానికి ఈ వ్యాసంలో నేను పరిమిత మవుతాను. ఇప్పటికే మనం రెండు డిజిటల్ సంస్థ– గూగుల్, ఫేస్‌బుక్– ల వ్యాపార ఆదాయాలు ప్రకటనల పైనే ఆధారపడి ఉన్నాయని గుర్తించాము. మార్క్స్ మాటల్లో చెప్పాలంటే, వారి అదనపు విలువ మూలాలను కనుగొన్నాము. ఒక మీడియా కంపెనీ డిజిటల్ యుగంలో తన ప్రకటనదారులకు ఏమి ఇస్తుందో ,ఎవరు ఎందుకు ప్రకటనలు చేస్తారో తెలుసుకుందాము. నేనిక్కడ ప్రకటనల గుత్తాధిపత్యాన్ని గురించి మాట్లాడడం లేదు. అది మరింత పెద్ద అంశం.

నేను మీడియా, గుత్తాధిపత్యాలకు సంబంధించి ఇతర అధ్యయనాల నుండి రెండు ప్రతిపాదనలు తీసుకుంటాను. ఒకటి, వస్తువు ధరలలో పోటీ కన్నా ప్రకటనల ధరల్లో పోటీ మెరుగైనది, ఎందుకంటే ఇది మొత్తం మిగులుని పరిమితంగా ఉంచుతుంది. కారణం ఇక్కడ పోటీ కేవలం తిరిగి పంచడానికి పరిమితమవుతుంది. కోకాకోలా కి, పెప్సికి పోటీ ఉంటుంది. అవి ధరలను పెంచే బదులుగా ప్రకటనలు పెంచుకోవడానికి ఇష్టపడ్డాయి. ఉత్పత్తి చేయడం వలన వచ్చిన అదనపు విలువ నుండే ప్రచారం చేసే కంపెనీలకు ప్రకటనలు ఇవ్వడం జరుగుతుంది. అయితే ప్రకటనలు చేసేవారు వాణిజ్య ప్రకటనలు, వ్యాపార ప్రకటనలు, హోర్డింగ్‌లు వేయడం వగైరా అనేక రూపాలలో ప్రకటనలు చేస్తారు. అయితే వీటన్నింటికీ కంపెనీల అదనపు విలువ నిధుల నుండే ఖర్చు పెడతారు.

ఒకవేళ ప్రకటనల కంపెనీకి ఒక సామాజిక మాధ్యమం, ఉదాహరణకి, దానికే అన్ని సినిమా హాళ్లు, లేదా టివి ఛానళ్ళు ఉన్నాయనుకుందాము. అప్పుడు ఏమవుతుంది? వస్తువులను ఉత్పత్తి జేయగా వచ్చిన అదనపు విలువ తిరిగి ప్రకటన కర్తలకు చేరుతుంది. ఎందుకంటే, ప్రకటన కర్తలు లేకుండా వస్తువులు వినిమయదారులకు చేరలేవు. ప్రచారం చేసేవారు ఉత్పత్తిదారుని నుండి ఎక్కువ అద్దె వసూలు చేస్తారు.

మనం టివి నే ఉదాహరణగా తీసుకుందాము. ఇది మీడియా కంపెనీ వారి ఛానళ్లలో ప్రకటనలు చేసేవారికి ఏమేమి అమ్ముతుందో సులభంగా అర్థంచేసుకోడానికి

> **"మీడియాలో వచ్చే విషయాలు, వాటి వెనక ఉండే సిద్ధాం తాలు పరిశీలించడం ముఖ్యమే. సైద్ధాంతిక, పాలనా వ్యవస్థలో మీడియా పాత్రతో పాటుగా, ఆర్థిక విశ్లేషణ కూడా జరగాలి. మీడియా కంపెనీలు ప్రపంచ పెట్టుబడిలో అగ్రభాగాన ఉన్నప్పుడు, అవి ఆర్థికరంగంలో పోషిస్తున్న పాత్రను గురించిన అవగాహన కూడా మనకుండాలి."**

సహకరిస్తుంది. 'ది అటెంషన్ మర్చంట్స్', అనే పుస్తకంలో మనందరికీ కొంత మేరకు 'ధ్యాస' పెట్టే ఓపిక ఉంటుంది. దీనిని అతడు 'ధ్యాస పెట్టుబడి'(అటెన్షన్ కాపిటల్)అని అన్నాడు. మనం పెట్టగల 'ధ్యాస'లో అత్యధిక భాగం తీసుకుని, దానిని వ్యాపార ప్రకటనలు చేసేవారికి అమ్మడం మీడియా కంపెనీల పని. న్యూయార్క్ వార్తాపత్రికను గురించి మాట్లాడుతూ, 'అది చదువరిని ఒక వస్తువుగా గుర్తిస్తుంది, అయితే చదువరులలోని ధ్యాసపై మాత్రమే దృష్టి పెట్టి, దానిని వస్తువుగా గుర్తించడం జరుగుతుంది, చదువరులను కాదు.' అంటారు. డల్లాన్ స్మిత్ 1977 కంటే ముందే' ధ్యాస పెట్టుబడిని' గుర్తించాడు. అతడు మీడియా అమ్మే పదార్ధాన్ని 'ప్రేక్షక వస్తువు 'అని నామకరణం చేసాడు.

పశ్చిమ దేశాల మార్క్సిస్టు అవగాహనలో ప్రసార సాధనాల అధ్యయనాలు రాజకీయ అర్థశాస్త్రాన్ని సరిగ్గా అర్థం చేసుకోకుండా కేవలం దాని ప్రచార పార్శ్వం పైనే దృష్టి పెట్టడడం ఒక ప్రధానలోపం. మీడియాలో వచ్చే విషయాలు, వాటి వెనక ఉండే సిద్ధాం తాలు పరిశీలించడం ముఖ్యమే. సైద్ధాంతిక, పాలనా వ్యవస్థలో మీడియా పాత్రతో పాటుగా, ఆర్థిక విశ్లేషణ కూడా జరగాలి. మీడియా కంపెనీలు ప్రపంచ పెట్టుబడిలో అగ్రభాగాన ఉన్నప్పుడు, అవి ఆర్థికరంగంలో పోషిస్తున్న పాత్రను గురించిన అవగాహన కూడా మనకుండాలి.

మీడియా కంపెనీలు వారి ప్రకటనదారులకు వివిధ స్థాయిల ప్రేక్షకులను అమ్ముతాయి. వారి కొనుగోలు స్థాయి, నివసించే ప్రాంతం, అవసరాలు, ఇతర వివరాలకు అనుగుణంగా అమ్ముతాయి. మన గురించిన డేటాను డిజిటల్ వేదికలు ఉపయోగించుకునే విధానం ఇదే. మొత్తం డాటాను ఒక వస్తువుగా అమ్మవు. మన వ్యక్తిగత విషయాలను వివిధ భాగాలుగా విభజించి, ఆయా భాగాల ఉత్పత్తులకు తగిన విధంగా రూపొందించి, వాణిజ్య ప్రకటనలు చేసుకునే వారికి 'వస్తువుగా' అమ్ముతాయి. అప్పుడే వ్యాపారులకు వారి అమ్మకం అవసరాలకు తగిన వినిమయదారుడు అందుబాటులోకి వస్తాడు. అంటే మీడియా కంపెనీలు రెండు పనులు చేస్తాయి, ఒకటి, ఒక కంపెనీ వినిమయదారులను గుర్తించడం, రెండు, వారి వాణిజ్య ప్రకటనలు కొనడం, అమ్మడం. (ఉదాహరణకు' సర్ఫ్ 'నే తీసుకుందాము. ప్రకటనదారులు ముందు సర్ఫ్ వాడే వినిమయదారులను గుర్తిస్తాయి. ఆ తరువాత సర్ఫ్ కొనేవారి వివరాలను సర్ఫ్ ఉత్పత్తి చేసే కంపెనీలకు అమ్ముకుంటారు. అంటే ప్రకటనను కొంటారు. వినిమయదారులను అమ్ముతారు)

### వాణిజ్య ప్రకటనలు చేయడమే బడా మీడియా కార్యక్రమం

జనబాహుళ్య మీడియా, జనబాహుళ్య ప్రసార సాధనాలకు రెండు రకాల ప్రయోజనాలు ఉన్నాయి: 1.మన ధ్యాసను తమవైపు నిలుపుకుని మనకు వార్తలు, వినోదం అందించడం. 2. వ్యాపారప్రకటనలు చేసేవారికి మనలను వినిమయదారులుగా అమ్మడం. మనలను అమ్మగలగడానికి మీడియా కంపెనీలకు మన ధ్యాస కావాలి. మనలోని చాలామందికి వాణిజ్య ప్రకటనలు చూడడం ఇష్టం ఉండదు. వాటిని వార్తలు, విశ్లేషణలు లేదా వినోదం చూసే సందర్భంలో చూడక తప్పని వాటిగానే చూస్తాము. బెన్నెట్ అండ్ కోల్‌మన్ యాజమాన్యంలోని టైమ్స్ అఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ వినీత్ జైన్ ఒకసారి,' మేము వార్తా పత్రికల వ్యాపారం చేయడం లేదు, వ్యాపార ప్రకటనల వ్యాపారం చేస్తున్నాము' అని ప్రకటించారు. జర్నలిస్టులతో పాటు అనేకమంది వార్త పత్రికల పాఠకులకు కూడా ఈ ప్రకటన ఆశ్చర్యాన్ని కలిగించింది. కానీ అనేక సంవత్సరాలుగా మనకు తెలిసినదానిని నిర్భయంగా బయటకి చెప్పడమే అసలైన ఆశ్చర్యం.

ప్రకటనలు మాత్రమే కాక, మీడియాకి ఇతర వనరులు కూడా ఉన్నాయి, అది ప్రధానంగా ప్రజల ప్రసార మాధ్యమంగా ఉండడం వలన పాఠకులు వార్తా పత్రికలకు చెల్లించే ధరలు. అయితే కేవలం పత్రికలు కొనే వారు చెల్లించే ధరలతో పత్రికలు నడిచి ఉంటే అవి జనబాహుళ్యపు ప్రచార సాధనలుగా ఉండేవి కాదు. వాటికి రాజ్యం కూడా నిధులు సమకూర్చి పెట్టి ఉండేది, లేదా సబ్సిడీలు ఇచ్చి ఉండేది. కానీ 19 వ శతాబ్దంలో మొదలైన పత్రికలు, తర్వాత వచ్చిన టి వి ల విషయంలో కాని అలా జరగలేదు. ప్రకటనలే ప్రచార సంస్థలకు ప్రధానమైన ఆదాయ వనరులుగా ఉన్నాయి.

మీడియా ఇతర పార్శ్వాల జోలికి నేను వెళ్లడం లేదు. ఉదాహరణకి నోమ్ చోమ్‌స్కీ, రాసిన 'మాన్యుఫ్యాక్చరింగ్ కాన్‌సెంట్ ' అనే పుస్తకం-అది ఇప్పటికి గొప్ప పుస్తకం-లో మీడియా గురించి అనేక విషయాలు చర్చించారు. ముద్రణా మాధ్యమం, టి వి లేదా నేటి డిజిటల్ మీడియాలను చూస్తే అన్నింటిలో వార్తలు ఒకే విధంగా ఉండడం మనం గమనిస్తాము. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, లేదా ఉక్రెయిన్ యుద్ధాలు అయినా, చైనా ఆర్థికవ్యవస్థకు వ్యతిరేకంగా అయినా, న్యూ యార్క్ టైమ్స్, బి బి సి, సి ఎన్ ఎన్ అవవచ్చు లేదా ఫేస్‌బుక్, గూగుల్ అవవచ్చు, అంతా ఒకే విధంగా స్పందిస్తారు. పాత ప్రచారసాధనాలైన, కొత్తవైనా వాటి లక్ష్యం ఒకటే. అన్నిటిలో ఉండే ఒకే ఒక్క అంశం పాలకవర్గాల విధానాలకు ప్రజల అంగీకారాన్ని తయారు చేయడమే.

చైతన్యపూర్వకంగా చేసిన నిర్ణయాల వలన చైనా, రష్యా, వంటి రక్షిత మార్కెట్లను లేదా ఉదాహరణకు ఇరాన్ వంటి దేశాలపై అమెరికా విధించిన ఆంక్షల వలన కొన్ని మార్కెట్లను పక్కన పెట్టినా ఈనాడు గూగుల్, ఫేస్‌బుక్‌లు అధిపత్యం కలిగిన సామాజిక మాధ్యమాలుగా ఉన్నాయి. మొత్తం ప్రపంచ డిజిటల్ ఆదాయంలో 90 శాతం పైన గుత్తాధిపతుల అధీనంలోని మీడియాకు వస్తున్నది. వాళ్ళు మీడియాపై ఏ విధంగా గుత్తాధిపత్యం సాధించారు?

ప్రజలు తమ మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌లతో ఇంటర్నెట్‌కు అనుసంధానం కావటంతో దాని కనెక్షన్‌లు అసాధారణంగా విస్తరించాయి. ఈ విధంగా పెరిగిన కనెక్షన్‌లతో మన వివరాలను సేకరించి, మనను సరుకుల్లాగా యాడ్స్ ఇచ్చేవారికి అమ్ము

తున్నారు.

ఇదివరకటి ప్రచార సాధనాలకు, డిజిటల్ మీడియాకి వ్యవస్థాగతంగా ఒక తేడా ఉంది. పాతకాలపు మాధ్యమాలలో మీడియా కంపెనీలు విషయాన్ని (కంటెంట్) తయారు చేసి తమ పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసేవారు. కానీ అంతర్జాలం వచ్చిన తరువాత వినియోగదారులు విషయాన్ని రూపొందించుకుంటారు. అంతర్జాలమే పంపిణీ వ్యవస్థ కూడా. అది ఇప్పుడున్న టెలికం మౌలిక సదుపాయాలపైన ఆధారపడి పనిచేస్తుంది. ఈ రోజు అంతర్జాలంలో రూపొందించబడిన వెబ్ పేజీలలో సగం, దానితో అనుసంధానమైన ప్రజలకు సంబంధించినవి. వాటికి ఫేస్‌బుక్, చైనా వారి సామాజిక మాధ్యమాలను కూడా కలిపితే వాస్తవంలో అంతర్జాలాన్ని ఉపయోగించే ప్రతి వ్యక్తి ఉత్పత్తిదారుడు, వినిమయదారుడు. వీటికి వీడియోలను తయారు చేసేవారిని, యు ట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లు, టిక్ టాక్ వంటివి చేరిస్తే వినియోగ దారులు తయారు చేసే విషయాలు ఎంత ఎక్కువంటే దానితో ఏ మీడియా సంస్థకూడా పోటీ పడలేదు.

కొత్తగా వచ్చిన ఏ మీడియా గుత్తాధిపత్య సంస్థ కూడా కొత్త విషయాలను తయారు చేయడం లేదు. కానీ తయారు చేసేవారికి వేదికలను కల్పిస్తున్నాయి. వారు తయారు చేసిన విషయాలను ప్రసారం చేయడానికి ఈ వేదికలు ఉపయోగ పడుతున్నాయి. అందువలనే వారిని' మధ్యవర్తులని 'అంటున్నాము. వినియోగదారులే ఎక్కువగా విషయాలను, సమాచారాన్ని ఉత్పత్తి చేస్తుండడం వలన ప్రభుత్వ, ప్రైవేటు సమాచారాల మధ్య అంతరం వెనుకటి శతాబ్దాలకన్నా కుంచించుకుపోతున్నది. ఫేస్‌బుక్‌లో గాని, ట్విట్టర్‌లో గాని ఒక విషయాన్నీ పోస్ట్ చేసిన వారు తాము ఆ సంభాషణని ప్రైవేటు పేజీలలో పెట్టామని భావిస్తారు, కానీ నిజానికి అవి పూర్తి బహిరంగంగా ఉంటాయి.

గూగుల్, ఫేస్‌బుక్‌ల అంతిమ లక్ష్యం ప్రకటనలు చేర్చడం. అయితే ప్రజలు ఆ వేదికలను ఉపయోగించుకునే తీరు వేరుగా ఉంటుంది. గూగుల్‌ని అన్వేషణకు(సెర్చ్) ఎక్కువగా ఉపయోగించుకుంటారు. అందులో దానికి గుత్తాధిపత్యం ఉంది. ముందుగా ఈ రంగంలోకి ప్రవేశించినందువలన దానికి ఆధిపత్యం వచ్చింది. అందువలనే అది యూట్యూబ్, ప్రీమియర్ వీడియోలను ప్రచారం చేసే సంస్థను, ఐ ఫోన్లలో తప్ప ఇతర ఫోన్‌లలో వాడే ఆండ్రాయిడ్ అనే ఆపరేటింగ్ వ్యవస్థను సొంతం చేసుకోగలిగింది. మరింతగా విస్తరించగలిగింది.

**"కొత్తగా వచ్చిన ఏ మీడియా గుత్తాధిపత్య సంస్థ కూడా కొత్త విషయాలను తయారు చేయడం లేదు. కానీ తయారు చేసేవారికి వేదికలను కల్పిస్తున్నాయి. వారు తయారు చేసిన విషయాలను ప్రసారం చేయడానికి ఈ వేదికలు ఉపయోగ పడుతున్నాయి. అందువలనే వారిని' మధ్యవర్తులని 'అంటున్నాము. వినియోగ దారులే ఎక్కువగా విషయాలను, సమాచారాన్ని ఉత్పత్తి చేస్తుండడం వలన ప్రభుత్వ, ప్రైవేటు సమా చారాల మధ్య అంతరం వెనుకటి శతాబ్దాలకన్నా కుంచించుకుపోతున్నది."**



ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టం ఉచితమే అయినప్పటికీ గూగుల్ కి దానిపై ఉన్న ఆధిపత్యం కారణంగా దానిని వాడే మొబైల్ వినియోగదారులు అందరూ గూగుల్ విధించిన షరతులకు అంగీకరించవలసి వస్తున్నది. దానితో వచ్చే పరిమితులను, ఇతర జతచేసిన యాప్స్‌ను వినియోగించవలసి వస్తున్నది. గూగుల్ అనుసరిస్తున్న ఈ పోటీ వ్యతిరేక విధానానికి కాంపిటీషన్ కమిషన్ అఫ్ ఇండియా తీవ్రమైన అభ్యంతరాన్ని తెలిపింది. చైనా ఫోన్స్ ఉత్పత్తి సంస్థ హ్యూ వావియే పై అమెరికా ఆంక్షలు విధించడంతో అది గూగుల్ ప్లే స్టోర్ ను వినియోగించుకోలేక తన సొంత యాప్‌ను అభివృద్ధి చేసుకుంది. ఎక్కువమంది వాడే యాప్‌లను ఆ రకంగా చైనా వినిమయదారులకు అందుబాటులో లేకుండా చేసింది.

మనం గూగుల్ ఉత్పత్తులు – జి మెయిల్, ఆండ్రాయిడ్ ఓ ఎస్ గల మొబైల్స్– వేటిని వాడినా గూగుల్ మనం ఉండే స్థలాన్ని అడుగుతుంది, మన స్నేహితులు, మనం వాడే వెబ్ సైట్లు వగైరాలు తెలుసుకుంటుంది. మన కంప్యూటర్లలో కుకీలను ప్రవేశపెట్టడానికి అనుమతి కోరుకుంటుంది. ఇవన్నీ తన ప్రకటనలకు సమర్ధవంతంగా ఉపయోగించుకోడానికి గూగుల్‌కు పనికి వస్తాయి. అంటే గూగుల్‌లో ప్రకటనలకు ఇచ్చిన సొమ్ము మరే ఇతర ప్రకటనల వేదికలకన్నా సమర్ధవంతంగా ఉపయోగ పడుతున్నదన్న మాట. పేస్‌బుక్ ఇందుకు మినహాయింపు.

మరో అతిపెద్ద గుత్త సంస్థ ఫేస్‌బుక్ డిజిటల్ మార్కెట్‌లో మరో మార్గాన్ని ఎంచుకుంది. అది మన కోసం కొంత స్థలాన్ని కేటాయించింది, అందులో మన స్నేహితులను, బంధువులను కలుసుకోగలం. ఫేస్‌బుక్ మన విషయం సేకరణ చేసి దానిని అంతర్జాలంలో మన బంధువులతో, స్నేహితులతో పంచుకునేటట్టు చేస్తుంది, తద్వారా మనలను ఉపయోగించుకుని ధనాన్ని సంపాదిస్తుంది. వినిమయదారులను అమ్మడంలో ఇది దాదాపు గూగుల్ వంటిదే. ఈ మధ్య దాని మార్కెట్

> **❝ బంధువులను ,స్నేహితులను కలిపే మొదటి సంస్థ ఫేస్‌బుక్ కానట్టే గూగుల్ కూడా ఒకే ఒక సెర్చ్ ఇంజిన్ కాదు. కానీ మార్కెట్లోకి వచ్చిన మొదటిది అవడం వలన గాని, ఫలితాలు మెరుగ్గా, నిష్పక్షపాతంగా ఉండడం వలన గాని లేదా కేవలం అదృష్టం అనుకూలంగా ఉండడం వలన గాని తరువాతి కాలంలోట్విట్టర్, టిక్‌టాక్ లాగే గూగుల్ ప్రాచుర్యం పొందింది. ❞**

విలువ దారుణంగా పడిపోక ముందు, దాదాపు ఆపిల్, మైక్రో సాఫ్ట్, ఆల్ఫాబెట్, అమెజాన్ కి మించి లక్షకోట్ల డాలర్లకు పైగా ఉండేది. వినిమయదారులను అమ్మలేకపోవటం కాక, పేస్‌బుక్ యజమాని జుకర్‌బర్గ్ తన కొత్త ప్రాజెక్టు మెటవేర్స్‌లో పెట్టే పెట్టుబడికి అంతగా లాభాలు రావేమో అన్న మదుపరుల అనుమానం దాని మార్కెట్ పడిపోడానికి కారణం. అందువలన భవిష్యత్తులో పెట్టిన పెట్టుబడులపై ఊహించినంత లాభాలు రావేమో అన్న భయం తప్ప ఫేస్‌బుక్ విలువ పడిపోడానికి మరో కారణం లేదు.

బంధువులను ,స్నేహితులను కలిపే మొదటి సంస్థ ఫేస్‌బుక్ కానట్టే గూగుల్ కూడా ఒకే ఒక సెర్చ్ ఇంజిన్ కాదు. కానీ మార్కెట్లోకి వచ్చిన మొదటిది అవడం వలన గాని, ఫలితాలు మెరుగ్గా, నిష్పక్షపాతంగా ఉండడం వలన గాని లేదా కేవలం అదృష్టం అనుకూలంగా ఉండడం వలన గాని తరువాతి కాలంలోట్విట్టర్, టిక్‌టాక్ లాగే గూగుల్ ప్రాచుర్యం పొందింది.

ఏ వార్తాపత్రిక అయినా, టి వి ఛానల్ అయినా తన పై ధ్యాసను నిలుపుకోడానికి పెద్ద మొత్తాలు ఖర్చుచేస్తాయి. వార్తాపత్రికలు ముద్రణాయంత్రాలు, పంపిణీ వ్యవస్థ, వార్తసేకరణపై వెచ్చించవలసి వస్తుంది. అలాగే టి వి ల ఉత్పత్తిపై, వివిధ పంపిణీ ఛానళ్ళు అంతర్జాలంతో అనుసంధానంపై వెచ్చించవలసి వస్తుంది. గూగుల్, ఫేస్‌బుక్ లు ఏ వస్తువును ఉత్పత్తి చేయవు కాబట్టి వాటికి ఉత్పత్తి ఖర్చులు ఉండవు. అలాగే పంపిణీ ఖర్చులు కూడా ఉండవు. వినియోగదారులే విషయం (కంటెంట్) తయారు చేసుకుంటారు. టెలి కమ్యూనికేషన్ నెట్‌వర్క్ పంపిణీ నిర్వహిస్తుంది. వినియోగదారులకు ఆసక్తి కలిగించే సాధనాలు తయారు చేసుకోవడం లేదా మన స్నేహితులు, బంధువులకు ఆసక్తి కలిగించే అంశాలను ప్రకటించడం వాటి ముఖ్యమైన కర్తవ్యం.

అంతర్జాలంలో ప్రకటనలు చేసే పద్ధతి ఇతర వేదికలకన్నా భిన్నంగా ఉంటుంది. ఇతర ప్రసార మాధ్యమాల్లో ప్రసారం చేసేటప్పుడు ఆ నిర్మాణమే ఒకరి నుండి అనేక మందికి చేరే విధంగా ఉంటుంది. ఉదాహరణకు వార్త పత్రికలో వచ్చే ప్రకటన ఎంతమందిని ఆకర్షిస్తుందో తెలుసుకోడానికి వీలవదు. అలాగే రేడియో ద్వారా చేసిన ప్రకటన కూడా. దానిని అందుకునే వారెవరో చేరవేసే వారికి తెలియదు. టి వి ద్వారా కూడా నెల్సన్ రేటింగ్ పద్ధతి ద్వారా తెలియడమే. ఎంతమంది వీక్షిస్తున్నారో గ్రహించగలుగుతుంది. వీక్షకులకు కూడా కార్యక్రమాన్ని మార్చుకోడమో, లేదా టి వి కార్యక్రమం ఇష్టం లేకపోతే ఛానల్ మార్చేయడమో లేదా టి వి కట్టేయడమో చేయాలి. ఈ పద్ధతిలో కొంతమంది ప్రజలపై ప్రకటనలు గుప్పించడమే అవుతుంది, కొంతమంది మాత్రమే ఆ బ్రాండ్ గుర్తుపెట్టుకుంటారు, వస్తువులను కొంటారు.

అంతర్జాలంలో పద్ధతి వేరుగా ఉంటుంది. వారి వద్ద తమ వినియోగదారుల పూర్తి సమాచారం ఉంటుంది. గూగుల్ కి గాని ఫేస్‌బుక్ కి గాని మీ అమ్మకన్నా మీ విషయాలు బాగా తెలుస్తాయి. అంతర్జాలంలో మనం వినియోగించే వస్తువులు తెలుస్తాయి. కాబట్టి ఏ ప్రకటన మన కోసం చేయాలో అవే మనకు అందుబాటులోకి తెస్తుంది. ప్రకటనని అమ్మకంగా మార్చే నిష్పత్తి అధికంగా ఉంటుంది. మీరు గనుక ఒక వీడియో కెమెరాను గూగుల్‌లో వెతికితే, అన్ని రకాల వీడియో కెమెరాలను వారాల తరబడి గూగుల్ మీ ముందుంచుతుంది. మీ స్నేహితులు వీడియో గురించి వెతికినా, మీరు వారి స్నేహితులు కాబట్టి మీకు కూడా అటువంటి ఆసక్తి ఉండే అవకాశాలు ఉన్నాయి కాబట్టి మీ అంతర్జాలంలో కూడా వీడియో కెమెరాల ప్రకటనలు వస్తాయి. దీని ఫలితం స్పష్టంగా కనిపిస్తున్నది. పత్రికల ముద్రణా సంస్థలు ప్రకటనలను కోల్పోతుండడం వలన మూసివేతకు గురి కావలసి వస్తుండగా, టి వి ల ప్రకటనలు పెరుగుతున్నాయి. కానీ డిజిటల్ ప్రకటనలు మరింత వేగంగా పెరుగుతున్నాయి. 2017 లో డిజిటల్ మాధ్యమంలో ప్రకటనల ఆదాయాలు టి వి ప్రకటనల ఆదాయాలను మించిపోయాయి. డిజిటల్ మీడియాలో కూడా గూగుల్, ఫేస్‌బుక్‌లు 70 శాతం ఆదాయాలను పొందాయి.

### గూగుల్, ఫేస్‌బుక్ గుత్తాధిపత్యాన్ని ఎలా సంపాదించాయి?

గూగుల్, ఫేస్‌బుక్, రెండూ సాంకేతిక నైపుణ్యం గల వారి ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. ఈ రంగంలో వివిధ కంపెనీల సాంకేతిక నైపుణ్యంలో తేడాలు గ్రహించ గలగడం ప్రధానం. వారు అమ్ముతున్నది సాఫ్ట్ వేర్ కాదు. రెండూ, మనుగడలో ఉన్న ఉచిత సాఫ్ట్‌వేర్ సాధనాలనే వాడుతున్నాయి, వాటిని తమకు అనుగుణంగా మలుచుకుంటున్నాయి. ఇటువంటి సాధనాలే తాము మరింత వృద్ధి చెందడానికి బహిరంగ వనరులన్న(ఓపెన్ సోర్సెస్) విషయం కూడా వారు గ్రహించారు.

విషయాన్ని(కంటెంట్) రూపొందించిన వారితో గూగుల్, ఫేస్‌బుక్ తమ ఆదాయాలలో కొంత భాగాన్ని పంచుకోడం అన్నది అనుకునేంత చిన్న విషయం కాదు. యాడ్స్ బిడ్స్‌లో గూగుల్ ఏ విధంగా అక్రమాలకు పాల్పడుదతున్నదన్న అంశంపై గుత్తాధిపత్య నిరోధక కమిషన్ విచారణ జరుపుతున్నది. యూట్యూబ్ తన ప్రకటనల ఆదాయంలో 55 శాతం విషయ తయారీదారులతో పంచుకుంటున్నానని అంటుంది, కానీ మొత్తం ఎంత ఆదాయం వచ్చిందో చెప్పదు, అలాగే గూగుల్ మధ్యవర్తి కి ఎంత అందిందో చెప్పదు. అమెరికాలో నమ్మక ద్రోహం కేసులు, యూరప్, ఇంగ్లండ్‌లలో కాంపిటీషన్ కమిషన్‌ల ముందు వీటికి సంబంధించిన కేసులు నడుస్తూ ఉన్నాయి. ఇవి కూడా యూరప్‌లో గుత్తాధిపత్య చట్టాలను నీరుగార్చిన తరువాత అన్నమాట. అమెరికాలో చట్టాలనయితే మార్చలేదుగాని వాటిని బాగా బలహీనపరిచారు. అన్వయింపులు మారాయి, అసలు గుత్తాధిపత్యం సమస్య కాకుండా పోయింది. రెగ్యులేటరీ అధికారులు గుత్తాధిపత్య వ్యతిరేక చర్యలు తీసుకోవాలంటే ఈ గుత్తాధిపత్యం వలన వినిమయదారులు, పోటీదారులు నష్టపోయారని రుజువు చేయాల్సి ఉంటుంది.

మొదట్లో గూగుల్ సెర్చ్ ఇంజిన్‌గా అవతరించినప్పుడు, అది ప్రపంచంలోనే అతి

పెద్ద సంస్థ అవుతుందన్న అంచనా లేదు. కేవలం మనకు అవసరమైన విషయ సేకరణకు సహాయపడే విధంగానే ఉండేది. దాని నినాదం కూడా "ఎవరికీ హాని చేయవద్దు' అని ఉండేది. గుత్తాధిపత్యానికి ఎంత ముచ్చటైన పిలుపు! చెప్పేదానికి పూర్తిభిన్నంగా వాస్తవం ఉంది. గూగుల్ సహ వ్యవస్థాపకుడు లారి పేజి 2004 లో గూగుల్ సెర్చ్ ఉద్దేశం తాను వెతుక్కుంటున్న విషయం వరకు వినిమయదారుడిని తీసుకెళ్లడమని చెప్పాడు. కానీ ఈ రోజు మూడింట రెండొంతుల మంది తాము వెతుకుతున్నది దొరకకుండానే వెనుతిరగవలసి వస్తున్నది. మొబైల్‌లలో అయితే అయిదింట నలుగురు వెనక్కి పోవలసి వస్తున్నది. చాలా సందర్భాలలో గూగుల్ మరికొన్ని లింక్‌లకు దారి తీస్తున్నది. అందులోను అనేకసార్లు ఇతర గూగుల్ లింక్స్‌కి వెళ్ళ వలసి వస్తున్నది. అందువలనే గూగుల్ ఇంజిన్ అంతర్జాల అన్వేషణలో ముందున్నది.

అంతర్జాలం సెర్చ్ ఇంజిన్‌లలో గూగుల్ ఆధిపత్యం సమస్యలో ఒక భాగం మాత్రమే. నిజానికి ఇది రెండు వైపులా గుత్తాధిపత్యం కొనసాగిస్తున్నది. గుత్తాధిపత్యాన్ని గురించి పరిశోధనలు చేసిన ప్రముఖ పరిశోధకుడు దిన శ్రీనివాసన్ మాటల్లో, "ప్రకటనలలో ఒకే ఒక్క కంపెనీ, "గూగుల్" మొత్తం వ్యాపార ఆదాయం లో అగ్రస్థానంలోఉంది, ఆదేసమయంలో కొనుగోలుదారులకు, అమ్మకందారులకు మధ్య నడిపే మధ్యవర్తిత్వంలో కూడా అగ్రభాగాన ఉంది. పైగా గూగుల్ ప్రకటనల స్థలం అమ్మే అతి పెద్ద సంస్థ. "అంటే ప్రకటనల కోసం ఉన్న అంతర్జాల మార్కెట్‌ను గూగుల్ ప్రయోజనాలకు అనుగుణంగా తొత్తడం చేశారు. అందువలనే గూగుల్ కి వ్యతిరేకంగా అమెరికా లోని అనేక రాష్ట్రాలలో కేసులు నడుస్తున్నాయి.

తాను స్వచ్ఛందంగా బహిరంగ స్థలాన్ని ఉచితంగా అందిస్తున్నట్టు ఫేస్‌బుక్ చెప్పడం లేదు. అది అంతర్జాలంలో "కంచెవేసిన తోట". మనలను మన స్నేహితులు, బంధువులు లేదా మన ఆలోచనలు కలిసే వారితో అనుసంధానం చేస్తుంది. మనకి ప్రకటనలు అమ్ముతుంది. మనలను ఎక్కువ మందితో అనుసంధానించడమే దాని ధ్యేయం. అంటే మనలను ఫేస్‌బుక్‌లో నిలిపి ఉంచడమే దాని లక్ష్యం.

తన సెర్చ్ ఇంజిన్ ద్వారా మనం వెతుక్కుంటున్న విషయానికి చేరుస్తానని గూగుల్ నమ్మబలికింది. కాని ఫేస్‌బుక్ మొదటి నుండి చొచ్చుకు వచ్చే వారిని నివారించింది. ఉదాహరణకి గూగుల్ సెర్చ్ ఇంజన్లలో తన పేజీలను నమోదు చేయనివ్వదు. సెర్చ్‌లింక్‌లను చూపనివ్వదు. అందువలనే దానిని ప్రైవేటు తోట అని అంటారు. కేవలం వినిమయదారుని అనుమతితో మాత్రమే లోపలికి వెళ్ళగలం.

**" ఫేస్‌బుక్‌లో వినిమయదారులు భావోద్వేగాలతో కట్టుబడి ఉంటారు. అన్నిటికన్నా భయం, అసహ్యం బలమైన భావోద్వేగాలు. అటువంటి భావోద్వేగాల ప్రదర్శనతో వినిమయదారుల ధ్యాసను తనవైపు నిలిపి ఉంచుతుంది. ప్రజలు తమకు, ప్రజా సంబంధాలకు అవసరమైనంత అల్లరి చేసుకోవచ్చు, అయితే విద్వేష పోస్టుల, అసత్య వార్తల వేగం వారికి(ఫేస్ బుక్) తెలుసు. అదే వారి వ్యాపార నమూనాలో కీలకం. "**

మరప్పుడు ఫేస్‌బుక్ తన స్థలంలో వినిమయదారుని 'ధ్యాన'ను ఎలా నిలుపుకోగలుగుతున్నది? ఫేస్‌బుక్‌లో వినిమయదారులు భావోద్వేగాలతో కట్టుబడి ఉంటారు. అన్నిటికన్నా భయం, అసహ్యం బలమైన భావోద్వేగాలు. అటువంటి భావోద్వేగాల ప్రదర్శనతో వినిమయదారుల ధ్యాసను తనవైపు నిలిపి ఉంచుతుంది. ప్రజలు తమకు, ప్రజా సంబంధాలకు అవసరమైనంత అల్లరి చేసుకోవచ్చు, అయితే విద్వేష పోస్టుల, అసత్య వార్తల వేగం వారికి(ఫేస్ బుక్) తెలుసు. అదే వారి వ్యాపార నమూనాలో కీలకం.

కొత్త సాంకేతికతకి అసలైన సవాలు 'విషయం' ఎంత వేగంగా చేరుతుందని తప్ప, దాని ప్రభావం సమాజంపై ఎలా ఉంటుందని కాదు. ఇది డిజిటల్ సాంకేతికతకు పరిమితం కాదు.

కొత్తగా ముద్రణా యంత్రం అమలులోకి వచ్చినప్పుడు అది జన సమూహానికి విషయాలను చేరవేయడానికి ఎంతగానో దోహద పడింది, ప్రజలకు స్థానాన్ని కల్పించింది. చదివే వారి సంఖ్యను పెంచింది, జ్ఞానాన్ని ప్రజాతంత్రం చేసింది, సమాజాన్ని మార్చింది. అనేక వార్త పత్రికలూ వెలిసాయి, ప్రజలు విస్తారంగా చదవ గలిగారు. 'ముద్రణలో గుత్తాధిపత్యం, వార్తా పత్రికలు, జాతి రాజ్యాల ఆవిర్భావానికి కారణాలని' బెనెడిక్ట్ ఆండర్సన్ అంటాడు.

అయితే ముద్రణాలయాల పర్యవసానాలు ఇతరత్రా కూడా ఉన్నాయి. గుటెన్‌బర్గ్ ద్వారా యూరప్‌లో ముద్రణాలయాన్ని ప్రారంభించినప్పుడు ముద్రించిన మొదటి, అత్యంత ప్రాచుర్యం పొందిన పుస్తకం బైబిల్. దీనిని గుటెన్‌బర్గ్ బిల్ అని పిలుస్తారు. రెండో ప్రసిద్ధి చెందిన పుస్తకం మలియోన్ మాలెఫికారం, అంటే మంత్రగత్తెల సుత్తి, మతనియమాలకు భంగం కలిగించటం గురించి మతగువులు చేసిన విమర్శలతో ఉన్న చిన్న పుస్తకం ఇది. మత నియమాలకు భంగం కలిగించడం వలన ఎంతమంది చనిపోయారు? యూరప్‌లో జాతీయవాదుల వల్ల చనిపోయినవారెందరు? దోచుకోబడిన, జాతుల హననం వలన బలైనవారు, ఆసియా, ఆఫ్రికాలో అమెరికా సామ్రాజ్యవాద శక్తుల బానిసత్వం కింద నలిగిన వారిగురించి ఈ పుస్తకంలో ఉంటాయి.

కానీ ప్రజాబాహుళ్యం చరిత్రలో ముందడుగు వేయడంలో ముద్రణాయంత్రం పాత్రను మాత్రమే మనం పరిగణిస్తాము. అది ప్రజలను ప్రజా సమస్యలలో భాగస్వాములను చేయడానికి, అంతవరకూ ఉన్న భూస్వామ్య వ్యవస్థలో ఉన్నతకులాలకే పరిమితమైన అక్షరజ్ఞానం ఇతర వర్గాలకు అందించడానికి, కార్మిక వర్గాన్ని విస్తృత పరచానికి ఉపయోగపడింది. లెనిన్ 'ఇస్క్రా' (బోల్షివిక్ పార్టీ పత్రిక) ని కేవలం పార్టీ అభిప్రాయాలు తెలియచేసే పత్రికగా మాత్రమే కాక నిర్మాణానికి ఒక ఆయుధంగా చూడటం కాకతాళీయం కాదు.

సాంకేతికత తనంత తానే స్వేచ్ఛను తేలేదు, బానిసలను చేయలేదు. ఏ అభివృద్ధి చెందిన సాంకేతిక ప్రగతికయినా సామాజిక పర్యవసానాలు ఉంటాయి, అందులో కొన్ని ప్రయోజనకరంగా ఉంటాయి, కొన్ని నష్టాన్ని కలిగిస్తాయి. ఉత్పత్తి సామర్థ్యం పెంచే సాంకేతికత ఉత్పత్తిని పెంచుతుంది, సమాజానికి ప్రయోజనం చేకూరుస్తుంది. వర్గాలుగా విభజించబడిన సమాజంలో సంపద, అధికారం ఒక చోటపోగుపడడానికి అది దోహదపడుతుంది, సాంకేతికత అభివృద్ధి వలన లభించే ప్రయోజనాలు కూడా సమాజంలోని అన్ని తరగతులకు ఒకే విధంగా ఉండవు. అందువలన పోరాటం సాంకేతికతకి వ్యతిరేకం

> **" డిజిటల్ మీడియా స్థలంతో సమస్య ఏమిటంటే, ఇది వరకు చర్చించినట్టు, వ్యక్తిగత, బహిరంగ స్థలాల మధ్య దూరం కుంచించుకు పోతున్నది. ఫేస్‌బుక్‌లో ఒక పోస్ట్ పెట్టినా, యూట్యూబ్‌లో ఒక వీడియో పెట్టినా, లేదా ట్విట్టర్‌లో ఒక కామెంట్ చేసినా మనం వ్యక్తిగతమనుకుంటాము. కానీ అది జనబాహుళ్యానికి చేరుతుంది. అందులో విషయం కూడా ఏ ప్రజా సంస్థ, సెన్సార్ బోర్డు వంటివి నియంత్రించ లేనంత విస్తృతంగా వ్యాపిస్తాయి."**

గా కాదు, ఆ సాంకేతిక అభివృద్ధి ఎవరి సొంతం, సమాజంలో అభివృద్ధి చెందిన ఉత్పత్తి శక్తులు ఎవరి ప్రయోజనాల కోసం వాడబడుతున్నాయన్నదే ప్రధానం.

ముద్రణ యంత్రాలు, వార్తాపత్రికలు రావడంతో ప్రకటనల పరిశ్రమ వచ్చింది. అది పెట్టుబడిదారీ దేశాలలో ప్రజల గళం వినిపించడానికి దోహదపడింది. పాముకాటుకు నూనెలు, కామోద్దీపనలు, మాదక ద్రవ్యాల ప్రకటనలు– కోకాకోలాలో మొదట్లో కొకైన్ ఉండేది– వార్తాపత్రికలకు, ఆ తరువాతి కాలంలో రేడియో, టివి లకు ధనాన్ని చేకూర్చింది. కొన్ని రకాల ప్రకటనలు చాలా దేశాలలో అధికారికంగా నిషేధించినప్పటికీ, ప్రకటనల ముఖ్య ఉద్దేశం మన దేశంలో, మన కొనుగోళ్లను బాగా పెంచాలన్నదే. ఉదాహరణకి ఒక సుగంధద్రవ్యం లేదా ఒక ముఖ వర్చస్సు పెంచే క్రీమ్. అవి సమాజంలో దురభిమానాలను పెంచుతుంటాయి. అటువంటి వాటిలో సంస్కరింపబడినవి ఫెయిర్ అండ్ లవ్లీ ప్రకటనలు. నల్లజాతివారు నేరస్తులని, సహజంగానే హింసాత్మకంగా ఉంటారని అమెరికాలో క్రమం తప్పకుండా ప్రచారం జరుగుతుంటుంది. ప్రజాభిప్రాయాన్ని మలచగల మీడియానే ఒక ముసోలినీని, ఒక హిట్లరుని సృష్టించింది. ముసోలినీ రేడియో ప్రసంగాలు, లెని రీఫెన్స్టాహి చిత్రాలు జనబాహుళ్యానికి వ్యతిరేకంగా శక్తివంతమైన ఆయుధాలని తెలియచేసే ఉదాహరణలుగా ఉన్నాయి.

పాముల నూనె ప్రకటనల వలన ఏ వస్తువులకు ప్రకటనలు ఇవ్వవచ్చు, వేటి గురించి ప్రకటనలు చేయకూడదు అనే చట్టాలు చేయబడ్డాయి. ఈ చట్టాలు మందులుగా చలామణి ఆయే వస్తువులను నియంత్రిచాయి. ఇక్కడ రాందేవ్ బాబా, పతంజలి సామ్రాజ్యంలో మందులైనా, అమెరికాలో ఓపిఒడిస్ అమ్మే మందులైనా సమస్య అల్లా ఈ చట్టాలను ఉపయోగించే ఉద్దేశం ఉన్నదా లేదా అన్నదే.

పైగా మీడియాకి రాజకీయాలలో మంచి పట్టు ఉంటుంది. అందువలన కూడా గుత్తాధిపత్యాన్ని నియంత్రించాలి. దురదృష్టవశాత్తు గుత్తాధిపత్య కమిషన్లను, చట్టాలను బలహీన పరచడం, వాటిని పోటీ కమిషన్లగా మార్పులు చేయడం జరుగుతున్నది. గుత్తాధిపత్యం వలన ప్రజలు గాని, కంపెనీలు గాని నష్టపోనంతవరకు అవి ఆమోదయోగ్యంగా పరిగణించబడు తున్నాయి. చాలా దేశాలలో ఏం ప్రచురించాలి, ఏమేమి ప్రచురించకూడదు అనే వాటి పై చట్టాలు ఉన్నాయి.

డిజిటల్ మీడియా స్థలంతో సమస్య ఏమిటంటే, ఇది వరకు చర్చించినట్టు, వ్యక్తిగత, బహిరంగ స్థలాల మధ్య దూరం కుంచించుకు పోతున్నది. ఫేస్‌బుక్‌లో ఒక పోస్ట్ పెట్టినా, యూట్యూబ్‌లో ఒక వీడియో పెట్టినా, లేదా ట్విట్టర్‌లో ఒక కామెంట్ చేసినా మనం వ్యక్తిగతమనుకుంటాము. కానీ అది జనబాహుళ్యానికి చేరుతుంది. అందులో విషయం కూడా ఏ ప్రజా సంస్థ, సెన్సార్ బోర్డు వంటివి నియంత్రించ లేనంత విస్తృతంగా వ్యాపిస్తాయి. అందువలన ప్రభుత్వాలు డిజిటల్ మీడియా స్వయం నియంత్రితంగా ఉండాలని కోరుకుంటున్నాయి. ఫేస్‌బుక్, గూగుల్ వంటి సంస్థలు అసత్య ప్రచారాలను వడకట్టగల సామర్థ్యం కలిగి ఉండాలి. బడా డిజిటల్ సంస్థలను భారతదేశ ప్రభుత్వం కూడా కోరుతున్నది అదే.

ఏ విషయాలు సెన్సార్ చేయబడాలి, ఏవి చేయబడకూడదు అని నేను ఇక్కడ చర్చించడం లేదు. మానవులు తీసుకోవలసిన నిర్ణయాలు యాంత్రికంగా తీసుకుంటే వచ్చే సమస్యలను గురించి కథే ఓ నెయిల్ తన వెపన్స్ అఫ్ మథ్ డెస్ట్రక్టిన్ అనే పుస్తకంలో చర్చించారు. సమస్య అల్లా– ఏది నష్టం, ఏది లాభం అన్నదానిని లెక్కల ద్వారా పరిష్కరించలేం.

సమస్య విషయంపై ఎవరి పరిశీలన ఉండాలనేది కాదు. విషయం తయారుచేసేవారు – వాటిని ఉపయోగించుకునే వినియోగదారుల వేదికలు–చట్టాలను అనుసరించాలి. అలా చేయక పోతే రాజ్యం, విషయం రూపొందించేవారు కలిసి ఏ విషయాలను తయారు చేయాలో నిర్ణయించాలి. సమస్య అల్లా ఈ వేదికలు వస్తువులను అమ్మడంలో మాత్రమే శక్తివంతమైనవి కాక, వారు ఎన్నికలలో అభ్యర్థులను, శాసనసభ్యులను, వారికి అవసరమైన చట్టాలను కూడా "అమ్మగలరు". వాళ్ళను కాపలా ఉండమని కోరటం అంటే గొర్రెలకు కాపలా ఉండమని తోడేలును అడగడం అవుతుంది.

గత శతాబ్దాలలో చమురు కంపెనీలు, ఆర్థిక సమూహాల కన్నా ఈ సంస్థలు అత్యంత శక్తివంతమైనవి. వాటి నికర విలువలు, లేదా మార్కెట్ కాపిటలైజేషన్ చాలా దేశాల స్థూల జాతీయోత్పత్తికన్నా ఎక్కువ.

మనకి ఒక ప్రత్యామ్నాయ విధానం కావాలి. బడా చమురుసంస్థలు, ఎటి అండ్ టి లను చిన్నవిగా చేసినట్టే ఈ గుత్త సంస్థలను కూడా చిన్న సంస్థలుగా రూపొందించాలని టీం వు తన పుస్తకం ది కర్స్ అఫ్ బిగ్‌నెస్‌లో అంటారు. ఇంటర్నెట్ లో ఈ వేదికలు అత్యంత మౌలిక మైనవి, వీటిని ప్రజా ప్రయోజనాలు చేకూర్చేవిగా నియంత్రించాలి లేదా ప్రభుత్వాలు సొంతం చేసుకోవాలి అని ది ఢిల్లీ డిక్లరేషన్ ఫర్ జస్ట్ అండ్ ఈక్విటబుల్‌లో ది జస్ట్ నెట్ క్వాలిటిస్ అన్నారు.

సాంకేతికత అవకాశాలు కల్పిస్తుంది. సామాజిక, ఆర్థిక నిర్మాణాలతో సహా ఆ అవకాశాలను వాస్తవాలుగా చేసుకోవలసిన బాధ్యత మనది. ప్రజాబాహుళ్యానికి అవసరమైన సాంకేతికతలో పెద్ద ఎత్తున మార్పులు– సెర్చ్ ఇంజిన్‌లలో, సామాజిక మాధ్యమాలలో ఆర్థిక వేదికలలో – జరగకపోతే ఇది సాధ్యపడే విషయం కాదు. ఇప్పుడప్పుడే ఇటువంటి మార్పులు సాధ్యపడేటట్టు కనిపించడం లేదు. ఒకసారి ఇటువంటి మార్పులు రావడం మొదలైతే, వాటిని మానవుల అభ్యున్నతికి, మరింత మానవత్వంతో నిండిన సమాజ రూపకల్పనకు ఎలా ఉపయోగించాలో ఆలోచించాలి. ఆడియో, వీడియో, ముద్రణలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు ఎవరి అధీనంలో ఉండాలి అన్నదే కీలకమైన ప్రశ్న. అవి ఈ దేశంలోని పెట్టుబడిదారుల చేతుల్లోనా లేక కార్మికవర్గం చేతుల్లో ఉండాలా? ప్రజల మీడియా, ప్రజల యాజమాన్యంకు సంబంధించి చరిత్ర మన ముందుంచిన సవాలు ఇది.

**(అనువాదం: కె ఉషారాణి)**

**ప్రత్యామ్నాయ సంస్కృతి-2**

# నేటికీ కొనసాగుతున్న ఫ్యూడల్ సంస్కృతి


రచయిత సిపిఐ(ఎం) తెలంగాణా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

**ఎస్ వీరయ్య**

సమాజంలో పెట్టుబడిదారీ సంస్కృతి వేగంగా విస్తరిస్తున్నది. కానీ పాతకాలపు ఫ్యూడల్ సంస్కృతి మాసిపోలేదు. ఆధునిక పెట్టుబడిదారీ సంస్కృతీ, భూస్వామ్య సంస్కృతి సహజీవనం గమనించదగిన విషయం. మరోవైపు అనేకచోట్ల భూస్వామ్య విలువల సడలింపు కూడా గమనించవచ్చు. ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగా విస్తరిస్తున్న అవినీతి, విలువల వలువలూడదీయటం చూస్తూనే ఉన్నాం. కులం, మతం, మూఢ నమ్మకాలు, సంప్రదాయాలు, పురుషాధిక్యత, ఆధిపత్య ధోరణులు సమాజం మీద బలమైన ప్రభావం చూపుతున్నాయి. శ్రామిక ప్రజల జీవితాలతో పెనవేసుకున్నాయి. అందుకే ఫ్యూడల్ సాంస్కృతిక సంబంధాలను విస్మరించలేము.

ఒకప్పుడు వెదురు బుట్టలు, మట్టికుండలు, బస్తా సంచులు (గోనె సంచులు), బిందెలు, చెంబులు, చేనేత, రేకు పెట్టెలు, ఎడ్లబండి, నాగలి, కుట్టిన చెప్పులు మానవ జీవితంలో అంతర్భాగం. వాటి ఉత్పత్తి, వాడకం నిత్యకృత్యం. వీటితో సంబంధం లేని కుటుంబాలను ఊహించలేము. ఇపవిడు ఇవేవీ లేని కుటుంబాలే అత్యధికం. అవసరం కోసం ఉత్పత్తి ఇప్పుడు అమ్మకం కోసం ఉత్పత్తిగా మారింది. ఇంటిదగ్గర పాడి, ఇంటింటికి తిరిగి అమ్మకం స్థానంలో పాలడైరీలు వచ్చాయి. రైతులు ఇంటింటా కోళ్ళు పెంచటం కనుమరుగవుతున్నది. గొర్రెలు, మేకల పెంపకం ఇంకా ఉన్నప్పటికీ పరిశ్రమగా రూపు దాల్చటం మొదలైంది. మత్యకారుల వృత్తిని కాంట్రాక్టర్ల వ్యవస్థ కబళించింది. తాటికల్లు, ఈతకల్లు గీత తగ్గిపోతున్నది. మద్యం అమ్మకాలు విస్తరిస్తున్నాయి. చేనేతను మిల్లు మింగేసింది. కుట్టిన చెప్పుల స్థానాన్ని కంపెనీ చెప్పులు ఆక్రమించాయి. గోనెసంచులను, చేతి సంచులను ప్లాస్టిక్ పట్టేసింది. రేకు పెట్టెల స్థానంలో సూట్‌కేసులు, తోలు, రెగ్జిన్ సంచులు వచ్చాయి. బిందెల స్థానంలో వాటర్ బబుల్స్, బాటిల్స్ చేరాయి. కుండల స్థానాన్ని గిన్నెలాక్రమించాయి. ఒక్కటేమిటి... కులవృత్తులు కనుమరుగవుతూ కంపెనీ సరుకులు విస్తరిస్తున్నాయి. ఫర్నీచర్ వర్క్‌షాపులూ, ఆధునిక హెయిర్‌కటింగ్ సెలూన్లు, బ్యూటీపార్లర్లూ విస్తరిస్తున్నాయి. ఇంటింటా వాషింగ్ మిషన్లు వచ్చేసాయి. సంప్రదాయ సేవలను ఆధునిక సేవలు ఆక్రమిస్తున్నాయి. పుట్టుకను బట్టి వృత్తి నిర్ణయించే పద్ధతి కనుమరుగవుతున్నది. కులవృత్తులు క్షీణిస్తూ ఆధునిక వృత్తులు విస్తరిస్తున్నాయి. కానీ పుట్టుకను బట్టి కులం నిర్ణయించటం, కుల కట్టుబాట్లు, కులవివక్ష కొనసాగుతున్నాయి. కులం పరిధిలోనే పెండ్లి సంబంధాలు ఏర్పడుతున్నాయి.

విజ్ఞానం విస్తరించని కాలంలో సమాజంలో ఆధిపత్యం చెలాయించడానికి ప్రజల అజ్ఞానాన్ని ఫ్యూడల్, రాచరిక వ్యవస్థ సమర్ధవంతంగా వాడుకున్నది. ఎండకూ, వానకూ, ఉరుములకూ, మెరుపుకూ, రాత్రికీ, పగలుకూ కారణం తెలియని కాలంలో ఆదివాసీలు అదృశ్య శక్తులను ఊహించుకున్నారు. తమకు ఉపయోగపడేవాటిని ఆరాధించారు. భయపెట్టిన వాటిని సంతృప్తిపరిచి రక్షణ పొందాలనుకున్నారు. క్రమంగా దేవుడూ, దెయ్యాల గురించిన విశ్వాసాలుగా రూపుదిద్దుకున్నాయి. మతాలు, మత విశ్వాసాలుగా మార్పు చెందాయి. రాజాస్థానాలలోని పండితులూ, ప్రజా జీవనంలో పురోహితులూ వీటికి సిద్ధాంత రూపం ఇచ్చారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్నప్పటికీ మత విశ్వాసాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆస్థానాలూ, ఆస్థాన పండితులూ పోయినా, ఆధునిక సిద్ధాంతాలు వచ్చినా, మత విశ్వాసాలు బలంగానే కొనసాగుతున్నాయి. అదే సమయంలో మానవ జీవనయానం శ్రమను దాటి పోజాలదు కదా! ఉత్పత్తితో తన బాంధవ్యాన్ని తెంచుకుని మనజాలదు కదా! అందుకే పండుగలూ, పెండ్లి వేడుకలూ, ఆయా సందర్భాలలో ఆచరించే సంప్రదాయాలూ, అమలుచేసే క్రతువులూ వ్యవసాయం, వృత్తులతో పెనవేసుకుని ఉంటాయి. పాత ఉత్పత్తి సంబంధాల ఆనవాళ్ళు ప్రతిబింబిస్తూ ఉంటాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు విస్తరిస్తున్నప్పటికీ కొన్ని సంప్రదాయాలు ప్రాసంగికత (రెలవెన్స్) కోల్పోతున్నప్పటికీ సంప్రదాయాల పేరుతోనూ, గుడ్డి నమ్మకాలుగానూ కొనసాగుతున్నాయి. మహానగరాలలో, ఆధునిక సౌకర్యాలతో అట్టహాసంగా జరిగే పెండ్లిలో కూడా వధూవరుల కులబంధం నిలిచే ఉన్నది. కుల సంబంధ బాంధవ్యాల వేదికగా పెండ్లి వేడుక కొనసాగుతున్నది. సంప్రదాయ క్రతువులు నిర్వహిస్తూనే ఉన్నారు. తాళి, ముహూర్తం సహజమైనవిగానే సాధారణ ప్రజలు నమ్ముతున్నారు. పెండ్లి తంతు అయినా, చావు క్రతువులైనా ఈ నమ్మకాల పరిధి దాటి పోవటం అరుదు. తల్లిదండ్రులు మరణిస్తే గుండు గీయించుకుంటారు. పిండాలు పెడతారు. బతికి ఉన్నపుడు పట్టెడన్నం మెతుకులు కూడా పెట్టని సంతానం కూడా చచ్చిన తర్వాత క్రతువులు మాత్రం వదులుకోరు. పిల్లల పుట్టు వెంట్రుకలు తీయటం సహజమే కదా అన్నట్టు భావిస్తున్నారు. గృహ నిర్మాణం, గృహ ప్రవేశాలే కాదు... స్వాతంత్ర్య దినోత్సవం రోజున జెండావిష్కరణ దగ్గర కూడా మతపరమైన క్రతువులు చేరుతున్నాయి. కొబ్బరికాయలూ, అగర్‌బత్తీలు దర్శనమిస్తున్నాయి. స్వాతంత్ర్యం సాధించుకున్న సంతోష సూచికగా పంచుకున్న పప్పు బెల్లాల స్థానంలో ప్రసాదం చేరుతున్నది. ఆఖరుకు మేడేను కూడా వదలటంలేదు.

పండుగలకు చారిత్రక నేపథ్యం ఉన్నది. ప్రకృతి, వ్యవసాయం, వృత్తులు, ఆర్థిక,

> **"మహిళను చిన్నచూపు చూడటం ఫ్యూడల్ సమాజపు జాడ్యం. భర్త మరణిస్తే బొట్టు, గాజులు కూడా తీసేసి తెల్లచీర కట్టుకోవాలన్న సామాజిక రుగ్మత ఇప్పటికీ కొందరు పాటిస్తున్నారు. వీరు మరో పెండ్లి చేసుకోకూడదనీ, పురుషులకు ఎదురుపడగూడదు అన్న ఆంక్షలు కూడా ఒకప్పుడు బలంగానే ఉండేవి. భార్య అంటే భర్తకు సేవలు చేయాలన్న భావన బలంగా వ్యాపించి ఉన్నది."**

సామాజిక మార్పుల సూచికలుగా కొన్ని పండుగలు గమనించవచ్చు. ఉగాది, సంక్రాంతి, పశువుల పండుగ, బతుకమ్మ వంటి పండుగలు ఈ కోవకే చెందుతాయి. ఆధిపత్య భావజాలం ప్రభావితం చేసే పండుగలు కూడా ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థ పరిణామక్రమంలోనే వీటి ప్రాసంగికత (రెలవెన్స్) చూడాలి. కానీ సంప్రదాయాలుగానూ, గుడ్డి విశ్వాసాలుగానూ కొనసాగుతున్నాయి. సాధారణ ప్రజలు వీటికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. మాతృస్వామ్య వ్యవస్థ సూచీలుగా మిగిలిన గ్రామీణ దేవతల స్థానంలో పురుషాధిక్యత ప్రభావంతో పురుష దేవుళ్ళకు ప్రాధాన్యత పెరిగింది. శ్రమ సంబంధిత దేవుళ్ళు, పండుగల స్థానంలో క్రమంగా పురుషాధిక్య, ఆధిపత్య ధోరణులు బలపడ్డాయి.

మహిళను చిన్నచూపు చూడటం ఫ్యూడల్ సమాజపు జాడ్యం. భర్త మరణిస్తే బొట్టు, గాజులు కూడా తీసేసి తెల్లచీర కట్టుకోవాలన్న సామాజిక రుగ్మత ఇప్పటికీ కొందరు పాటిస్తున్నారు. వీరు మరో పెండ్లి చేసుకోకూడదనీ, పురుషులకు ఎదురుపడగూడదు అన్న ఆంక్షలు కూడా ఒకప్పుడు బలంగానే ఉండేవి. భార్య అంటే భర్తకు సేవలు చేయాలన్న భావన బలంగా వ్యాపించి ఉన్నది. ఇద్దరూ వృత్తి చేసే కుటుంబంలో కూడా ఇలాంటి ధోరణి పోలేదు. భర్త తిన్న పళ్ళెం ఎత్తటం, భర్త వదిలేసింది తినటం, భర్త తిన్న తర్వాత తినటం, అత్తమామల ముందు కూర్చోకూడదన్న ఆంక్షలు అనేకచోట్ల కొనసాగుతున్నాయి. అమ్మాయిలను చదివిస్తే కట్నం ఎక్కువ ఇచ్చి, అంతకన్నా ఎక్కువ చదివినవారికి పెండ్లి చేయాల్సి వస్తుందన్న భయం వెంటాడుతున్నది. మరోవైపు పేదరికంలో ఉన్న కుటుంబాలు మగబిడ్డలను చదివిస్తే చాలనుకుంటున్నారు. ఆడపిల్లలకు ఆస్తిలో వాటా లేదు. అన్నదమ్ముల మధ్యనే పంచటం సంప్రదాయంగా వస్తున్నది. కొన్ని కుటుంబాలలో ఇప్పటికీ ఆడపిల్లలు ఉద్యోగం చేయడాన్ని ఒప్పుకోరు. ఆడపిల్ల పుడితే బాధపడటం, మగబిడ్డ పుడితే సంతోషించటం ఇప్పటికీ ఉన్నది. హాస్పిటల్‌లో ఆయాలకు కూడా ఆడబిడ్డ పుడితే ఇచ్చే ముడుపుకన్నా మగబిడ్డ పుడితే ఎక్కువ. మగబిడ్డ వంశోద్ధారకుడనీ, ఆదాయమనీ, ఆడబిడ్డ భారమనీ, ఖర్చు అని మాట్లాడుకోవటం సర్వసాధారణమైంది. ఒకే సంతానం కలిగినపుడు కూడా అది మగబిడ్డ అయితే ఉండే సంతృప్తి ఆడబిడ్డ అయితే ఉండదు. స్కానింగ్‌లో గర్భంలో శిశువు ఆడబిడ్డ అని తెలిస్తే గర్భస్రావం చేయించే పరిస్థితులు కూడా దాపురించాయి.

అమ్మాయి పుష్పవతి అయితే అంటరానిదిగా చూడటం, వారం రోజులపాటు స్నానం కూడా లేకుండా మూలకు కూర్చోబెట్టటం ఇప్పటికీ అనేక కుటుంబాలలో ఉన్నది. మతం ఏదైనా మహిళను పురుషుడితో సమానంగా అంగీకరించలేదు. హిందూమతానికి పునాదిగా మత ఛాందసవాదులు చెప్పే 'మనుస్మృతి' మహిళను హీనంగా చిత్రీకరిస్తున్నది. బాల్యంలో తల్లిదండ్రుల పర్యవేక్షణలో, కౌమార్యంలో అన్నదమ్ముల పర్యవేక్షణలో, యవ్వనంలో భర్త పర్యవేక్షణలో, వృద్ధాప్యంలో కొడుకుల పర్యవేక్షణలో ఉండాలన్నది. స్త్రీకి స్వాతంత్ర్యం అర్హత లేదన్నది. పురుషులను మోహించి పతనం చేయటం స్త్రీల స్వభావం అంటుంది. ఇలాంటి భావజాలం భూస్వామ్య, రాచరిక సమాజాలలో ప్రజలను ఆవహించింది. ఇప్పటికీ ఆ ఛాయలు బలంగానే వ్యక్తమవుతున్నాయి. "వాడంటే మగవాడు. ఏం చేసినా చెల్లుతుంది. ఆడదానివి నీకెందుకే?" అనటం ఇప్పటికీ వింటున్నాం. ప్రేమించిన వాడితో కలిసిఉంటే లేచిపోయిందంటారు. లేదా ఉంచుకున్నాడంటారు. పెండ్లికి ముందే గర్భం దాల్చితే చెడిపోయిందంటారు. ఇవన్నీ పురుషాధిక్య భావజాలం నుంచి వచ్చిన ధోరణులే.

వందలు లేదా వేల ఎకరాల భూస్వామి పని చేయడు. పెత్తనం చేస్తాడు. అందువల్ల సమాజంలో సోమరితనానికి కల్తీ లేని ప్రతిబింబం భూస్వాములే! పైగా

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

పెత్తందారీతనం, ఆధిపత్యం, దబాయింపు వారి స్వభావం. ఎదుటి వ్యక్తి ఏదైనా కావాలంటే అడుక్కోవాలి. బతిమాలుకోవాలి. అప్పుడు దయతో దానం చేస్తాడు. హక్కులంటే సహించడు. సమాన గౌరవాన్ని ఒప్పుకోడు. పని చేసేవారు తలవంచుకుని చాకిరీ చేయాలి. తలెత్తి ప్రశ్నిస్తే భరించజాలడు. రవ్వంత కష్టం లేకుండానే పోగవుతున్న సంపద, చేతిలో ఉన్న అధికారంతో భోగలాలసత్వం కోరుకుంటాడు. సమాజంలో కనిపించే ప్రతి కొత్త వస్తువు తన సొంతం కావాలి. కంటపడిన ఆడపిల్లను అనుభవించాలి. సాధ్యం కాకపోతే కక్ష సాధింపులే ! గ్రామంలో ఎవరూ తనను ప్రశ్నించకూడదు. అందరూ శ్రమించేవారే కదా ! వారంతా ఏకమైతే చిక్కు సమస్యే! అందుకు కులం అందివచ్చింది. శ్రామికులను చీల్చేందుకు సాధనమైంది. కులవివక్షకు దారి తీసింది. ఈ ఆర్థిక పునాది పర్యవసానాలే భూస్వామ్య సాంస్కృతిక రూపాలు. భూస్వామి 'దయ'తో అప్పులిస్తాడు. భూమి కౌలుకు ఇస్తాడు. వడ్డీ, నాగు, కౌలు చెల్లించలేక పేదరైతులు, కూలీలు లొంగిఉండి వెట్టిచాకిరీ చేయాలి. అప్పు తీర్చలేని రైతు ఆత్మగౌరవం చంపుకోలేక ఆత్మహత్య చేసుకుంటాడు.

భూస్వామ్య దౌర్జన్యాల మీద పోరాడలేనపుడు, వివక్షను భరించలేనపుడు జానపద గేయాలు, సాంస్కృతిక రూపాలలో తమ బాధలు వ్యక్తం చేసారు. కుల పురాణాల పేరుతో తాము కూడా సామాజికంగా గొప్పవారమేనని చెప్పుకునే ప్రయత్నం చేసారు. ఆధిపత్యం, వివక్ష రాజ్యమేలిన ఫ్యూడల్ సమాజంలో పుట్టిన సామెతలన్నీ వాటికి ప్రతిబింబాలే! "ఉన్నది పోయింది, ఉంచుకున్నదీ పోయింద"న్న సామెత ఒక మచ్చుతునక. వాడే భాషలోనూ వివక్ష ప్రతిబింబించింది. 'నీరుగార్చారు' లేదా 'బలహీనపర్చారు' అనదగిన విషయానికి 'నిర్వీర్యం' చేసారన్న మాటను వాడారు. పిచ్చుకుంట్ల, లంజెముండ, గాజులు తొడుక్కున్నావా?, ఆడంగులోడు, పెండ్లాం ముండమోయ, లంగ లాంటి తిట్లన్నీ వివక్షకు ప్రతిరూపాలే కదా! కానీ ఇలాంటి మాటలు సామాన్య ప్రజల వాడుకలో సర్వసాధారణమైనాయి.

వ్యక్తిపూజ, వ్యక్తి ఆరాధన, నాయకుడికి లేదా నాయకురాలికి అనుచరులుగా ఉండటం, భజనపరులుగా ఉండటం, పొగడ్తలు ఫ్యూడల్ సమాజపు లక్షణాలే. ఆత్మవంచనతో అనుచరులుగా వ్యవహరించటమే. తమనుతాము పాదసేవకులుగా, బానిసలుగా

**"భూస్వామ్య దౌర్జన్యాల మీద పోరాడలేనపుడు, వివక్షను భరించలేనపుడు జానపద గేయాలు, సాంస్కృతిక రూపాలలో తమ బాధలు వ్యక్తం చేసారు. కుల పురాణాల పేరుతో తాము కూడా సామాజికంగా గొప్పవారమేనని చెప్పుకునే ప్రయత్నం చేసారు. ఆధిపత్యం, వివక్ష రాజ్యమేలిన ఫ్యూడల్ సమాజంలో పుట్టిన సామెతలన్నీ వాటికి ప్రతిబింబాలే!"**

అంగీకరించటమే. ఇవి లేని బూర్జువా భూస్వామ్య పార్టీ మనకు కనిపించదు. వారసత్వ రాజకీయాలు కూడా వీటి కొనసాగింపే. స్వశక్తి లేనివారు నాయకుల సహకారంతో ఎదిగి రావాలనుకుంటారు. నాయకులు కూడా ప్రయత్నపూర్వకంగానే ప్రోత్సహించి అందలం ఎక్కించేందుకు ప్రయత్నిస్తారు. స్వయంప్రకాశం లేనపుడు ఇతరుల వెలుగులో తాము మెరిసిపోవాలన్న తాపత్రయమే నాయకుల మెప్పు పొంది ఎదిగే ప్రయత్నం. బూర్జువా పార్టీలన్నింటిలోనూ ఇవన్నీ సర్వసాధారణమై పోయాయి. 'నాయకుడూ-అనుచరులు' పద్ధతిలోనే రాజకీయాలు సాగుతున్నాయి. గుర్తింపు పొందిన నాయకుల నీడన సేదదీరటం ఒక పద్ధతి. వారి మోచేతి నీరుకు ఆశపడటం మరో పద్ధతి. బూర్జువా పార్టీల నిర్మాణం సారాంశం ఇదే కదా! ప్రజామోదం పొందటం కోసం నాయకుడికి లేని గొప్పతనాన్ని ఆపాదించి, ఇంద్రుడూ చంద్రుడని చూపించి జయప్రదమైన సందర్భాలు మన కండ్లముందున్నాయి. గుజరాత్ సరిహద్దులు దాటి పెద్దగా తెలియని మోడీని మీడియా ద్వారా జాతీయ నాయకుడిగా తయారుచేసారు. ఉమ్మడి రాష్ట్ర ప్రజలకు అంతగా తెలియని చంద్రబాబును ప్రపంచబ్యాంకు పథకం ప్రకారం మీడియానుపయోగించి ప్రకాశింపజేసిన విషయం కూడా చూసాం. భూస్వామ్య సమాజ లక్షణాలు ప్రజలలో విస్తరించి ఉన్న వాస్తవాన్ని తమ ప్రయోజనాలకు అనుకూలంగా సమర్థవంతంగా వాడుకున్నారు.

ఒకవైపు కొనసాగుతున్న గతకాలపు లక్షణాలు, మరోవైపు ఆధునిక అభివృద్ధి పరిణామాలు కలిసి నడుస్తున్నాయి. ఫలితంగా సంకర లక్షణాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అత్యంత ఆధునిక రాకెట్లునూ, ఉపగ్రహాన్నీ తయారుచేసిన శాస్త్రవేత్తలే.. దాన్ని ప్రయోగించే ముందు, కొందరు దాని ప్రతిమను దేవుడి ముందు పెట్టి పూజిస్తున్నారు. ఐటి కంపెనీ ప్రారంభిస్తూ కొబ్బరికాయలు కొట్టడం, ఇంజనీర్లు వాస్తును పాటించటం ఇలాంటివే.

కులవివక్ష మీద, కులం మీద దాని పునాదులైన భూస్వామ్య సంబంధాల మీద పోరాడవల్సిన సమయంలో... అగ్రకులాలే కాదు, తామూ గొప్పవారమేనని చెప్పుకునే ప్రయత్నం, అస్తిత్వాన్ని గుర్తించాలని కోరుకోవటం చూస్తున్నాం. కార్మికవర్గంలో కూడా కులధోరణులు ఉన్నాయి. దళితుల సమస్యలు తెలుసుకునేందుకు వారి దగ్గరికి పోదామన్న ప్రతిపాదనను వ్యతిరేకించిన హమాలీలున్నారు. పురుషాధిక్యత కూడా కార్మికవర్గాన్ని విడువలేదు. పారిశుధ్య కార్మికులు కూడా మహిళల పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారు. దళితుడే సూపర్‌వైజర్‌గా ఉండి కూడా, దళిత మహిళమీదనే, "అగ్రకుల సూపర్‌వైజర్‌కు లొంగుతారు", నాకెందుకు లొంగిపోవు అని వత్తిడి చేసిన సందర్భాలున్నాయి. భవన నిర్మాణ రంగంలో ఆడకూలి, మగకూలి పేరుతో వివక్ష సర్వసాధారణం. ఇప్పుడు ఆధునిక కంపెనీలలో కూడా స్త్రీలకు తక్కువ వేతనాలు, కులం పేరుతో వాట్సప్ గ్రూపులు చూస్తున్నాం. ఆస్తిపాస్తులు లేకున్నా కుల పట్టింపులు బలంగా ఉన్నాయి. మరోవైపు కట్నకానుకలు అడగకపోతే కుల మత పట్టింపులు సడలించి సర్దుకుపోవడం కూడా జరుగుతున్నది. శారీరక సంబంధానికి అడ్డురాని కులం పెండ్లికీ, వారసత్వానికీ మాత్రం అడ్డు తగులుతున్నది. పెట్టుబడిదారీ ప్రయోజనాలూ, మార్కెట్ అవసరాలకు తోడ్పడిన మేరకు ఫ్యూడల్ విలువలు కొనసాగుతున్నాయి. వీటికి ఆటంకమైన మేరకు సడలింపులూ జరుగుతున్నాయి. ఇవన్నీ శ్రామిక ప్రజల మీద, కార్మికోద్యమం మీద, కమ్యూనిస్టు పార్టీ మీద ఎలాంటి ప్రభావం చూపుతున్నాయో పరిశీలించాలి. ఆటంకాలను అధిగమించాలి.

❊

# కుషాను సామ్రాజ్యం

ఎం.వి.ఎస్.శర్మ



రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

### కుషాను సామ్రాజ్యం ఏర్పాటుకు పూర్వరంగం

గ్రీకుల ఆధిపత్యం కింద ఉన్న బాక్ట్రియా ప్రాంతం (ఇది ఉత్తర ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతం) మీదకు క్రీ.పూ. 200 నాటికే ఆక్సస్ నదీ తీర ప్రంతంలో జీవించే సంచార తెగలు తరచూ దాడులకు దిగుతూవుండేవి. క్రీ.పూ. 145 లో బాక్ట్రియాలోని సంపన్నవంతమైన ప్రాంతం అల్ ఖానుమ్ వారి వశమైంది. క్రీ.పూ.50 నాటికి ఆ ప్రాంతం మీద గ్రీకుల ఆధిపత్యం దాదాపు అంతరించింది.

పశ్చిమ చైనా లోని సిన్ జియాంగ్ ప్రాంతం నుండి యూ జీ అనే తెగకు చెందినవారు అక్కడి ఘర్షణల కారణంగా మరింత పశ్చిమ దిశగా ఆక్సస్ నదీ ప్రాంతం వైపు తరలివచ్చారు. చాలా ఎక్కువ సంఖ్యలో క్రమంగా తరలివచ్చి ఆక్సస్ తీర ప్రాంతంలో పలు చిన్న చిన్న స్వతంత్ర పాలిత ప్రాంతాలలో ఉంటున్న స్థానిక ప్రజానీకాన్ని ఓడించి అక్కడ తమ పాలనను కొనసాగించారు. అక్కడినుంచి వీరు బాక్ట్రియా వైపు వచ్చి ఆ ప్రాంతాన్ని ఆక్రమించుకున్నారు. అలా వచ్చిన వారిలో ఒకానొక తెగ "కు-షాంగ్" అన్న పేరుతో ఉండేది. వారి ఆధిపత్యంలో ఉన్న ప్రాంతాన్ని కూడా కు-షాంగ్ అనే పిలిచేవారు. బాక్ట్రియా ప్రాంతంలో ఈ కు-షాంగ్ తెగ బలహీనంగా ఉండి తక్కిన, బలమైన, ప్రధాన తెగ అయిన యూ-జీ కి లొంగి వుండవలసివచ్చేది.

అటువంటి పరిస్థితి నుండి బైటపడి క్రీ.శ. మొదటి శతాబ్దపు ప్రథమ అర్థ భాగం నాటికి (క్రీ.శ. 1-50 మధ్య కాలం) ఈ కు-షాంగ్ తెగ యావత్తు బాక్ట్రియా మీద ఆధిపత్యం సాధించగలిగింది. ఈ కు-షాంగ్ తెగ క్రమంగా కుషాను అనే పేరుతో విస్తరించింది.

### కుషానుల వంశ చరిత్ర

బాక్ట్రియాలో రబాతక్ వద్ద లభించిన శాసనం కుషాను రాజుల చరిత్రను స్పష్టం చేసింది. కజుల కడాఫిసెస్ (లేదా కడాఫిసెస్-1) కుషాను సామ్రాజ్య స్థాపకుడు. బాక్ట్రియాలోని తక్కిన చిన్న రాజ్యాలను ఓడించిన అనంతరం ఇతని హయాంలో కాబులు, కాశ్మీర్ ప్రాంతాలను కూడా స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు. సుమారు క్రీ.శ. 75-111 సంవత్సరాల మధ్య కాలంలో ఇది జరిగింది. గాంధార ప్రాంతం కజుల కడాఫిసెస్ స్వాధీనంలోకి క్రీ.శ. 92లో వచ్చింది. స్వాత్ లోయ ప్రాంతం కూడా ఇతని ఆధీనంలోకి పోయినట్టు ఆధారాలు సూచిస్తున్నాయి. సిన్ జియాంగ్ ప్రాంతం మీదకు కూడా దండయాత్ర సాగించినా, అక్కడి రాజులు ఆ దండయాత్రను వెనక్కి తిప్పికొట్టగలిగారు. తన 80వ ఏట కజుల కడాఫిసెస్ మరణించగా, అనంతరం విమా కడాఫిసెస్ (ఇతను కజుల కడాఫిసెస్‌కు మనుమడు) అధికారం చేపట్టాడు. ఇతను 20 సంవత్సరాలకు పైనే పాలన సాగించాడు. సుమారు క్రీ.శ.150 కాలంలో ఇతని పాలన నడిచింది. ఇతని కాలంలో గాంధార ప్రాంతం వైపు నుండి ఆగ్నేయ దిశగా సాగి సింధు ప్రాంతాన్ని కుషానులు తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. అక్కడినుండి సింధునదిని దాటి దాదాపు మధుర వరకూ విస్తరించారు.

విమా కడాఫిసెస్ కాలంలో ముఖ్యమైన సాంస్కృతిక, పాలనా పర మార్పులు చోటు చేసుకున్నాయి. కుషానుల కాలంలో ఆ ప్రాంతంలో ప్రధానంగా ఇరానియన్ భాష వ్యవహారికభాషగా ఉండింది. ఇండో-గ్రీక్ నమూనాలో రాగి నాణేలను ముద్రించడమే గాక బంగారు నాణేల ముద్రణ కూడా విమా కడాఫిసెస్ కాలంలో జరిగింది. ఈ నాణేలపైన విమా కడాఫిసెస్ తనను ఒక దేవతగా చిత్రించుకున్నాడు. ఆ దేవతలలో వైదిక దేవత అయిన మిత్రగా తనను అభివర్ణించుకున్నాడు. గ్రీకు దేవతలతోబాటు శివుడిని కూడా అధికారిక దేవతగా ప్రకటించాడు. పలు చోట్ల దేవ గృహాలను నిర్మించి వాటిలో తన ప్రతిమలను, గ్రీకు, వైదిక దేవతల ప్రతిమలను స్థాపించాడు. రాజు దైవాంశ సంభూతుడు అన్న భావనను ప్రజలలో వ్యాప్తి చేయడానికి జరిగిన ప్రయత్నంగా దీనిని పరిగణించవచ్చు.

### కనిష్కుడు

విమా కడాఫిసెస్ కుమారుడు కనిష్కుడు క్రీ.శ.160లో అధికారం చేపట్టాడు. అప్పటికే కుషాను సామ్రాజ్యం సువిశాల ప్రాంతానికి విస్తరించింది. ఇతని కాలంలో సామ్రాజ్యం విస్తరించడం కొనసాగింది. ఉజ్జయిని, సాకేత (అయోధ్య), కౌశాంబి (అలహాబాద్ సమీపం) పాటలీపుత్రం, శ్రీ-చంప (బీహార్ లోని భగల్‌పూర్ ప్రాంతం) అంతా కుషానుల పాలనలోకి వచ్చింది. ( చూ. మ్యాప్ 3.1)

తన సామ్రాజ్యంలోని ప్రధాన భూభాగం భారత ఉపఖండంలో ఉన్నప్పటికీ కనిష్కుడు బాక్ట్రియాను తమ మాతృభూమిగా పరిగణించాడు. గ్రీకు భాషను ఒక అధికారిక భాషగా ఉపయోగిస్తూవచ్చిన కుషానులు కనిష్కుడి కాలంలో దాని స్థానంలోకి బాక్ట్రియన్ భాష అయిన ఆరియను ప్రవేశపెట్టారు. గ్రీకు దేవతల స్థానంలో ఇరానియన్ దేవతలైన మిత్ర, అగ్ని, చంద్రుడు వంటి దేవతలను ముందుకు తెచ్చాడు. భారత ఉపఖండాన్ని దృష్టిలో ఉంచుకుని శివుడు, బుద్ధుడు వంటి దేవతలను గుర్తించాడు. ఐతే, బాక్ట్రియా ప్రాంతంలో ప్రధానంగా జొరాస్ట్రియన్ దేవతలైన అహుర మజ్ద (అసలైన దేవుడు) వంటివారికి ప్రాధాన్యత ఉండేది. మహాసేన, విశాఖ వంటి భారతీయ దేవతల పేర్లు అక్కడ ప్రస్తావించబడ్డాయి తప్ప శివుడు, బుద్ధుడు అక్కడ గుర్తింపు పొందలేదు. దేవ గృహాలలో ఈ దేవతలతోబాటు, దేవుని కుమారులుగా కుషాను వంశపు రాజులను- తమ ముత్తాత నుండి తన వరకూ- పూజించే పద్ధతి అనుసరించారు.


అప్పటికి భారత ఉపఖండంలో బౌద్ధం బలంగా వ్యాపించివుండడంతో దానిని

కనిష్కుడు పరిగణనలోకి తీసుకున్నాడు. తన నాణేలపై ఇతర దేవతలతోబాటు బుద్ధుడి బొమ్మ ఉన్న నాణేలను కూడా ముద్రించాడు. కౌశాంబి, సారనాథ్, శ్రావస్తి తదితర బౌద్ధపుణ్య క్షేత్రాలలో కనిష్కుడు ఆ ప్రాంతాలను పర్యటించినట్టు స్తూపాలమీద చెక్కివుంది. పెషావరు సమీపంలో కనిష్క విహార అనే పేరుతో ఒక బౌద్ధ ఆరామాన్ని నిర్మించాడు. ఐతే ఇతని హయాంలో బౌద్ధ ఆరామాలకు ఆర్థికంగా బాగా తోడ్పడినట్టు పెద్దగా దాఖలాలు లేవు. మహాయాన బౌద్ధ గ్రంథాలలో కనిష్కుడు పెద్ద ఎత్తున బౌద్ధమతాన్ని ఆదరించినట్టు పేర్కొన్నప్పటికీ, పెషావరు సమీపంలో నిర్మించిన కనిష్క విహార, గాంధార ప్రాంతంలో నిర్మించిన ఒక స్తంభం తప్ప ఇతర దాఖలాలులేవు. అశ్వఘోషుడు కాశ్మీరంలోతన కృషిని ప్రశాంతంగా కొనసాగించుకోడానికి తోడ్పడినట్టు చీనీ బౌద్ధ గ్రంథాలలో ఉంది.

❝ ఏకకాలంలో జొరాష్ట్రియన్ మతాన్ని, శైవాన్ని, బౌద్ధాన్ని ఆదరిస్తూ, తమ వంశస్తులను దైవాంశతో జన్మించినవారుగా ప్రచారం చేసుకోవడం కనిష్కుడి విధానం అని చెప్పవచ్చు. బాక్ట్రియాను ప్రధాన కేంద్రంగా ప్రకటించి తమ మూలాలపట్ల విశ్వసనీయతను ప్రదర్శించి నప్పటికీ, తన పాలనను ప్రధానంగా పుష్పపురం (ప్రస్తుత పెషావర్) నుండి సాగించాడు. ❞

ఏకకాలంలో జొరాష్ట్రియన్ మతాన్ని, శైవాన్ని, బౌద్ధాన్ని ఆదరిస్తూ, తమ వంశస్తులను దైవాంశతో జన్మించినవారుగా ప్రచారం చేసుకోవడం కనిష్కుడి విధానం అని చెప్పవచ్చు. బాక్ట్రియాను ప్రధాన కేంద్రంగా ప్రకటించి తమ మూలాలపట్ల విశ్వసనీయతను ప్రదర్శించి నప్పటికీ, తన పాలనను ప్రధానంగా పుష్పపురం (ప్రస్తుత పెషావర్) నుండి సాగించాడు. తన పాలనలో ఆదేశాలను, సమాచారాన్ని ఖరోష్టి, బ్రాహ్మీ లిపులు రెండింటిలోనూ అందించాడు. క్రీ.శ. 183లో కనిష్కుడి పాలన ముగిసింది. (చూ. కనిష్కుడి విగ్రహం-మధుర సమీపంలో)

కనిష్కుడి అనంతరం హువిష్కుడు అధికారంలోకి వచ్చాడు. ఇతడి పాలన సుదీర్ఘంగా, దాదాపు నాలుగు దశాబ్దాలపాటు కొనసాగింది. క్రీ.శ.184 నుండి క్రీ.శ. 224 వరకూ హువిష్కుడు పాలించాడు. వాజేష్కు అన్న పేరుతో కూడా వ్యవహరించాడు. హువిష్కుడి కాలంలో కుషాను సామ్రాజ్యం ఉచ్చస్థితికి చేరుకుంది. ఆ కాలానికి చెందిన బంగారపు నాణేలు అత్యధిక సంఖ్యలో దొరకడం బట్టి అత్యంత సంపద్వంతమైన రాజ్యంగా ఉండేది అని చెప్పవచ్చు. అంతేగాక, ఆ నాణేలు సువిశాలమైన ఆ సామ్రాజ్యంలోని వివిధ ప్రాంతాలలో లభించడం బట్టి కుషాను సామ్రాజ్యంలో చాలా ఎక్కువ సంపదమీద ప్రభుత్వానికి అదుపు ఉండేదని చెప్పగలం. తన హయాంలో హువిష్కుడు కూడా తన తండ్రి మాదిరిగానే మత విషయంలో అన్ని మతాలకూ సన్నిహితంగా కొనసాగాడు. ఐతే చివరి దశలో కుషానుల పాలనలో బౌద్ధ మతానికి ఆదరణ బాగా తగ్గిపోయింది.




### కుషానుల రాజకీయ విధానం

దైవ గృహాలు బాక్ట్రియా ప్రాంతంలో ఎక్కువగా నిర్మించబడివుండడం వెనుక కుషానుల రాజకీయ విధానం ఉంది. ఆ దైవ గృహాలలో గ్రీకు, జొరాష్ట్రియన్, బౌద్ధ, హిందూ దేవతల విగ్రహాలతోబాటు కుషాను రాజుల విగ్రహాలు కూడా ఉన్నాయి. తాము దైవ సమానులమని, దైవాంశ సంభూతులమని తమ అనుయాయులలో, ప్రజలలోనమ్మకం కలిగించి దాని ప్రాతిపదికన వారందరి విధేయతను చూరగొని తమ అధికారాన్ని పదిలంగా కొనసాగించడం కుషానుల విధానం అని గమనించవచ్చు. అదే సమయంలో సామ్రాజ్యం భారత ఉప ఖండంలోకి ఎక్కువగా వ్యాపించివున్నా, తమ విధేయత బాక్ట్రియా తోనే ముడిపడివుందని స్పష్టం చేశారు. అంతే గాక, సామ్రాజ్యంలో వివిధ ప్రాంతాల పాలనా వ్యవహారాలను నిర్వహించే స్థానిక రాజ ప్రతినిధులుగా కూడా బాక్ట్రియన్లను మాత్రమే నియమించారు. అదే సమయంలో ఆయా ప్రాంతాల ప్రజల మత విశ్వాసాలను గౌరవించడం ద్వారా తాము అందరి యోగక్షేమాలనూ పట్టించుకుంటామన్న సందేశాన్నీ ప్రజలకు అందించారు.

కుషానులసైనిక బలం ప్రధానంగా వారి ఆశ్విక దళాలు. తోలుతో చేసిన జీను, నాడా, రికాబు ఉపయోగించడం ద్వారా గుర్రాలను అదుపులో ఉంచగల సామర్థ్యం అధికంగా ఉండడం ఆ దళాల ప్రత్యేకత. తద్వారా వారు ప్రత్యర్థి దళాలమీద పైచేయి తేలికగా సాధించగలిగారు.

### కుషాను సామ్రాజ్య పతనం

హువిష్కుడి తర్వాత అతని కుమారుడు వాసుదేవుడు (క్రీ.శ. 220-224 మధ్య అధికారంలోకి వచ్చాడు. ఇతడు కూడా దాదాపు 4 దశాబ్దాలపాటు అధికారంలో కొనసాగినట్లు ఆధారాలు ఉన్నాయి. వాసుదేవుడు కూడా తన పూర్వీకుల విధానాన్నే కొనసాగించాడు. ఐతే ఇతడి హయాంలో విడుదల అయిన శాసనాలు అత్యధికంగా బ్రాహ్మీ లిపిలోనే లభిస్తున్నాయి.

ఇందుకు ప్రధాన కారణం వాసుదేవుడి పాలన ప్రధానంగా భారత భూ ఖండానికి ఎక్కువగా పరిమితం కావడమే. వాసుదేవుడి

> **“ ఉత్తర భారతంలోని కుషాను సామ్రాజ్యం, దక్కను ప్రాంతంలోని శాతవాహన సామ్రాజ్యం దాదాపు ఒకే కాలంలో, అంటే, క్రీ.శ. 3వ శతాబ్దపు తొలి అర్ధభాగంలో విచ్ఛిన్నం అయాయి. ఆ రెండూ బలహీనపడుతున్న కాలంలో కొన్ని ఇతర రాజ్యాలు స్వతంత్రంగా నడిచాయి. విదిశ ప్రాంతంలో (గుజరాత్ ప్రాంతం) శక రాజు శ్రీధర వర్మ తనను మహారాజుగా ప్రకటించుకున్నట్టు కొన్ని శిలా శాసనాలు తెలియజేస్తున్నాయి. ఇతడి రాజ్యం క్రీ.శ. 279-293 మధ్య కాలంలో నడిచింది. ”**

### కాల పట్టిక (సుమారుగా)

| | |
|---|---|
| బాక్ట్రియాలో గ్రీకుల పాలన అంతం | క్రీ.పూ. 50 |
| కజుల కడాఫిసెస్ బాక్ట్రియా పై ఆధిపత్యం | క్రీ.శ.75 |
| విమా కడాఫిసెస్ పాలన ప్రారంభం | క్రీ.శ. 120 |
| సింధు ప్రాంతం కుషానుల స్వాధీనం | 127 |
| కనిష్కుడి పాల ప్రారంభం | 160 |
| కనిష్కుడి పాలన అంతం, హువిష్కుడి పాలన ప్రారంభం | 183-185 |
| హువిష్కుడి పాలన అంతం | 220 |
| ససానియన్లు బాక్ట్రియా పై ఆధిపత్యం | 232 |
| వాసుదేవుడి పాలన అంతం | 258 |
| మధుర గుప్తుల స్వాధీనం | క్రీ.శ.380కి ముందు |

పాలనా కాలంలోనే కుషానుల ఆధిపత్యానికి ఆయువు పట్టుగా ఉన్న బాక్ట్రియా ఇరానియన్ల వశం అయింది. సుమారు క్రీ.శ. 240 సమీపంలో ఇరాన్‌ను పాలించిన ససానియన్లు బాక్ట్రియాను తమ ఆధీనంలోకి తెచ్చుకోగలిగారు. ససానియన్ రాజు షాపుర్-1 విడుదల చేసిన శాసనం ప్రకారం అతని ముందు పాలకుడుగా ఉన్న అర్దాశిర్-1 (క్రీ.శ.226-241) కాలంలో ఇరాన్‌కు తూర్పున ఉన్న ప్రాంతాలను తన ఆధీనంలోకి తెచ్చుకున్నట్టు ఉంది. అందులో బాక్ట్రియా ఒక భాగం. కుషాను సామ్రాజ్యపు ఆయువుపట్టు మీద దెబ్బ తగలడంతో కుషాను సామ్రాజ్య పతనం మొదలైంది. ఒక మహా సామ్రాజ్యానికి అధిపతిగా ఉన్న వాసుదేవుడు మధుర, దాని సమీపపు ప్రాంతానికి పాలకుడుగా మిగిలిపోయాడు.

అతని తర్వాత పాలించిన కనిష్కుడు-2, వాసుదేవుడు-2 కుషాను రాజ్యానికి అధిపతులుగా క్రీ.శ. 330 వరకూ కొనసాగారు. సముద్రగుప్తుడి కాలంలో కుషానుల రాజ్యం గుప్తుల వశం అయిపోయింది.

### క్రీ.శ. 3 వ శతాబ్దంలోని ఇతర రాజ్యాలు

ఉత్తర భారతంలోని కుషాను సామ్రాజ్యం, దక్కను ప్రాంతంలోని శాతవాహన సామ్రాజ్యం దాదాపు ఒకే కాలంలో, అంటే, క్రీ.శ. 3వ శతాబ్దపు తొలి అర్ధభాగంలో విచ్ఛిన్నం అయాయి. ఆ రెండూ బలహీనపడుతున్న కాలంలో కొన్ని ఇతర రాజ్యాలు స్వతంత్రంగా నడిచాయి. విదిశ ప్రాంతంలో (గుజరాత్ ప్రాంతం) శక రాజు శ్రీధర వర్మ తనను మహారాజుగా ప్రకటించుకున్నట్టు కొన్ని శిలా శాసనాలు తెలియజేస్తున్నాయి. ఇతడి రాజ్యం క్రీ.శ. 279-293 మధ్య కాలంలో నడిచింది. అంటే అప్పటికి ఆ ప్రాంతం కుషానుల ఆధీనంలోనుండి బైటకు పోయిందనుకోవాలి. కౌశాంబి ప్రాంతం (అలహాబాద్)లో భద్రమాఘుడు అనే రాజు తన స్వతంత్రతను క్రీ.శ.241 నాటికే ప్రకటించుకున్నాడు. ఈ మాఘ వంశస్తుల పాలన క్రీ.శ.299 వరకూ ఆ ప్రాంతంలో సాగింది. అంటే క్రీ.శ.241 నాటికే కౌశాంబి ప్రాంతం కుషానుల చేతుల్లోంచి జారిపోయింది.

మధ్య భారతంలో కూడా స్వతంత్ర రాజులు క్రీ.శ. 250 నాటికి పాలిస్తున్నట్టు ఆధారాలు ఉన్నాయి. ఇక పంజాబ్- హర్యానా



ప్రాంతంలో యౌధేయులు అనేవారు క్రీ.శ. 230 సమీప కాలం నుండి దాదాపు క్రీ.శ.3వ శతాబ్దపు చివరివరకూ పరిపాలన సాగించారు. వారు యుద్ధవీరులుగా పేరు గల తెగలవారు. సమాఖ్య పద్ధతిలో వారి పాలన సాగింది. కుషాను సామ్రాజ్య పతనం వెనుక వీరి తిరుగుబాట్లు కూడా ముఖ్యపాత్ర పోషించివుండాలి.

ఇక రాజస్తాన్ ప్రాంతంలో మాళవ గణాలకు చెందిన రాజులు క్రీ.శ. 230-250 మధ్య పాలించినట్లు శాసనాలు తెలుపుతున్నాయి.

దక్కన్ ప్రాంతంలో శాతవాహనుల సామ్రాజ్యం బలహీనపడిన నేపథ్యంలో నాగార్జునకొండ ప్రాంతంలో విజయపురి కేంద్రంగా ఇక్ష్వాకు వంశ పాలన సాగింది. వీరి రాజ్యం కృష్ణా-గోదావరి పరీవాహక ప్రాంతంలో ప్రధానంగా ఉండింది. ఈ ప్రాంతంలో ఎక్కువగా లభించిన శాసనాలను బట్టి చాంతమూలుడు అనేవాడు ఈ రాజ్య స్థాపకుడు. ఆ తర్వాత వీరపురిసి దాత, అతని తర్వాత ఏహువల చాంతమూలుడు, అనంతరం రుదపురిసి దాత పరిపాలన సాగించారు. వీరి పాలన ప్రధానంగా క్రీ.శ.మూడవ శతాబ్దం లో సాగింది. ఇక్ష్వాకులు ప్రధానంగా ప్రాకృతాన్ని వాడుకభాషగా ఉపయోగించారు. వీరికి ఉజ్జయిని, వనవాస (కర్నాటక పశ్చిమ ప్రాంతం) ప్రాంతాల పాలకులతో వివాహ సంబంధాలు ఉండేవి. అవంతికి చెందిన శక రాజు రుద్ర దమనుడితో స్నేహ సంబంధాలు నెరిపారు. క్రీ.శ. 300 తర్వాత ఇక్ష్వాకుల రాజ్యం క్రమంగా పల్లవుల ఆధీనం అయింది. ❋

# గుజరాత్ మారణకాండ: నేటికీ వెంటాడుతున్న పీడకల

క్రిస్టోఫె జెఫర్‌లాట్



రచయిత లండన్ కింగ్స్ కాలేజీలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ లో విజిటింగ్ ప్రొఫెసర్. "ఇండియా – ది మోదీ క్వశ్చన్" డాక్యుమెంటరీ కోసం బిబిసి ఇంటర్వ్యూ చేసిన వారిలో ఒకరు

ఇటీవలి చరిత్రలో 2000 మంది హత్యగావించబడిన, అత్యంత క్రూరమైన మత ఘర్షణలుగా పరిగణించబడే 2002 గుజరాత్ అల్లర్లపై క్రిస్టోఫె విస్తృతమైన రచనలు చేశారు. ఆయన ఇటీవల వెలువరించిన "మోడీస్ ఇండియా : హిందూ నేషనలిజం అండ్ ది రైజ్ ఆఫ్ ఎత్నిక్ డెమొక్రసీ" అనే ప్రచురణ 'ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని సంఘ్‌పరివార్‌లో నిపుణుడు అయిన ప్రధాని మోడీ మెరుపు వేగంతో ఎలా ఎదిగారు' అన్న అంశంపై లోతైన, స్పష్టమైన అవగాహనను మనకు అందిస్తుంది. క్రిస్టోఫె జఫర్‌లాట్ లండన్ కింగ్స్ కాలేజీలో ఇండియన్ పాలిటిక్స్ అండ్ సోషియాలజీ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అవంత ఛైర్ (లండన్ కింగ్స్ కాలేజీలో ఇండియా ఇన్‌స్టిట్యూట్‌లో ఒక ప్రతిష్ఠాత్మక స్థానం) గా ఎంపికయ్యారు. ఇండియా : ద మోదీ క్వశ్చన్ కోసం బిబిసి ఇంటర్వ్యూలు చేసిన మేధావులలో ఆయన కూడా ఒకరు. ఆయన ఫ్రంట్‌లైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ కింద అందిస్తున్నాం.

బిబిసి: **మోదీ ఓటమి లేని వ్యక్తిగా అందరి దృష్టిలో ఉన్నప్పుడు బిబిసి డాక్యుమెంటరీ విస్ఫోటనంలా వచ్చింది. ఈ సమయంలో ఎందుకు బయటకు వచ్చింది? గుజరాత్ మారణకాండ తాలూకు ఆత్మలు మోదీని ఇంకా వెంటాడుతూనే ఉన్నాయా?**

**క్రిస్టోఫె:** సమయం గురించి నేను ఎటువంటి వ్యాఖ్యలు చేయను. దాదాపు సంవత్సర కాలం కన్నా ముందే "గుజరాత్ అండర్ మోదీ (మోదీ ఛాయలో గుజరాత్)" వ్రాస్తున్నప్పుడు బిబిసి నన్ను ఇంటర్వ్యూ చేసింది. బిబిసి విలేఖరులు చాలా కఠినమైన బాధ్యతను తీసుకున్నారు. సమాచారాన్ని రూఢి చేసుకునేందుకు వారు డజన్ల కొద్దీ రిపోర్టులు, పుస్తకాలు, వ్యాసాలను అధ్యయనం చేశారు. వ్యక్తులను ఇంటర్వ్యూలు చేశారు.

గుజరాత్ మారణకాండ తాలూకు ఆత్మలు మోదీని వెంటాడుతున్నాయా? నాకు తెలియదు. అవి అతన్ని ఎప్పుడైనా వదిలిపెట్టాయా? ఆ ఆత్మలు నన్ను ఎప్పుడూ వదల్లేదు. నేను అహ్మదాబాద్‌ను 2001లో సందర్శించాను. అప్పటి నుండి 2020 వరకు సంవత్సరానికి రెండు సార్లు వెళుతూనే ఉన్నాను. నా గుజరాత్ పుస్తకంతో నేను 20 ఏళ్ళు గడిపాను. ఆనాటి దాడుల నుండి బతికి బయటపడిన వారిని, ఆ మారణకాండలో సర్వస్వం కోల్పోయి సహాయ శిబిరాలు, కాలనీల్లో శరణార్థుల్లా ఉన్న వారిని, బాధితులకు సహాయపడుతున్న ఎన్జీవోలు, వలంటీర్లను ఇంటర్వ్యూలు చేశాను. భారత చరిత్రలోని ఈ భాగం నా జీవితంలోని ముఖ్యమైనదీ, నన్ను వెంటాడుతూ ఉంటున్నదీను.

బిబిసి: **అల్లర్ల తదనంతర పరిణామాల్లో ప్రపంచ దేశాల ఆగ్రహానికి గురైన మోదీ నేడు ప్రపంచ రాజకీయాల్లో కేంద్ర బిందువుగా మారాడు. యుకె ప్రభుత్వ నివేదిక బహుశా అతని ఎదుగుదలకు అడ్డుకట్ట వేయడంతోపాటు బాధితులకు న్యాయం జరగడానికి దోహదపడి ఉండవచ్చు. ఆ నివేదిక గురించి ఇన్నాళ్ళుగా మీకు తెలుసా?**

**క్రిస్టోఫె:** ఈ అల్లర్ల విషయంలో విదేశీ ప్రభుత్వాలు అన్నీ ఒకే విధానం తీసుకోలేదు. 2005లో యు.ఎస్. ప్రభుత్వం మత స్వేచ్ఛకు భంగం వాటిల్లడానికి బాధ్యులైన విదేశీ అధికారులను వీసాకు అనర్హులుగా ప్రకటించే 1998 చట్టం ప్రకారం మోదీ వీసాను రద్దు చేసింది. ఈ చట్టాన్ని ఆ దేశం అత్యంత అరుదుగా ఉపయోగిస్తుంది. దీనికి పూర్తి భిన్నంగా యుకెతో సహా యూరోపియన్ దేశాలు పౌర సమాజ సంస్థల ఒత్తిడికి తలొగ్గి వాస్తవ బహిష్కరణను ఎంచుకున్నాయి. ఇతర ప్రభుత్వాలు మరింత వెసులుబాటును కలిగించాయి. మోదీ జపాన్ ప్రధాని షింజో అబే ఆహ్వానం అందుకున్నారు. పలుమార్లు చైనాను కూడా సందర్శించారు. మోదీ షాంఘై పర్యటన గురించి నా పుస్తకాలలో ఉంది. యాదృచ్ఛికంగా మోదీ యుఎస్ వీసా రద్దైన సమయంలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం అతన్ని సమర్థించింది. ఆ అంశంపై నేను నా పుస్తకంలో విశ్లేషించాను.

నిష్కళంకమైన ఖ్యాతి కలిగిన సర్వోన్నత న్యాయస్థానం ఉన్న ఒక సార్వభౌమ దేశం విషయంలో పశ్చిమ దేశాలు ఎందుకు ఇంత జోక్యం చేసుకున్నాయి? నా ఉద్దేశ్యం ప్రకారం ప్రత్యేక విచారణ బృందం తన పని సక్రమంగా చేసేలా కోర్టు నిర్దేశించదని ఎవరూ ఊహించి ఉండరు. నేర పరిశోధనా విభాగాలు అప్పటికే ఒక వర్గం వైపు మళ్ళిపోయాయి. అది గుజరాత్ పోలీసుల విషయంలో స్పష్టంగా కనిపించింది. 2003–2007 మధ్యలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లు ఆ విషయాన్ని ధృవీకరించాయి.

బిబిసి: **బిబిసి డాక్యుమెంటరీలో బిజెపి నాయకుడు స్వపన్ దాస్ గుప్తా ఇంటర్వ్యూ ఉంది. అంటే మితవాద పక్షానికి ఈ చిత్రం గురించి ఖచ్చితంగా తెలుసు. మరి ఇప్పుడు ఈ ఆగ్రహావేశాలు ఎందుకు?**

**క్రిస్టోఫె:** ఆగ్రహావేశాలు చూపడం హిందూ జాతీయవాదుల నిరంతర టెక్నిక్. హిందుత్వ శక్తులు తాము బలహీనులమని, బాధితులమని, దాడులకు గురయ్యామని తరచూ వాదిస్తుంటారు. వాస్తవానికి ప్రతి సందర్భంలోను దాడులు చేసేది వారే అయినా ఎక్కువ మంది నాయకులు తాము దుర్బలులమనే భావనను సాధనంగా ఉపయోగిస్తారు. అది వాస్తవం అయితే హింసాత్మక భావాలు లేని మహిళలు, పిల్లలను హత్యలు చేయడాన్ని బిజెపి నాయకులు ఎలా సమర్థించుకుంటారు?

బిబిసి: **మోదీ వేగవంతమైన ఎదుగుదల గురించి మీరు వ్రాశారు. అతని ఆశయం దృష్ట్యా క్రిందికి లాగడానికి ఎలాంటి ప్రయత్నాలు చేసినా ఎదిగి ఉండవచ్చు. మీ పరిశీలన?**

**క్రిస్టోఫె:** ఏదైనా వ్యతిరేక చరిత్ర రాయడం కష్టం. అవును. మోదీ ఎన్ని శక్తులు తనను క్రిందకు లాగడానికి చూసినా వాటిని ఉపయోగించుకుని మరీ పైకి ఎదిగాడని నేను నమ్ముతాను. 2002 అల్లర్లు మోదీ గుజరాత్‌లో

> **❝ చాలా మంది గుజరాతీ హిందువుల దృష్టిలో మోడీ ముస్లింలకు "గుణపాఠం నేర్పాడు". వారు అతని పట్ల కృతజ్ఞత కలిగి ఉన్నారు. నిజానికి ఈ మత విద్వేష హింస తీవ్రంగా ప్రభావం చూపిన నియోజకవర్గాలలో 2002 ఎన్నికల్లో బిజెపి ఎక్కువ సీట్లను గెలుచుకుంది. ఈ మారణ కాండకు బాధ్యుడుగా మోదీని ఇంగ్లీషు మీడియా ఎంత ఎక్కువగా చూపిందో, అంత ఎక్కువగా ప్రజలు అతనిని ఉదారవాద సంస్థలచే బాధింప బడిన వ్యక్తిగా భావించి మోదీ వెనుక నడిచారు. ❞**

ఒకటి కాదు, మూడు ఎన్నికలలో గెలవడానికి ఉపయోగపడ్డాయని సర్వేలు, ఒపీనియన్ పోల్స్ పేర్కొన్నాయి. ఆ అల్లర్లతోనే ప్రజాసమూహాల చీలికను మోదీ ప్రారంభించాడు. అదే హిందూ మెజారిటీ వాదాన్ని ట్రంప్‌కార్డ్‌గా ఉపయోగించుకోవడానికి దోహదపడింది. చాలా మంది గుజరాతీ హిందువుల దృష్టిలో మోడీ ముస్లింలకు "గుణపాఠం నేర్పాడు". వారు అతని పట్ల కృతజ్ఞత కలిగి ఉన్నారు. నిజానికి ఈ మత విద్వేష హింస తీవ్రంగా ప్రభావం చూపిన నియోజకవర్గాలలో 2002 ఎన్నికల్లో బిజెపి ఎక్కువ సీట్లను గెలుచుకుంది. ఈ మారణ కాండకు బాధ్యుడుగా మోదీని ఇంగ్లీషు మీడియా ఎంత ఎక్కువగా చూపిందో, అంత ఎక్కువగా ప్రజలు అతనిని ఉదారవాద సంస్థలచే బాధింప బడిన వ్యక్తిగా భావించి మోదీ వెనుక నడిచారు.

బిబిసి: **డాక్యుమెంటరీ రెండవ భాగంలో 2002 అల్లర్లు హత్యలు, ఆర్టికల్ 370 రద్దు, సిఎఎ చట్టాలకు ప్రారంభం అన్నట్లుగా కనిపించింది. ఈ డాక్యుమెంటరీ వాటిపై ప్రభావం చూపగలదా?**

**క్రిస్టోఫే:** డాక్యుమెంటరీ వాటిపై ఏ మేరకు ప్రభావం చూపగలదో నాకు తెలియదు. ఒక వేళ ఇప్పటివరకూ ఎటూ తేల్చుకోలేని వారు తమ ప్రధానమంత్రి మోస్తున్న గతం గురించి అవగాహన చేసుకోవడానికి సన్నద్ధమయ్యామని భావిస్తే కొంత ప్రభావం ఉంటుందనుకోవచ్చు. కానీ చాలా మంది ప్రజలు 2002లో ఏం జరిగిందన్న దానిపై వారి ఊహాగానాలకే కట్టుబడిఉన్నారు. లిబరల్ ఎస్టాబ్లిష్‌మెంట్ వల్ల హింసించబడ్డ హీరోగా మోదీని చూపడానికి సహాయపడిన బాధితుడన్న ప్రచారాన్ని (విక్టిమైజేషన్ సింద్రోమ్)ను ఈ డాక్యుమెంటరీ కొంత తగ్గించవచ్చు. వ్యూహాత్మక జాతీయ వాదులు ట్రంప్, ఆర్బన్‌లు కూడా ప్రపంచ వ్యాప్తంగా ఈ బాధితులన్న ప్రచారాన్నే ఉపయోగించుకున్నారు. నాకు సంబంధించినంత వరకు నేను చరిత్ర గురించి మాట్లాడే అంశాలు, చరిత్రలో వ్రాసే అంశాలు సామాజిక శాస్త్రవేత్తలు అధికారిక ఉపన్యాసాలను దాటి అర్థం చేసుకోవలసిన వాస్తవాల నుండి, ప్రచారాన్ని దాటి లోతుకు వెళ్ళి సంపాదించాల్సిన ఆధారాల నుండి వస్తాయి.

బిబిసి: **విద్యార్థులు ఈ డాక్యుమెంటరీని ప్రదర్శించడానికి ఎలాంటి అడ్డంకులనైనా ఎదుర్కోవడానికి సిద్ధపడుతున్నారు. దీనిని మనం ఒక ఆశాకిరణంగా చూడవచ్చా?**

**క్రిస్టోఫే:** అవును. కొన్ని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు సత్యాన్వేషణ ప్రేరణ కల్గిస్తోంది. సాంఘిక శాస్త్రాల కోణం నుండి ఇది కొంత ఊరట కల్గించే పరిణామం. యూరప్, యు.ఎస్‌లలో లేదా ఆన్‌లైన్‌లో భారతీయ విద్యార్థులతో చర్చలలో పాల్గొనే ప్రతిసారీ అర్థం చేసుకోవాలన్న వారి ఆసక్తి, ఆదర్శవంతమైన ఆలోచనలు నాకు ఆనందాన్ని కలిగిస్తాయి.

బిబిసి: **రెండవ భాగంలో "హాస్యాస్పదమేమంటే బాధితులే నేరస్థులయ్యార"ని మీరు చెప్పారు. 20 సంవత్సరాల క్రితం న్యాయం కోసం పోరాడిన హక్కుల కార్యకర్తలు, పోలీసు అధికారులు కటకటాల వెనక్కు వెళతారని మనం అనుకున్నామా?**

**క్రిస్టోఫే:** నిజంగా ఇది చాలా హాస్యాస్పదం, క్రూరం కూడా. గత దశాబ్దపు ప్రథమాంకంలో కూడా దీన్ని ఎవరూ ఊహించలేదు. లేకుంటే ఎందుకని తెహల్కా (ప్రత్యేకించి ఆశిష్ కేతన్) ఇంకా చాలా మంది ఇంత సాహసం చేసి ఇప్పటికీ భారీ మూల్యం చెల్లించుకుంటారు? న్యాయవ్యవస్థతో సహా భారతదేశ వ్యవస్థల దుర్బలత్వాన్ని అందరూ తక్కువగానే అంచనా వేశారు.

బిబిసి: **ఫాదర్ సెడ్రిక్ ప్రకాష్ ఈ చిత్రంలో "ఒక అబద్ధాన్ని వెయ్యిసార్లు చెబితే సహజంగానే అది నిజం అయిపోతుంది" అన్నారు. ప్రజల జ్ఞాపకాల దొంతరల్లో నిజాన్ని ఎలా బ్రతికించగలమో మీరేమైనా చెప్పగలరా?**

**క్రిస్టోఫే:** ఆధిపత్య వర్గాల అసత్య ప్రచారాలతో అపహాస్యం పాలు కాకుండా చరిత్రను భద్రపరచడానికి సామాజిక శాస్త్రవేత్తలు, జర్నలిస్టులు, మానవ హక్కుల కార్యకర్తలు చేసిన కృషి దోహదపడుతుంది. చాలా కాలం క్రితమే రష్యాలో మెమోరియల్ (ఒక మానవ హక్కుల బృందం) ఇటువంటి కృషి చేసింది. ఇప్పుడు కూడా చేస్తూ ఆదర్శంగా నిలిచింది. చేసే పద్ధతి చాలా ముఖ్యం. ప్రతి అంశాన్ని పత్రాల రూపంలోకి మార్చాలి, పున:పరిశీలన చేయాలి, గ్రంథస్తం చేయాలి, ఆధారాలను సేకరించాలి. ఇది చాలా కష్టంతో కూడుకున్న పని. అనుభవిక సమాచారం పరిమాణాత్మకంగాను, గుణాత్మకంగాను కీలక పాత్ర పోషిస్తుంది. ఒక్కసారి ఈ పునాది నిర్మితమైతే అంచనాలు, విశ్లేషణలు సాధ్యమవుతాయి.

బిబిసి: **చాలామంది భారతీయులు ప్రస్తుత రాజకీయ వాతావరణం పట్ల నిరాశగా ఉన్నారు. మీ అభిప్రాయం?**

**క్రిస్టోఫే:** వెనక్కు రప్పించలేం అన్న స్థితికైతే ఇంకా చేరుకోలేదు. కానీ నాలుగు కారణాల రీత్యా యధాతథ స్థితికి చేరుకోవడం చాలా కష్టం.

**మొదటిది** – దాని కోసం ఎవరు పోరాడుతున్నారు? ప్రతిపక్ష పార్టీలు చీలిపోయాయి. మీడియా సంస్థలు కూలిపోతున్నాయి. యూనివర్సిటీ క్యాంపస్‌లు స్వీయ నియంత్రణ నిఘాల్లో ఉన్నాయి.

**రెండవది** – విదేశాలు జోక్యం చేసుకోవడానికి సిద్ధం కాలేదు. పశ్చిమ దేశాలు మోడీ పాలనలోని ఇండియాను చైనా వ్యతిరేక భాగస్వామిగా చూస్తున్నాయి.

**మూడవది** – ప్రభుత్వ వ్యవస్థలు బలహీనంగా ఉండడం లేదా సంఘ్‌పరివార్ గుప్పిట్లో ఉండడం. న్యాయ వ్యవస్థ మినహా ఎలక్షన్ కమిషన్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సిబిఐ అన్నీ ఆ స్థితిలోనే ఉన్నాయి.

**చివరిది** – భారత దేశంలో ఎన్నికలు అందరికీ సమాన స్థాయిలో గెలిచే అవకాశం కల్పించేవి కావు. అది కేవలం ఎలక్షన్ కమిషన్, మీడియా వల్ల మాత్రమే కాదు. డబ్బు వల్ల కూడా. ఎలక్టోరల్ బాండ్‌ల వల్ల 2019 ఎన్నికలలో బిజెపి ఒక్కటే ప్రతిపక్ష పార్టీలన్నీ కలిపి చేసినంత ఖర్చు చేయగలిగింది.

కానీ ఇంకా ఎన్నికలు వస్తాయి. బిజెపి ఓడిపోయే అవకాశం ఉంది. అది రాష్ట్రాల స్థాయిలోనే అయినా బిజెపి అధికార కేంద్రీకరణ వల్ల క్షీణించిపోతున్న భారత సమాఖ్య వ్యవస్థలో కొంత మార్పును తెస్తుంది.

**(అనువాదం: వల్లభనేని గీత)**

జాతీయ పరిణామాలు

# అదాని సేవలో ఆర్ఎస్ఎస్-బిజెపి


రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యుడు


ఎ కోటిరెడ్డి

అదాని కుంభకోణాలను మరుగు పరచటానికి బిజెపి-ఆర్ఎస్ఎస్‌లు నానా తంటాలు పడుతున్నాయి. బిబిసి రూపొందించిన ‘ ఇండియా: ది మోడి క్వశ్చన్’ డాక్యుమెంటరి, అదాని అక్రమాలపై హిండెన్‌బర్గ్ నివేదికలు వాటికి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. వాటిని ఎదుర్కోవటం కోసం తమకు ‘వెన్నతో పెట్టిన విద్య’ లయిన నిరంకుశ పద్ధతులు, అబద్ధపు ప్రచారాలకు మరింతగా పదును పెడుతున్నారు. అదాని వ్యవహారం నుండి ప్రజల దృష్టిని మళ్ళించటం కోసం రాహుల్‌గాంధి పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దుచేసి, ఆ వివాదాన్ని ముందుకుతీసుకొచ్చారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధి భారత జోడో యాత్రచేసి, కాంగ్రెస్ శ్రేణులలో విశ్వాసం నింపటానికి, బిజెపి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఏకం చేయటానికి ప్రయత్నిస్తున్నాడు. అదాని వ్యవహారంపై కూడా ప్రభుత్వానికి ప్రశ్నలు సంధిస్తున్నాడు సమయంలో ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దుచేశారు. రద్దు చేయటానికి ఉదహరిస్తున్న కారణాలు, రద్దు చేసిన పద్ధతి అత్యంత హాస్యాస్పదంగా ఉన్నాయి. రాహుల్‌గాంధి 2019 ఎన్నికలలో చేసిన వ్యాఖ్యలు నేరపూరితమైనవని నిర్ధారించి, గుజరాత్‌లోని సూరత్ జిల్లాకోర్టు ఆయనకు రెండు సంవత్సరాల జైలుశిక్ష, జరిమానా విధించింది. హైకోర్టుకు అప్పీల్ చేసుకోవటానికి నెల రోజుల గడువు కూడా ఇచ్చింది. అయినప్పటికీ రాహుల్‌గాంధి లోక్‌సభ సభ్యత్వం రద్దుచేయటం కోసమే ఎదురు చూస్తున్నట్లుగా, కోర్టు తీర్పు వచ్చిన మరుచటి రోజే లోక్‌సభ సెక్రెటరీ జనరల్ రాహుల్‌గాంధి లోక్‌సభ సభ్యత్వం రద్దు చేశారు. రాహుల్‌గాంధి లోక్‌సభ సభ్యత్వం రద్దుపై ప్రభుత్వం-బిజెపి చేస్తున్న వాదనలు హాస్యాస్పదంగా ఉన్నాయి. 2019 ఎన్నికలలో రాహుల్‌గాంధి మోడిపై చేసిన ఆరోపణలు- దొంగలందరి ఇంటిపేర్లు మోడితో మొదలవుతున్నాయని నీరవ్ మోడి, లలిత్ మోడి, ప్రధాని నరేంద్రమోడిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విమర్శలు -చేశాడు. 2019లో కర్ణాటకలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఈ ఆరోపణలు చేస్తే దానిపై గుజరాత్‌లోని సూరత్ కోర్టులో కేసు పెట్టటం, దానిని ఇపుడు ముందుకుతీసుకురావటం, న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు, తీర్పు ఇచ్చిన 24 గంటలలోనే రాహుల్‌గాంధి లోక్‌సభ సభ్యత్వం రద్దు అంతా పథకం ప్రకారం జరుగుతున్నదని పరిణామక్రమం తెలుపుతున్నది. దానిపై న్యాయమూర్తి ఇచ్చిన తీర్పును అమలు చేస్తున్నామని, దీనికి కాంగ్రెస్, ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని బిజెపి ఆరోపిస్తున్నది.

రాహుల్‌గాంధి లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దుచేయటంతో పాటు ఆయన విదేశాలలో దేశాన్ని అవమానపర్చే విధంగా వ్యాఖ్యలు చేశాడని బిజెపి -ఆర్ఎస్ఎస్‌లు ప్రచారం చేస్తున్నారు. వాస్తవంగా లండన్‌లో రాహుల్ గాంధి చెప్పినదేమిటి? లండన్ సమావేశంలో పాల్గొన్నవారి ప్రశ్నలకు జవాబిస్తూ భారతదేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నదని రాహుల్‌గాంధి చెప్పాడు. దానితో పాటుగా పెగాసస్, చైనా నుండి ప్రమాదం ఉన్నదనటంతో పాటు ఇతర విషయాలపై కూడా ప్రసంగించాడు. రాహుల్‌గాంధి లండన్ పర్యటనలో చెప్పిన విషయాలు భారతదేశంలోని ప్రతిపక్షాలు, ప్రజాస్వామ్య, లౌకిక, అభ్యుదయవాదులు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలే. ప్రచార యంత్రాంగం ప్రపంచవ్యాపితంగా విస్తరించి, ప్రపంచంలోని ఏ మూలన జరిగిన విషయమైనా నిముషాలలో ప్రపంచాన్ని చుట్టివస్తున్న పరిస్థితులలో భారతదేశంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక, నిరంకుశ విధానాలు ప్రపంచవ్యాపితంగా ప్రచారం అవుతున్నాయి. ప్రపంచంలో అత్యంత నిరంకుశ ప్రభుత్వాలున్న పది దేశాల జాబితాలో భారతదేశం ఉన్నది. జర్నలిస్టులపై దాడులు, ప్రజాస్వామ్య సూచీలలో అట్టడుగుకు దిగజారింది. బిజెపి ప్రభుత్వం దేశంలో అమలు జరుపుతున్న మైనారిటీ వ్యతిరేక, ప్రజాస్వామిక వ్యతిరేక విధానాలు, మతోద్రిక్తతలను రెచ్చగొడుతూ ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోకపోవటం, మైనారిటీలపై దాడులు, హత్యలు చేసినవారికి బిజెపి మంత్రులు, నాయకులు సన్మానాలు, సత్కారాలు చేయటం తదితరాల వలన ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ట దిగజారుతున్నది.

రాహుల్‌గాంధిపై బిజెపి ప్రచారానికి ప్రతిగా మోడి భారతదేశంలో ఉన్న ప్రభుత్వాన్ని విమర్శిస్తూ విదేశాలలో మాట్లాడిన తొమ్మిది వీడియోలను కాంగ్రెస్ విడుదల చేసింది. 2015లో చైనాలోని ప్రధాన నగరమైన షాంఘై, దక్షిణకొరియా రాజధాని సియోల్, జర్మనిలోని బెర్లిన్, న్యూయార్క్ తదితర నగరాలలో ప్రధాని మోడి ప్రసంగించాడు. ఈ అన్ని ప్రసంగాలలోనూ గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాలను మోడి విమర్శించాడు. ఆయనతో పాటు విదేశాలలో పర్యటించిన బిజెపి నాయకులు కూడా ఆయా దేశాలలో దేశంలో అమలుజరుగుతున్న విధానాలను విమర్శించారు. కాగా ఇపుడు రాహుల్‌గాంధి ప్రభుత్వ విధానాలను విదేశాలలో విమర్శించి దేశప్రతిష్టనుదెబ్బతీశాడని గగ్గోలు పెడుతున్నారు. దేశంలో ఇతర రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నపుడు ప్రతిపక్షంలో ఉన్న బిజెపి ఇంటాబయటా ఎంత రచ్చ అయినా చేయవచ్చా?

> ❝ కర్ణాటకలో బిజెపి శాసనసభ్యుడు అవినీతి కార్యకలాపాలలో భాగస్వామి అని స్పష్టంగా వెల్లడైనా కనీసం అరెస్టు కూడా చేయలేదు. దావణగేరే జిల్లా చెన్నగిరి నియోజకవర్గ బిజెపి శాసన సభ్యుడు విరూపాక్షప్ప కుమారుడు ప్రశాంత్ తండ్రి తరపున 81 లక్షల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకొని, మొదటి విడత 40 లక్షల రూపాయలు లంచంగా తీసుకున్నాడు. కర్ణాటక లోకాయుక్త ప్రత్య క్షంగా ఎంఎల్ఎ కుమారుని పట్టుకొంది. వారి ఆఫీసులో సోదాలు నిర్వహించగా రెండుకోట్ల రూపాయల నగదు దొరికింది. ❞



మోడీ, అదానీ హిందుత్వ-కార్పొరేట్ బంధం

అపుడు దేశప్రతిష్ఠ దెబ్బతినదా? బిజెపి అధికారంలో ఉన్నపుడు పాలనా విధానాలను ప్రతిపక్షాలు విమర్శిస్తే దేశప్రతిష్ఠ దెబ్బతింటుందా? దేశం అంటే ఆర్ఎస్ఎస్-బిజెపిలేనని వారు భావిస్తున్నారు. ఇందిరే ఇండియా, ఇండియాయే ఇందిర అని ప్రచారం చేసుకున్న ఇందిరాగాంధికి తర్వాతి ఎన్నికలలో ప్రజలు ఏ గతి పట్టించారో బిజెపి-ఆర్ఎస్ఎస్‌లు గుర్తుంచుకోవటం అవసరం.

**కవిత విచారణ-**
**కర్ణాటక ఎంఎల్ఎ కు ఆగమేఘాలపై బెయిలు**

స్వంతపార్టి నాయకులు, తనకు వ్యతిరేకంగా ఉన్న ప్రతిపక్షపార్టిలలోని నాయకులపై బిజెపి అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలు అవినీతి కేసుల విచారణ సందర్భంలో వెల్లడౌతున్నాయి. ఢిల్లీ మద్యం కుంభకోణంలో కవితపై అనేక ఆరోపణలు చేస్తున్నారు. ఇతరులతో కలిసి అవినీతిలో భాగస్వామి అయిందని, ఫోన్‌లు మార్చిందని సుదీర్ఘంగా విచారణ జరుపుతున్నారు. కుంభకోణంపై విచారణ జరుపుతున్నపుడు కవిత పేరు కూడా వారి సంభాషణలలో వెల్లడైందనే కారణంతో విచారణ తతంగాన్ని కొనసాగిస్తున్నారు. మరోవైపున కర్ణాటకలో బిజెపి శాసనసభ్యుడు అవినీతి కార్యకలాపాలలో భాగస్వామి అని స్పష్టంగా వెల్లడైనా కనీసం అరెస్టు కూడా చేయలేదు. దావణగేరే జిల్లా చెన్నగిరి నియోజకవర్గ బిజెపి శాసనసభ్యుడు విరూపాక్షప్ప కుమారుడు ప్రశాంత్ తండ్రి తరపున 81 లక్షల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకొని, మొదటి విడత 40 లక్షల రూపాయలు లంచంగా తీసుకున్నాడు. కర్ణాటక లోకాయుక్త ప్రత్యక్షంగా ఎం ఎల్ ఎ కుమారుని పట్టుకొంది. వారి ఆఫీసులో సోదాలు నిర్వహించగా రెండుకోట్ల రూపాయల నగదు దొరికింది. తండ్రి, కుమారులకు చెందిన వివిధ ప్రదేశాలలో నిర్వహించిన సోదాలలో నగదు, బంగారు, వెండి నగలు, విలాసవంతమైన కార్లు, వివిధ సంస్థలలో పెట్టుబడులకు సంబంధించిన డాక్యుమెంట్లు తదితరాలు ఆరుకోట్ల రూపాయలకు పైగా విలువైనవి లభించాయి. వీటితో పాటు కర్ణాటకలోని వివిధప్రాంతాలలో 400 ఎకరాలకు పైగా భూములు కొన్న డాక్యుమెంట్లు కూడా లోకాయుక్తకు దొరికాయి. ఇన్ని ఆధారాలతో దొరికిన వారిని కనీసం అరెస్టు కూడా చేయలేదు. శాసనసభ్యునికి వారం లోపునే కోర్టు నుండి ముందస్తు బెయిల్ లభించింది. ఎం ఎల్ ఎ, ఆయన కుమారుని ఇళ్ళకు ఇ డి రాలేదు. ఆఫీసులకు పిలిచి రోజుల తరబడి విచారణ లేదు, వాస్తవాలు కక్కించటానికి జైళ్ళలో నిర్బంధం లేదు. బిఆర్ఎస్ ఎంఎల్సి కవిత, ఆప్ నాయకుడు సిసోడియా, ఇతర ప్రతిపక్షాలకు చెందిన నాయకులకు ఈ విధమైన వెసులుబాటు కల్పించలేదు. ఎటువంటి ఆధారాలు లేకుండానే వారిని విచారించటం, నేరారోపణలు చేయటం, అరెస్టు చేసి జైళ్ళలో నిర్బంధించటం తదితరాలు చేస్తున్నారు. ఆ విధంగా నేరారోపణలు చేయబడిన వారు, నేరాలు రుజువైన వారు బిజెపిలో చేరినా లేదా వారు సభ్యులుగా ఉన్న పార్టి బిజెపికి మిత్రపక్షంగా మారినా వారిపై విచారణ నిలిచిపోతున్నది. వారిపై ఉన్న కేసులు రద్దైపోతున్నాయి. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఉదంతం ఇందుకు ఉదాహరణగా నిలుస్తుంది. హిమంత బిశ్వశర్మ కాంగ్రెస్‌లో ఉన్నపుడు ఆయన అనేక అవినీతికేసులలో ఉన్నాడు. బిజెపిలో చేరిన వెంటనే ఆయనపై ఉన్న కేసులు రద్దైనాయి. ప్రతిపక్షాలను భయపెట్టి, బెదిరించి లొంగదీసుకోవటానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాలలో ఇ డి, సి బి ఐ, ఎన్ ఐ ఎ తదితరాలను పావులుగా ఉపయోగించుకుంటున్నది.

**వైసిపి కి ప్రతికూల పరిణామాలు**

ఆంధ్రప్రదేశ్‌లో పట్టభద్రుల ఎం ఎల్ సి స్థానాలకు జరిగిన ఎన్నికలలో మూడు స్థానాలలోనూ అధికారంలో ఉన్న వైసిపి ఓడిపోయి, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టి డి పి విజయం సాధించింది. శాసనసభ్యులు ఎన్నుకోవలసిన శాసనమండలి సభ్యుల స్థానాలలో ఎన్నికలు జరిగిన ఏడు స్థానాలోనూ గెలవటానికి అవసరమైన సభ్యులు వైసిపికి ఉన్నప్పటికీ ఒకస్థానంలో ఓటమి చెందింది. తనకు ఉన్న శాసనసభ్యుల కన్నా నాలుగు ఓట్లు అదనంగా సాధించిన టి డి పి తాను పోటి చేసిన స్థానంలో విజయం సాధించింది. ఈ రెండు ఎన్నికలలో వచ్చిన ప్రతికూల ఫలితాలు వైసిపిని ఒక కుదుపు కుదిపాయి. పట్టభద్రుల స్థానాలకు జరిగిన ఎన్నికలలో ఓటమిని ఏదో పేరుతో సమర్థించుకున్నా, శాసనసభ్యుల స్థానాల నుండి జరిగిన ఎన్నికలలో ఓటమిని వైసిపి నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. రాష్ట్రంలోని ప్రజలంతా తమవెంటే ఉన్నారని,

2024 ఎన్నికలలో కూడా తామే విజయం సాధిస్తామని డంబాలు చెప్పుకుంటున్న వైసిపికి ఇవి ఊహించని దెబ్బలు. ప్రభుత్వంపైన ఎంత వ్యతిరేకత ఉన్నప్పటికీ తాము అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు 2024 ఎన్నికలలో తమకు విజయం సాధించిపెడతాయని వైసిపి నాయకత్వం చేస్తున్న ప్రచారాన్ని ఈ పరిణామాలు విఘాతం కలిగించాయి. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలలో అవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయి.

2019 ఎన్నికలలో విజయం సాధించిన తర్వాత వాగ్దానభంగాలు, ప్రజా వ్యతిరేక విధానాలు, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి దాసోహం అవటం, అదానికి రాష్ట్రాన్ని అప్పజెప్పటం వైసిపి పాలనలో ప్రధానాంశాలుగా ఉన్నాయి. వైసిపి అధికారానికి వచ్చిన తర్వాత వృద్ధాప్య, వితంతు పెన్షన్‌లను రూ. 2000 నుండి రూ. 3000 లకు పెంచుతానని, ముఖ్యమంత్రిగా మొదటి సంతకం ఆ ఫైల్ పైనే పెడతానని ఎన్నికలలో జగన్మోహనరెడ్డిగారు ప్రచారం చేశారు. కాని ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత వృద్ధాప్య పెన్షన్‌ను 2000 నుండి 2250 రూపాయలకు పెంచుతూ సంతకం చేశాడు. సంవత్సరానికి 250 రూపాయల చొప్పున ప్రతి సంవత్సరం పెంచి, తాము అధికారంలో ఉండే ఐదు సంవత్సరాలలో 3000 రూపాయలు చేస్తామని, ఆ విధంగా వాగ్దానాన్ని నెరవేర్చుకున్నామని ప్రకటించుకున్నాడు. ఉద్యోగులకు ఇచ్చిన సిపిఎస్ రద్దు, ఓపిఎస్ అమలు, విద్యుత్ ఛార్జీల పెంపు తదితరాలన్నింటిలోనూ వైసిపి ప్రభుత్వ వాగ్దానభంగం చేస్తున్నది. 2019 ఎన్నికల విజయం తర్వాత రానున్న పది సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా తమకు ఎదురులేదని వైసిపి కార్యకర్తలు భావించేవారు. ఇప్పటికీ వచ్చేసరికి 2024 శాసనసభ ఎన్నికలలో గెలుస్తామనే విశ్వాసం చాలామందిలో సన్నగిల్లింది.

వైసిపితోనే సంక్షేమ పథకాలు ప్రారంభం కాలేదు. దేశంలో భూసంస్కరణలు, సంక్షేమ పథకాల అమలు, గ్రామసీమల వరకు ప్రజాస్వామ్యాన్ని విస్తరించటంలో పశ్చిమబెంగాల్‌లో 1977-2011 మధ్య అధికారంలో ఉన్న వామపక్ష ప్రభుత్వం దేశానికి మార్గదర్శిగా ఉంది. తర్వాతికాలంలో కేరళ, త్రిపురలలో అధికారంలోకి వచ్చిన వామపక్ష, ప్రజాతంత్ర ప్రభుత్వాలు కూడా అదే ఒరవడిని

“ ఉద్యోగులకు ఇచ్చిన సిపిఎస్ రద్దు, ఓపిఎస్ అమలు, విద్యుత్ ఛార్జీల పెంపు తదితరాలన్నింటిలోనూ వైసిపి ప్రభుత్వ వాగ్దానభంగం చేస్తున్నది. 2019 ఎన్నికల విజయం తర్వాత రానున్న పది సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా తమకు ఎదురులేదని వైసిపి కార్యకర్తలు భావించేవారు. ఇప్పటికీ వచ్చేసరికి 2024 శాసనసభ ఎన్నికలలో గెలుస్తామనే విశ్వాసం చాలామందిలో సన్నగిల్లింది. ”



టార్గెట్ భారాస, కేసు కవితపైన


అనుసరించాయి. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం కిలో బియ్యం రూపాయికి అందించాలని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇవ్వాలని, వృద్ధులకు పెన్షన్లు, పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని తదితర సమస్యలపై విస్తృతమైన ఉద్యమం నడిచింది. లక్షలాది మంది ఆ ఉద్యమంలో భాగస్వాములయ్యారు, అదే సమయంలో తెలుగుదేశం పార్టీ ఏర్పడటం, దాని నాయకుడుగా ఉన్న ఎన్ టి రామారావు రాష్ట్రంలో తమపార్టీ అధికారంలోకి వస్తే ప్రజా ఉద్యమం ముందుకు తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని వాగ్దానం చేశాడు. ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని వాగ్దానాలను అమలుచేశాడు. ఆ విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు ప్రారంభమైంది. తర్వాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఒకవైపున వివిధ రూపాలలో ప్రజలపై భారాలు వేస్తూనే, మరోవైపున తమ రాజకీయ అవసరాల కోసం సంక్షేమ పథకాలను కొనసాగించటం, విస్తరించటం చేశాయి. 2019లో వైసిపి అధికారంలోకి రాకముందు ప్రజావ్యతిరేకతను పసిగట్టిన చంద్రబాబునాయుడు వృద్ధులు, వితంతువులకు ఇస్తున్న పెన్షన్‌ను నెలకు 1000 రూపాయల నుండి 2000 రూపాయలకు పెంచాడు. అయినా ప్రజలలో అప్పటికే రాజకీయంగా టిడిపికి వ్యతిరేకంగా మార్పు రావటం, 'చంద్రబాబునాయుడు ఇచ్చేది పూర్తయింది, ఇక జగన్మోహనరెడ్డిగారు కొన్నయినా ఇస్తాడనే' ఆకాంక్షతో ఆనాడు సామాన్యప్రజలలో ఎక్కువ మంది వైసిపికి ఓట్లు వేశారు. జగన్మోహనరెడ్డిగారు చేసేవి, చేయనివి చూశారు. జగన్మోహనరెడ్డిగారి నాయకత్వంలోని వైసిపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలలో పలుచన అయిందని, శాసనసభ్యులలో కూడా ఆయనపై విశ్వాసం తగ్గిందని ఈ ఎన్నికలు నిరూపించాయి. ఇంక ఆయన చేసేది ఏమీ లేదని ప్రతిపక్షాలుగా ఉన్న వారికి ఓటు వేయవచ్చు. ప్రజలు చైతన్యవంతంగా ఆలోచిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్న భారాలను నికరంగా వ్యతిరేకిస్తున్నదీ, రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడుతున్నది కమ్యూనిస్టులేనని అర్థం చేసుకుంటే 2024లో జరుగనున్న శాసనసభ ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులకు ఓట్లు వేయవచ్చు.

కేంద్ర ప్రభుత్వం ప్రజలపై విధిస్తున్న భారాలను వైసిపి ప్రభుత్వం వ్యతిరేకించకపోగా, దానితో కుమ్మక్కై తాను కూడా అదనంగా భారాలను మోపుతున్నది. ప్రజలు ఈ భారాలను ప్రతిఘటించటానికి పోరాటాలలోకి వస్తారు. అందువలన ఆంధ్రప్రదేశ్‌లో రానున్న కాలం పోరాటాల కాలంగా ఉండబోతున్నది. ఉధృతంగా జరిగే పోరాటాలు రాజకీయ మార్పులకు కూడా దారితీయవచ్చు. అందువలన కమ్యూనిస్టు పార్టీలు, వామపక్షాలు, సామాజిక మార్పులను కోరుకొనే సంఘాలు, శక్తులు, వ్యక్తులు పోరుబాటలో పయనించాలి. మార్పుకు దారితీయనున్న రాజకీయ పవనాలకు దిశానిర్దేశం చేయాలి. ❋

మతతత్వం

# భక్తి: నాడు-నేడు

**గణేష్ దేవి**



రచయిత రాజకీయ విశ్లేషకుడు

ఈరోజు భక్తి అంటే ఒక సజీవ వ్యక్తి వైపు నిర్దేశించబడిన, ఆ వ్యక్తే ఒక విస్తృత డిజిటల్ ఏర్పాటు ద్వారా మాట్లాడే వ్యవస్థ.

భారతీయులు తమ ఇష్ట దైవం పట్ల చూపించే భక్తి అనేది భారతీయ సంస్కృతి ప్రధానం లక్షణాల్లో ఒకటి. ఆ ఇష్టదైవం ఎంతో ముఖ్యమైన దేవుడు కావచ్చు, స్థానిక దేవత కావచ్చు, గొప్ప సాధువు లేదా అంతగా ప్రాముఖ్యం లేని ఒక చిన్న మతశాఖకి అధిపతి కావచ్చు. ఇటువంటి భక్తి భారతీయ సమాజం అంతటా మనకు కనిపిస్తుంది. భక్తి అనే ఈ సాంస్కృతిక లక్షణాన్ని ఆంగ్ల అనువాదంలో "డివోషనలిజం" (ఆరాధన) అని కాకుండా "డివోషన్" (భక్తి)గా వర్ణించారు. భారతదేశంలో ఏడవ శతాబ్ది నుండి 15 వ శతాబ్ది వరకు భక్తి ఉద్యమం విస్తృతంగా వ్యాప్తి చెందింది. ఈ చారిత్రాత్మక భక్తి ఉద్యమం ప్రజల సున్నితమైన మనోభావాలలో సమూలమైన మార్పు తీసుకొచ్చింది. బంగ్లా, అస్సామియా, మరాఠీ, గుజరాతీ, కన్నడ, ఒడియా, హిందీ వంటి అనేక ఆధునిక భాషలు రావటానికి ఈ భక్తి ఉద్యమం దారితీసింది. ఈ ఉద్యమం ప్రధానంగా మతపరమైన సనాతన ధర్మాన్ని సవాలు చేసింది.

భారతీయ సమాజంపై ఈ ఉద్యమం చూపిన అసాధారణ ప్రభావం వల్ల భక్తి ఉద్యమాన్ని ఒక ప్రగతిశీల ఉద్యమంగా పరిగణిస్తారు. ఈ ఉద్యమం సంస్కృత భాష, శైలికి సంబంధించిన మితిమీరిన సాంప్రదాయాలను కూలదోసింది. బ్రాహ్మణ గుత్తాధిపత్యంలో ఉన్న తాత్విక సాంప్రదాయాలను, నైతిక విలువలను ఎదుర్కొంది. ప్రాంతీయ ఆకాంక్షలకు గుర్తింపు నిచ్చి, వాటిని నొక్కి చెప్పింది. వీటితో పాటు ఈ ఉద్యమం ఒక కొత్త సామాజిక తత్వశాస్త్రం, తాత్వికత, కళాతత్వ శాస్త్రాన్ని తీసుకువచ్చింది. భక్తి సాహిత్యపు ఉప్పెన భారతదేశంలోని భాషల సరిహద్దులు దాటి అన్ని భాషల సాహిత్యాలను ప్రభావితం చేసింది. ఈ ప్రభావం ఎంతో కాలం కొనసాగింది. ఈ ఉద్యమం ఆధిపత్య, అతి కఠినమైన ప్రధాన స్రవంతి సాంప్రదాయాలకు వ్యతిరేకంగా ప్రాంతీయ, దేశీ (ఉప-స్రవంతి) సంస్కృతులకు గౌరవాన్ని ఇచ్చింది. 7 నుండి 15 శతాబ్దాల మధ్య కాలంలోని ఈ భక్తి సాహిత్య ఉప్పెన భారతీయ సమాజంలో అప్పుడు కొనసాగుతున్న సంక్లిష్ట పరిస్థితులకు, సమాజంలో జరిగిన సమూల మార్పులకు అద్దం పడుతుంది.

బ్రిటీష్ పాలనకు ముందు కాలం నాటి భాషా సాహిత్యం ఇప్పటికీ భారతదేశంలో సజీవ వారసత్వంగా కొనసాగుతోంది. మరాఠీలో నామదేవ (1270-1350) తుకారాం (1598-1650) కవిత్వం, గుజరాతీలో నరసింహ మెహతా (1414-81) అఖా (1615-1674)లు, హిందీలో కబీర్ (1440-1518) సూరదాస్ (1483-1567)లు, పంజాబీలో గురునానక్ (1469-1539) మొదలగువారు భారతీయ చైతన్యంలో విడదీయరాని భాగంగా మారారు. తుకారాం, మీరా, కబీర్, బసవేశ్వర్ వంటి వారు భారతదేశ సాంస్కృతిక మధనంలో ఆవిర్భవించిన కలల చిత్రాలు.

భారతదేశ సాంస్కృతిక చరిత్రలో ఈ కాలంలో ఉద్భవించిన సంగీతం, చిత్రలేఖనం, నృత్యం, వాస్తుశిల్పం, కవిత్వం ఒక అద్భుతమైన అధ్యాయాన్ని ఏర్పరిచాయి. ఏ ఒక్క సాధారణ సూత్రం అయినా ఆ కాలం మొత్తంలోని సజీవ సాంస్కృతిక సాంప్రదాయాలకూ, గొప్ప సామాజిక సమస్యలకూ మధ్య సంబంధాన్ని గురించి సంతృప్తికరంగా వివరించలేదు. అయితే భక్తి అనేది ఒక ఉద్యమం, ఒక తాత్విక వ్యవస్థ కాదు. ఇది తన స్వంత గతిసూత్రాలను కలిగి ఉంది. కాని ఈ భక్తి ఉద్యమం ఎప్పుడూ తాను సమర్థించిన విలువలను ఒక పిడివాద సిద్ధాంతం ద్వారా నిలబెట్టాలని ప్రయత్నించ లేదు.

ప్రధానస్రవంతి, దేశీ సంప్రదాయాల మధ్య స్థాపించబడిన హెచ్చు తగ్గులన్నింటినీ తిప్పికొట్టి, చలనం లేక బిగుసుకు పోయిన సమాజాన్ని కుదిపి , సమాజపు స్వభావాన్ని గణనీయంగా మార్చింది. భక్తి కవిత్వ వికాసపు సహజ పరిణామం భాషా సాహిత్య ఆవిర్భావం అని చెప్పవచ్చు. సాంప్రదాయక భారతీయ సాహిత్యం సాంప్రదాయాల బిగి పిడికిలిలో,కఠినమైన సామాజిక, నైతిక విలువల అధీనంలో ఉన్నప్పుడు భక్తి ఉద్యమం ఒక భావోద్వేగవాదాన్ని ఆవిష్కరించింది.

సాంప్రదాయవాదులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడంలో, అనియంత్రిత భావోద్రేకవాదం వైపు తిరగడంలో, భక్తి ఒక హేతుబద్ధమైన ఆలోచనపై స్థాపించబడిన మేధో వ్యవస్థలను అభివృద్ధి చేయలేక పోయింది. భక్తి ఒక విప్లవాత్మకమైన సామాజిక, సాహిత్య ప్రేరణ. అది ప్రతీకవాదం, ఆధ్యాత్మికత ద్వారా వ్యక్తమైంది. కాని మేధో ప్రసంగాలు రూపొందించడానికి అవసరమైన హేతుబద్ధమైన బలాన్ని ఇవ్వలేకపోయింది. శిల్పం, శైలులతో కొత్త ప్రయోగాలను చేసి, కవిత్వపు అన్ని కట్టుబాట్లను భక్తి ఉద్యమం మార్చింది. కాని కవిత్వపు కొత్త సాంప్రదాయాలను ఒక వరవడిగా రూపొందించడానికి అది ఎప్పుడూ ప్రయత్నించలేదు. సామాజిక శాస్త్రపరంగా చూస్తే సంస్కృతి, ధర్మశాస్త్రాలపై గుత్తాధిపత్యం నెరపుతున్న బ్రాహ్మణ వర్గంపై అణగారిన వర్గాలు విసిరిన సవాలు ఈ భక్తి కవిత్వం.

అయితే ఈ సవాలు సాంప్రదాయ జ్ఞాన ప్రసార వ్యవస్థకి చిన్న గంటు కూడా పెట్టలేదు. సాహిత్యంలో అప్పటికే ప్రబలి ఉన్న ధోరణులు ఈ "వర్గయుద్ధాన్ని" తీవ్రతరం చేసాయి.

అందువల్ల సాహిత్యానికి రాజకీయ ప్రోత్సాహాన్ని అందించగల వర్గం భక్తి సాహిత్యాన్ని స్వాగతించలేదు. మార్గ సంప్ర దాయం భక్తి యొక్క తిరుగుబాటు ఆధ్యాత్మికతను విస్మరించి, దాని వేదాంత విషయాలను మాత్రమే అంగీకరించిందని చెప్పడం మరింత సముచితంగా ఉంటుంది.

అందువల్ల సంస్కృతి ఆధారిత సాంప్ర

దాయక విద్య పాలక వర్గాల మధ్య శతాబ్దాల వరకు నిరంతరాయంగా ప్రోత్సాహాన్ని అందిస్తూనే ఉన్నది. మరో విధంగా చెప్పాలంటే సాంప్రదాయక విద్య మార్గానికి చెందినది, అయితే జీవితంలోని సంక్లిష్టతల అనుభవం వ్యక్తిగత శైలి ద్వారా వ్యక్తీకరించబడే దేశీ ద్వారానే ప్రాచుర్యం పొందింది. అనుభవం లోనికి వచ్చిన జీవితానికి, సాంప్రదాయ జ్ఞానానికి మధ్య ఉన్న ఈ అంతరం వల్లే భక్తి సాహిత్యం పెద్ద ఎత్తున ఆధునిక మార్పు తీసుకురాలేకపోవటానికి కారణం అయింది.

> **❝ మధ్యయుగ భక్తి ఉద్యమంలో భక్తులు తమ దైవంతో మాట్లాడేవారు, విజ్ఞప్తులు చేసేవారు, పోట్లాడేవారు, బుజ్జగించి ముద్దు చేసేవారు, ఇంకా వారి మహిమల గురించి మాట్లాడే వారు. ఇప్పుడు దైవం యొక్క సమాచార వ్యవస్థ భక్తులకు సందేశాలను పంపుతుంది. వీటికి అనుగుణంగా భక్తులు దైవం యొక్కప్రత్యర్థులు, విమర్శకులు, ఇంకా ఇతర స్వేచ్ఛా ఆలోచనా పరులపై దాడి చేయడం ద్వారా దైవం పట్ల తమ ప్రేమను వ్యక్తం చేస్తారు. ❞**

**కొత్త భక్తి ఆరాధన**

ప్రస్తుతం భారతదేశంలో ఒక కొత్త భక్తి ఆరాధన ఉద్భవించింది. దాని సభ్యులు తమను తాము భక్తులు (డీవోటీస్) అని పిలుచుకుంటారు. ఈ పదాన్ని ఈ ఆరాధనకు సభ్యత్వం తీసుకోని వారు కూడా వారి కోసం ఉపయోగిస్తారు. ఏది ఏమైనప్పటికీ "భక్తి" యొక్క ప్రస్తుత బ్రాండ్, మధ్య యుగ కాలంలోని భక్తి సంప్రదాయానికి పూర్తిగా వ్యతిరేకం. ఈ భక్తి గురించి మాట్లాడే టప్పుడు "ఇప్పటి-భక్తి" అనే పదాన్ని ఉపయోగిస్తాను.

ఇప్పటి-భక్తి ఒక నైరూప్య దైవానికో, పౌరాణిక పాత్రకో ఆత్మ సమర్పణ లేదా భక్తి కలిగిఉండాలని బోధించదు. ఇది జీవించి ఉన్న వ్యక్తి వైపు నిర్దేంచబడింది. అదృశ్యంగా నియంత్రించబడే ఒక విస్తృత వార్తాజాల తంత్రం ద్వారా డిజిటల్ సందేశాలతో ఈ వ్యక్తి భక్తులతో మాట్లాడతాడు. సందేశాలలో ఏది వచ్చినా కొద్దిగా కూడా ఆలోచించకుండా అది సత్యమని భక్తులు ఎంతో సంతోషంగా స్వీకరిస్తారు. ఈ సమాచారం ప్రామాణికతను ప్రశ్నించే ఎవరైనా "శత్రువు", "ద్రోహి" "సంఘ వ్యతిరేకులు"గా చూడబడతారు. ఈ భక్తులు తమ భక్తిని వ్యక్తీకరించడానికి కవిత్వం లేదా సంగీతాన్ని ఉపయోగించరు. సైబర్‌స్పేస్‌లోని డిజిటల్ సందేశాలు నిర్దేశించినట్లు తు. చ. తప్పకుండా చేస్తారు.

మధ్యయుగ భక్తి ఉద్యమంలో భక్తులు తమ దైవంతో మాట్లాడేవారు, విజ్ఞప్తులు చేసేవారు, పోట్లాడేవారు, బుజ్జగించి ముద్దు చేసేవారు, ఇంకా వారి మహిమల గురించి మాట్లాడేవారు. ఇప్పుడు దైవం యొక్క సమాచార వ్యవస్థ భక్తులకు సందేశాలను పంపుతుంది. వీటికి అనుగుణంగా భక్తులు దైవం యొక్క ప్రత్యర్థులు, విమర్శకులు, ఇంకా ఇతర స్వేచ్ఛా ఆలోచనాపరులపై దాడి చేయడం ద్వారా దైవం పట్ల తమ ప్రేమను వ్యక్తం చేస్తారు. దైవం యొక్క సమాచార యంత్రాంగం భక్తుల చర్యలను గమనిస్తూ, వారిలోని చురుకైన భక్తులను "లైక్" లేదా "ఫాలో" ("ఇష్టపడు" లేదా "అనుసరించు") చేసే వారి జాబితాలోకి చేర్చుకుంటుంది. మధ్యయుగ భక్తి ఉద్యమం దేవుడిని మానవీకరించాలని కోరుకుంది. ఇప్పటి-భక్తి దైవాన్ని సాధారణ మానవులకు అందనంత ఎత్తులో ఉంచటానికి ఇష్టపడు తోంది. దైవం పనితీరు, సామర్థ్యంలో మన పూర్వీకులను మించిపోయిందని భక్తులకు పూర్తి భరోసా ఉంది. దైవం యొక్క మానవాతీత సామర్థ్యాల గురించి చిన్న సందేహం వెలిబుచ్చినా కూడా భారతదేశపు గొప్ప సంప్రదాయాలకు, ప్రస్తుత హోదాకు, భావించుకున్న భవిష్యత్తుకు వ్యతిరేకంగా నేరం జరిగినట్టుగా భావిస్తారు.

ఈ భక్తులు ఇప్పుడు మానవతావాదం కంటే జాతీయవాదాన్ని, పౌర-సమానత్వం అనే ఆధునిక ఆలోచన కంటే తమ ధర్మ శాస్త్రాల గురించిన అతిశయాన్ని, అలానే వాస్తవ సత్యాల కంటే ప్రచారాన్ని ఇష్టపడుతున్నారు. ఇప్పటి-భక్తి భక్తుల మనస్సులను మూసి వేయడానికి, వారి హేతుబద్ధమైన సామర్థ్యాలను రూపుమాపడానికి, రాజ్యాంగ విలువలను తాము భావించుకున్న జాతీయ ప్రతిష్ఠతో, జాత్యహంకారంతో భర్తీ చేయడానికి ప్రయత్నిస్తుంది. గతంలో భక్తి అనేది సనాతన ధర్మం నుండి మతాన్ని రక్షించడానికి, మానవులను ఒకరికొకరిని దగ్గరగా తీసుకు రావడానికి, మతగ్రంధాల నిజమైన స్ఫూర్తిని బయటకు తీయడానికి ప్రయత్నించింది. ఇప్పటి-భక్తి వైవిధ్యాన్ని, వ్యత్యాసాన్ని ఒకే గుర్తింపు కార్డుతో కట్టి ఉంచడానికి, ఒక భావజాలాన్ని దేశంతో, దేశాన్ని ఒకే వ్యక్తితో, ఇంకా ఒక వ్యక్తిని కోట్లాది మంది తలరాతతో సమానం చేయడానికి ప్రయత్నిస్తుంది. పూర్వకాలంలో భక్తి కొత్త భాషలకు, కొత్త సాహిత్య వ్యక్తీకరణలకు దారితీసింది. ఇప్పటి-భక్తి సమాజానికి, జీవితానికి, ఆలోచనకి, సంస్కృతికి ప్రమాణంగా తమ అధిష్ఠాన దైవాన్ని ఉంచి, దేనినీ ప్రశ్నించ కుండా, అన్నింటికీ పూర్తి అంగీకారం తెలుపుతూ ఉండాల్సిన పరిస్థితి తీసుకువచ్చింది. ఒకప్పటి భక్తి ఒక సహస్రాబ్ది తర్వాత ఉద్యమంగా ఉద్భవించింది. ఇప్పటి-భక్తి భారతదేశాన్ని ఎంత దూరం తీసుకెళుతుందో చూడాలి.

భక్తి ఉద్యమానికి చెందిన సాధువులు, కవులు భారతదేశాన్ని ఆధునిక జన జాతి జీవితంలోకి తీసుకువచ్చిన స్వాతంత్ర్య సమరయోధులు. వారు మన గురించి ఏమను కుంటారో నాకు తెలియదు. ఒకప్పటి భారతదేశం ప్రస్తుత భారతదేశాన్ని గర్వంగా చూస్తుందా అని ఆశ్చర్యపోతున్నాను.

(అనువాదం: కె పుష్పవల్లి)

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!


**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

**ఈ మాసం ప్రత్యేకం**

## ఆంటోనియో గ్రాంసీ:

# ఆధిపత్యం, ప్రతి-ఆధిపత్యం



రచయిత మార్క్సిస్టు పత్రిక సంపాదకుడు

**ఎస్ వెంకట్రావు**

మార్క్సిస్టు సిద్ధాంతవేత్త, ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత, పిన్న వయసులోనే ఫాశిస్టు ముస్సోలినీ కర్కశ జైలు శిక్షలో అసువులు బాసిన ఆంటోనియో గ్రాంసీ రచనల్లో అతి ముఖ్యమైన విషయం, నేటి కాల పరిస్థితుల్లో మనం అర్థం చేసుకుని, ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉన్న అంశం...''ఆధిపత్యం, ప్రత్యాధిపత్యం'' (హెజిమోనీ, కౌంటర్-హెజిమోనీ). హెజిమోనీ అనే పదాన్ని గ్రాంసీ సృష్టించకపోయినా ఒక భావన (కాన్సెప్ట్)కు ఆ పేరు పెట్టింది, లేదా ఆ పేరుతో ఒక భావనను వివరించింది మాత్రం ఆయనే. 11 ఏళ్ల తన జైలు జీవితంలో గ్రాంసీ ఎంతో ప్రయాసకోర్చి రాసిన 'జైలు రచనలు' (ప్రిజన్ నోట్‌బుక్స్)లో హెజిమోనీ, కౌంటర్ హెజిమోనీ అనే భావనను ప్రతిపాదించాడు.

### ఆధిపత్యం (హెజిమోనీ) అంటే ఏమిటి?

ఆధిపత్యం అనే పదాన్ని గ్రాంసీ సాధరణ అర్థంలో వాడలేదు. ఏదైనా పాలకవర్గం తన క్రింది వర్గాలపై ఎలా పరిపాలన సాగిస్తుంది అని చెప్పడానికి గ్రాంసీ ఈ 'ఆధిపత్యం' (హెజిమోనీ) అన్న పదాన్ని ఉపయోగించాడు. అందువల్ల పాలవర్గాన్ని లేక వర్గాలను కూలదోసి తనదైన వర్గపాలన నెలకొల్పాలనుకున్న వర్గం లేక వర్గాలు కూడా తమతో కలిసివచ్చే వర్గాలపై 'ఆధిపత్యం' (హెజిమోనీ) సాధించాలని చెప్పాడు. నిజానికి ఆధిపత్యం అనే భావన మార్క్సిస్టు పరిభాషలో అంతకు ముందు నుండీ వస్తున్నదే. కార్మిక వర్గం ఇతర పీడిత వర్గాలకు నాయకత్వం వహించడాన్ని లెనిన్ కార్మికవర్గ ఆధిపత్యంగా వర్ణించాడు. "వర్తమాన సమాజంలో ఏకైక నిరంతర విప్లవ వర్గంగా కార్మిక వర్గం మొత్తం ప్రజల ప్రజాతంత్ర విప్లవానికి నాయకత్వం వహించాలి. అంటే మొత్తం శ్రామికులు, దోపిడీకి గురవుతున్న ప్రజలు తమను పీడిస్తున్న, దోపిడీ చేస్తున్న వర్గాలపై జరిపే పోరాటానికి నాయకత్వం హించాలి" అని లెనిన్ చెప్పాడు. అయితే, గ్రాంసీ ఈ లెనినిస్టు భావనను మరింత పరిపుష్టం గావించాడు.

గ్రాంసీ 'ఆధిపత్యం' (హెజిమోనీ) అంటే పీడిత వర్గాలపై పాలక వర్గాల నైతిక, మేధోపరమైన నాయకత్వం అని అర్థం. ఇటువంటి నాయకత్వం వల్ల పీడిత వర్గాలు పాలక వర్గాల నాయకత్వాన్ని అంగీకరిస్తాయి. 1870 తరువాత పశ్చిమ దేశాల్లో ఏర్పడిన బూర్జువా ప్రభుత్వాలు నిరంకుశ అధికార యంత్రాంగం ద్వారా కాకుండా ఈ విధమైన సైద్ధాంతిక, సాంస్కృతిక ఆధిపత్యం ద్వారా, ఒక రకంగా తమ పాలనను పీడిత వర్గాలు అంగీకరించేట్లు ఒప్పించడం ద్వారా పరిపాలన సాగిస్తూ వస్తున్నాయని గ్రాంసీ పేర్కొన్నాడు. పశ్చిమ దేశాల్లోనే కాకుండా మన దేశంతో సహా బూర్జువా పాలన స్థిరపడిన దేశాలన్నింటా ఇదే పరిస్థితిని మనం చూడగలం.

ఆధిపత్య వర్గాలు సమాజాన్ని రెండు రాజకీయ రూపాల్లో నియంత్రిస్తాయని గ్రాంసీ చెప్పాడు. మొదటిది, అణచివేత (డోమినేషన్). ఇందులో నేరుగా ప్రజలను పోలీసులు, సైన్యం ఇతర అధికార యంత్రాంగంతో భౌతికంగా అణచివేస్తుంది. రెండవది ఆధిపత్యం (హెజిమోనీ). ఇందులో సైద్ధాంతికంగా, మరీ ముఖ్యంగా ఒప్పించడం ద్వారా నియంత్రిస్తుంది. ఎంతటి నిరంకుశ ప్రభుత్వమైనా కేవలం రాజ్యాధికారం ద్వారా, పోలీసులు, సైన్యం ద్వారా పరిపాలించలేదు. దీర్ఘకాలంలో అది సుస్థిరంగా ఉండాలంటే ప్రజల సమ్మతినీ, మద్దతునూ పొందాలి. ఈ సమ్మతిని వారిపై సైద్ధాంతిక ఆధిపత్యం (హెజిమోనీ) ద్వారా పాలకవర్గాలు పొందుతాయని గ్రాంసీ వివరించాడు.

గ్రాంసీ దృష్టిలో 'ఆధిపత్యం' అంటే కొన్ని విలువలు, ధోరణులు, నమ్మకాలు, నైతికతలను మొత్తం సమాజం మీద రుద్దడం ద్వారా అధికార సంబంధాల్లో యథాతథ స్థితిని కొనసాగించడం. అంటే ప్రజల దైనందిన జీవితంలోని అన్ని రంగాల్లోకీ ఈ విలువలను చొప్పించడం అనేది ఒక నిరంతర కార్యక్రమంగా కలిగి ఉండడం. వాస్తవానికి మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ ఈ విషయాన్ని అంతకు క్రితమే మరో రూపంలో వివరించి ఉన్నాడు. జర్మన్ ఐడియాలజీలో ఆయన దీని గురించి ఈ విధంగా వివరించాడు:

"ప్రతి శకంలోనూ పాలక వర్గాల భావాలే పాలక భావాలుగా ఉంటాయి. అంటే సమాజంలోని పాలక భౌతిక శక్తి అయిన వర్గమే ఆ సమయంలో పాలక మేధో శక్తిగా కూడా ఉంటుంది. పాదార్థిక ఉత్పత్తి సాధనాలను కలిగి ఉన్న వర్గమే మేధో ఉత్పత్తి సాధనాలపై నియంత్రణ కూడా కలిగి ఉంటుంది. అందువల్ల ఏమవుతుందంటే మేధో ఉత్పత్తి సాధనాలు కలిగి లేని వర్గం పాలక వర్గ భావాల ఆధిపత్యం కింద ఉంటుంది. పాలక వర్గాల భావాలు అనేవి ఆధిపత్య భౌతిక సంబంధాలు మినహా మరేమీ కాదు. అంటే అవి భావాల రూపంలో స్వీకరించబడిన ఆధిపత్య భౌతిక సంబంధాలే."

ప్రజా సమూహం పాలక వర్గాల చైతన్యాన్ని పుణికి పుచ్చుకోవడం వల్ల అది సమాజమంతటి సాధారణ 'విజ్ఞత'గా మారిపోతుందని గ్రాంసీ వివరించాడు. ఆ విధంగా పాలకవర్గాల తత్వం, సంస్కృతి, నైతికవిలువలు అన్నీ కూడా సహజమైన సామాజిక లక్షణాలుగా మారిపోతాయి.

### ఆధిపత్యం(హెజిమోనీ)కీ, అణచివేత (డోమినెన్స్)కీ మధ్య తేడా

గ్రాంసీ దృష్టిలో 'ఆధిపత్యం' అనేది సమాజ

ఉపరితలం ద్వారా నియంత్రించే ఒక రూపం. మార్క్సిస్టు సిద్ధాంతం ప్రకారం సమాజంలోని పునాది ఆర్థిక విషయాలకూ, ఉపరితలం ఆ పునాదిపై ఆధారపడి ఏర్పడే సంస్థలకూ, నమ్మకాల వ్యవస్థకూ ప్రాతినిధ్యం వహిస్తాయి. మార్క్సిస్టు మహోపాధ్యాయులు చెప్పిన దాని ప్రకారం సమాజ ఉపరితలాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు. మొదటిది, న్యాయ, రాజకీయ రూపాలు. ఇవి అప్పటి ఉత్పత్తి సంబంధాలను వ్యక్తం చేస్తాయి. రెండు చైతన్య రూపాలు. ఇవి ఆయా వర్గాల ప్రాపంచిక దృష్టిని వ్యక్తం చేస్తాయి. మూడు అనేక కార్యకలాపాల ద్వారా ప్రజలు మౌలిక ఆర్థిక వైరుధ్యం పట్ల చైతన్యం పొంది, సమాజ మార్పుకు సిద్ధపడతారు.

గ్రాంసీ నమాజ ఉపరితలానికి సంబంధించి ఈ మార్క్సిస్టు సూత్రీకరణలను మరింత ముందుకు తీసుకుపోయాడు. ఉపరితలాన్ని ఆయన అణచివేత జరిపేవి, ఒప్పించేవి అనే రెండు భాగాలుగా విభజించాడు. ప్రభుత్వం, పోలీసు, సైన్యం, న్యాయవ్యవస్థ వంటి అణచివేత సంస్థలను రాజ్యం లేక 'రాజకీయ సమాజం' అని పిలిచాడు. ప్రత్యక్షంగా అణచివేతకు పాల్పడకుండా ఒప్పించడం ద్వారా పనిచేసే సంస్థలు అంటే మత సంస్థలు, పాఠశాలలు, ట్రేడ్ యూనియన్లు, రాజకీయ పార్టీలు, సాంస్కృతిక సంస్థలు, క్లబ్బులు, కుటుంబం మొదలైన వాటిని 'పౌర సమాజం' అన్నాడు. అయితే, ఆయన దృష్టిలో పాఠశాలలు కొంతవరకు రెండు కేటగిరీల్లోకీ వస్తాయి. ఉదాహరణకు పాఠశాల జీవితంలో కొంతభాగం అణచివేతతో కూడి ఉంటుంది. నిర్బంధ విద్య, జాతీయ పాఠ్యాంశాలు, జాతీయ స్టాండర్డ్స్, ఉత్తీర్ణతలు వగైరాలన్నీ ఇందులోకి వస్తాయి. మిగిలినవి అంటే అనియత విద్య, సామాజిక అధ్యయనం వంటివి ఇందులోకి రావు.

గ్రాంసీ జైలు రచనల ప్రకారం పౌర సమాజం (సివిల్ సొసైటీ) ద్వారా పాలక వర్గాల వర్గాధిపత్యం ఒప్పించబడుతుంది. రాజకీయ సమాజం లేక రాజ్యం ద్వారా ప్రత్యక్ష అణచివేత, లేక నియంత్రణ జరుగుతుంది. అంటే ఈ రెండూ రెండురకాల నియంత్రణా రూపాలన్న మాట. ఒకటి ఒప్పించేది రెండవది అణచివేసేది. ఇంకో మాటలో చెప్పాలంటే ప్రజలే పాలక వార్గాల ఆధిపత్యాన్ని అంగీకరించేట్టు ఒప్పించేది హెజిమోనీ (ఆధిపత్యం), అంగీకరించని ప్రజలను

> **“ గ్రాంసీ సమాజ ఉపరి తలాన్ని అణచివేత జరిపేవి, ఒప్పించేవి అనే రెండు భాగాలుగా విభజించాడు. ప్రభుత్వం, పోలీసు, సైన్యం, న్యాయ వ్యవస్థ వంటి అణచివేత సంస్థలను రాజ్యం లేక 'రాజకీయ సమాజం' అని పిలిచాడు. ప్రత్యక్షంగా అణచివేతకు పాల్పడకుండా ఒప్పించడం ద్వారా పనిచేసే సంస్థలు అంటే మత సంస్థలు, పాఠశాలలు, ట్రేడ్ యూనియన్లు, రాజకీయ పార్టీలు, సాంస్కృతిక సంస్థలు, క్లబ్బులు, కుటుంబం మొదలైన వాటిని 'పౌర సమాజం' అన్నాడు. ”**

బలవంతంగా అణచివేసి ఉంచేది డోమినెన్స్. రెండూ ప్రజలను పాలక వర్గాల నియంత్రణలో ఉంచేవే. కాకపోతే ఒకటి పౌర సమాజంలో ఒప్పించడం ద్వారా నియంత్రణలో ఉంచుతుంది, రెండవది నిరంకుశ సాధనాల ద్వారా అణచివేసి నియంత్రణలో ఉంచుంతుంది. వీటి గురించి గ్రాంసీ ఇంకా విడమరిచి ఇలా చెప్పాడు:

1. "సామాజిక ఆధిపత్యం" (హెజిమోనీ) అంటే మొత్తం ప్రజానీకం పాలక వర్గాల ఆధిపత్యానికి ఆమోదం తెలపడం. పాలకవర్గాలకు ఈ ఆమోదం 'చారిత్రకంగా' అవి సంపాదించిన ప్రతిష్టద్వారా లభిస్తుంది. ఉత్పత్తిలో పాలకవర్గాలు సాధించిన స్థానం, అవి నిర్వహించే విధులద్వారా ఆ ప్రతిష్ట పొందుతాయి.

2. ''రాజకీయ ప్రభుత్వం'' అంటే పాలకవర్గాల ఆధిపత్యాన్ని అంగీకరించని గ్రూపులను అణచివేతద్వారా దారిలోకి తెచ్చుకునేందుకు రాజ్యం చేతుల్లో ఉన్న నిరంకుశాధికార పనిముట్లు. ఈ పనిముట్లు మొత్తం సమాజం మీద నిరంతరం వేలాడుతూ ఉంటాయి. ఎందుకంటే సంక్షోభాలు వచ్చినప్పుడు 'సమ్మతి' విఫలమైతే వీటిని ఉపయోగిస్తారు. అంటే కోర్టులు, చట్టాలు, సైన్యం, పోలీసు, అధికార యంత్రాంగం దీనికిందకు వస్తాయి.

గ్రాంసీ ఈ రెంటినీ విడదీసి చెప్పినప్పటికీ ఈ రెండూ అంటే 'సామాజిక ఆధిపత్యం' (హెజిమోనీ), 'రాజకీయ ప్రభుత్వం' (డోమినెన్స్) రెండూ ఒకే 'సమగ్ర రాజ్యం'లో భాగమే.

**పౌర సమాజం (సివిల్ సొసైటీ)**

గ్రాంసీ ప్రతిపాదించిన విషయాల్లో పౌర సమాజం అనేది అతి ముఖ్యమైనది. మార్క్సిస్టులు పూర్తిగా అర్థం చేసుకోవలసిన అవసరం ఉన్నది. పౌర సమాజం ద్వారానే సమాజం మీద పాలక వర్గాలు తమ ఆధిపత్యాన్ని (హెజిమోనీ) చెలాయిస్తాయని గ్రాంసీ సూత్రీకరించాడు. రాజ్యం అన్నది రాజకీయ సమాజం, పౌర సమాజాల కలయిక అని ఆయన చెప్పాడు.

పౌర సమాజంతో ప్రజలను ఒప్పించడం ద్వారా, రాజకీయ సమాజం లేక రాజ్యంతో ప్రజలను అణచివేయడం ద్వారా పాలక వర్గాలు పరిపాలన సాగిస్తాయి. ఈ రెంటిలో కూడా ప్రభుత్వ నిరంకుశ యంత్రాంగం కంటే పౌర సమాజం బలమైందని గ్రాంసీ పేర్కొన్నాడు. ''రాజ్యం బీటలువారితే దాని వెనుక పౌర సమాజం అనే గట్టి నిర్మాణం బయటపడుతుంది. రాజ్యం అనేది కోట బయట కందకం మాత్రమే. దాని వెనుక అత్యంత బలమైన మట్టి కట్టలు, కోట గోడలు (పౌరసమాజం) ఉంటాయి" అని గ్రాంసీ వివరించాడు.

రష్యాలో అక్టోబర్ విప్లవం జరిగినప్పుడు అక్కడ ఫ్యూడల్ సమాజం బలంగా ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థ అంతగా ఎదగలేదు. అందువల్ల అక్కడ పౌరసమాజం బలపడలేదు. అక్టోబర్ విప్లవం రాజ్యంపై తిరుగుబాటు చేసినప్పుడు అది ప్రధానంగా ఎదుర్కొన్నది రాజకీయ ప్రభుత్వాన్ని. అంటే నిరంకుశ రాజ్య వ్యవస్థనూ, బలహీనంగా ఇంకా చెప్పాలంటే 'జిగట జిగటగా' ఉన్న పౌరసమాజాన్నీ. కానీ బూర్జువా వర్గం బలపడిన పశ్చిమ దేశాల్లో పౌర సమాజం రాజ్యాన్ని కాపాడేందుకు పటిష్టమైన కోటగోడలా మారిందని గ్రాంసీ వివరించాడు.

"పౌర సమాజం" అనేది చాలా సంక్లిష్టమైన నిర్మాణం. అది ఆర్థిక సంక్షోభాలు, మాంద్యాలు వంటి అనేక ఆర్థిక తుపానులను తట్టుకుని నిలబడగలదు. సమాజ ఉపరితలంలోని పౌర సమాజం ఆధునిక యుద్ధంలో సైనికులు దాక్కునేందుకు తవ్వకునే కందకాల (ట్రెంచ్) వ్యవస్థ వంటిది. ఒక్కోసారి యుద్ధంలో భీకరమైన బాంబు దాడులతో శత్రువుల రక్షణ వ్యవస్థలు మొత్తాన్ని తుత్తునియలు చేయవచ్చు గాక కానీ

**"గ్రాంసీ మార్క్సిస్టు మౌలిక సూత్రం నుండి వైదొలగి వర్గ పోరాటాన్ని ఆర్థిక రంగంలో కాకుండా సమాజ ఉపరితలం లోని పౌరసమాజంలోకి తీసుకువచ్చాడని కొందరు వాదిస్తు న్నారు. కానీ వాస్తవానికి మార్క్స్ ఏనాడూ వర్గ పోరాటంలో సమాజ ఉపరితలం ప్రాధాన్యతను తక్కువ చేయలేదు. అదే సమయంలో గ్రాంసీ రచనలు చదివినప్పుడు ఆయన సమాజిక పునాది అయిన ఉత్పత్తి సంబంధాలను వదిలిపెట్టి ఉపరితలమే అంతా నిర్ణయిస్తుందనీ చెప్పలేదు."**

అలా నాశనమయ్యేది బాహ్య వలయం మాత్రమే. కందకాల వ్యవస్థ మాత్రం చెక్కు చెదరదు.. అని గ్రాంసీ వివరించాడు.

పౌర సమాజం అనేది సామాజిక ప్రయోజనాలకూ, వ్యష్టి స్వప్రయోజనాలకూ మధ్యస్తం నడిపే ఏజెంట్ అని గ్రాంసీ చెప్పాడు. సరిగ్గా ఈ కారణం వల్లనే సమాజంలో ఘర్షణకు కూడా పౌర సమాజం వేదికగా ఉంటుందని చెప్పాడు. పెట్టుబడిదారీ భావాల ఉత్పత్తీ, పునరుత్పత్తీ పౌరసమాజంలోనే జరుగుతాయి. సామాజిక వర్గాల మధ్య పోటీకీ ఇది మొదటి మెట్టు. సైద్ధాంతిక ఆధిపత్యానికి (హెజిమోనీకి) ఇది మొదటి దశ. ఆ విధంగా పౌర సమాజం అనేది రాజ్యం, ఆర్థిక వ్యవస్థల మధ్య, ప్రయివేటు, సామాజిక రంగాల మధ్య సంబంధాలను పునర్నిర్వచించే వేదిక అని గ్రాంసీ పేర్కొన్నాడు. ఇదంతా కూడా ఆధిపత్యం (హెజిమోనీ) రూపంలో వ్యక్తమయ్యే సైద్ధాంతిక పోటీగా సాగుతుంది.

ఈ విషయంలో గ్రాంసీ మార్క్సిస్టు మౌలిక సూత్రం నుండి వైదొలగి వర్గ పోరాటాన్ని ఆర్థిక రంగంలో కాకుండా సమాజ ఉపరితలం లోని పౌరసమాజంలోకి తీసుకువచ్చాడని కొందరు వాదిస్తున్నారు. కానీ వాస్తవానికి మార్క్స్ ఏనాడూ వర్గ పోరాటంలో సమాజ ఉపరితలం ప్రాధాన్యతను తక్కువ చేయలేదు. అదే సమయంలో గ్రాంసీ రచనలు చదివినప్పుడు ఆయన సమాజిక పునాది అయిన ఉత్పత్తి సంబంధాలను వదిలిపెట్టి ఉపరితలమే అంతా నిర్ణయిస్తుందనీ చెప్పలేదు. మరి గ్రాంసీని మార్క్సిజానికి అభిముఖంగా నిలబెట్టే ఈ చర్చ ఎందుకు వచ్చింది?

**పునాది-ఉపరితలం చర్చ**

మార్క్సిస్టు సూత్రీకరణ ప్రకారం ఏ సమాజ నిర్మాణంలోనైనా రెండు భాగా లుంటాయి. ఒకటి పునాది. రెండవది ఉపరి తలం. ఒకానొక సమాజంలోని ఉత్పత్తి శక్తులూ, ఉత్పత్తి జరిగేటప్పుడు వాటి మధ్య ఏర్పడే సంబంధాలు అంటే ఆర్థిక సంబంధాలు సమాజపు పునాదిగా ఉంటాయి. ఈ పునాదిపై ఆధారపడిన ఉపరితలంలో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలు, భావజాలం అంటే రాజ్యాంగ యంత్రం, మతం, సంప్రదాయాలు, సంస్కృతి, కళలు వగైరాలు ఉంటాయి. పునాదికీ, ఉపరితలానికీ మధ్య గతితార్కిక సంబంధం ఉంటుందనీ, వర్గ పోరాటం పునాదిలో తెచ్చే మార్పులు అంతిమంగా ఆ సమాజ గమనానికి కారణమవుతాయని మార్క్-ఏంగెల్స్ చెప్పారు. కారల్ మార్క్స్ రాజకీయ ఆర్థికవ్యవస్థపై విమర్శ అన్న గ్రంథానికి ముందుమాట రాస్తూ... భౌతిక జీవనపు ఉత్పత్తి విధానం సామాజిక, రాజకీయం, మేధోపరమైన అంశాలను సాధారణంగా నియంత్రిస్తుంది. మానవుల చైతన్యం వారి భౌతిక స్థితిని నిర్ణయించదు, దానికి భిన్నంగా వారి సామాజిక జీవనమే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది అని చెప్పాడు. అంతే కాకుండా మనుషుల ఆలోచనలు వారి చైతన్యాన్ని బట్టి ఏర్పడవు, అందువల్ల ఆలోచనల్లో మార్పులు కూడా వారి చైతన్యాన్ని బట్టి జరగవు. వారి ఆలోచనల్లో మార్పులకు కారణం వారు జీవించే భౌతిక జీవనంలోని సంఘర్షణలే అంటే సామాజిక ఉత్పత్తి శక్తులకూ, ఉత్పత్తి సంబంధాలకూ మధ్య ఘర్షణే అని చెప్పాడు.

అయితే, దీన్ని కొందరు మార్క్సిస్టులు యాంత్రికంగా తీసుకుని సమాజ పురోగ మనంలో పునాదే, అంటే ఆర్థిక సంబంధాలే ప్రధానం, ఉపరితలంలోని అంశాలన్నీ దానిపై ఆధారపడి నడుస్తాయని చెప్పడం ప్రారంభిం చారు. అంటే పునాదిలో మార్పులు జరిగితే ఉపరితలంలోని రాజకీయ, సామాజిక, సాంస్కృతిక విషయాలు వాటంతటవే మారు తాయని భావించారు. అంటే సామాజిక మార్పును వారు 'ఆర్థికవాదం' కిందకు కుదించేశారు. ఉదాహరణకు రెండవ ఇంటర్నేషనల్‌లో కాట్స్కీ, బెర్న్‌స్టీన్ వంటి వారు ఆర్థిక రంగంలో మార్పులు వాటంతటవే రాజకీయాల్లో మార్పులు తెస్తాయి వాటి కోసం వేచి చూడ్డమే మన పని అనే స్థితికి వెళ్లిపోయారు. ఇది ఒక రకంగా ఆర్థిక సంక్షోభం కోసం వేచి చూసేధోరణి.

గ్రాంసీ ఈ ఆర్థిక వాదాన్ని తీవ్రంగా విమర్శించాడు. నిజానికి మార్క్స్-ఏంగెల్స్ గానీ తరువాతి కాలంలో లెనిన్ గానీ ఇటువంటి ఆర్థికవాదాన్ని (ఎకనామిజం) లేక నియతివాదాన్ని (డిటర్మినిజం) ఖండించారు. వాస్తవానికి ఆర్థికవాదం అనే పదాన్ని మొట్టమొదట లెనిన్ ఉపయోగించాడు. సోషల్ డెమోక్రాటిక్ ఉద్యమంలో మార్క్సిజాన్ని అసభ్యకరమైన స్థాయికి దిగజార్చే ఒక వైఖరే ఆర్థికవాదం అని ఆయన చెప్పాడు. ఇది సామాజిక జీవనంలోని చైతన్యానికి సంబంధించిన అంశాన్ని దిగజార్చేస్తుందని చెప్పాడు. లెనిన్ తను రాసిన 'ఏం చేయాలి?' గ్రంథంలో ఆర్థికవాదానికి వ్యతిరేకంగా వాదించాడు. కార్మికవర్గానికి బయటినుండి సోషలిస్టు చైతన్యాన్ని అందించడం కమ్యూనిస్టుల కర్తవ్యమని చెబుతూ ఆ కర్తవ్యాన్ని చైతన్యపూర్వకంగా నిర్వహించకుండా ప్రత్యక్ష కార్యాచరణల వెంటబడి కొట్టుకుపోవడాన్ని ఆయన విమర్శించాడు. అయితే ఆర్థికవాదం ప్రత్యక్ష కార్యాచరణకు సంబంధించిన అంశమే కాకుండా దానికి సైద్ధాంతిక ప్రాముఖ్యత ఉందని గ్రాంసీ వివరించాడు. ఆర్థికవాదాన్ని పుణికిపుచ్చుకున్న వారు సామాజిక పరివర్తన గురించి చెప్పేటప్పుడు కేవలం ఆర్థిక పునాది మీద కేంద్రీకరిస్తారు. సామాజిక మార్పుకు దోహదం చేసే ఇతర అంశాలు అంటే ఉపరితలంలో ఉండే సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అంశాలను విస్మరిస్తారు అని గ్రాంసీ పేర్కొన్నాడు. నిజానికి మార్క్స్ ఏంగెల్స్ కూడా ఉపరితలంలోని చైతన్యానికి సంబంధించిన అంశాల ప్రాధాన్యతను ఏనాడూ తక్కువ అంచనా వేయలేదు. మార్క్స్ మరణించిన తరువాత ఏంగెల్స్ 1890 సెప్టెంబర్‌లో జె. బ్లాక్‌కు రాసిన లేఖలో ఇలా పేర్కొన్నాడు:

...భౌతికవాద పద్ధతిలో చరిత్రను పరిశీలించినప్పుడు చరిత్రలో చివరి నిర్ణయాత్మక అంశం వాస్తవ జీవితపు ఉత్పత్తీ, పునరుత్పత్తీ అవుతుంది. దీనికి మించి మార్క్స్‌గానీ, నేను గానీ ఇంకేమీ చెప్పలేదు. అందువల్ల, ఎవరైనా

దీన్ని వక్రీకరించి ఆర్థికాంశం ఒక్కటే నిర్ణయాత్మకమైనది అని అంటే వారు మేము చెప్పిన దాన్ని అర్థం లేని, రూపంలేని, బుద్ధిహీనమైన మాటకింద మార్చేస్తున్నట్లే. ఆర్థిక పరిస్థితే పునాది. కానీ, ఉపరితలంలోని అనేక అంశాలు అంటే వర్గపోరాటాల, వాటి ఫలితంగా ఏర్పడే రాజకీయ రూపాలు – ఉదాహరణకు, గెలుపొందిన వర్గం రూపొందించే రాజ్యాంగం వగైరా, న్యాయపరమైన రూపాలు, చివరికి ఈ ప్రత్యక్ష పోరాటాలు అందులో పాల్గొన్న వారి మెదళ్లలో ప్రేరేపించే ఉద్దీపనలు, రాజకీయ, న్యాయ, తాత్విక సిద్ధాంతాలు, మతభావనలూ అవి మూఢనమ్మకాలుగా మారిపోయిన తీరు... ఇవన్నీ కూడా చారిత్రక పోరాటాల మీద ప్రభావం చూపిస్తాయి. అనేక సందర్భాల్లో పోరాట రూపాలను నిర్ణయించడంలో ఇవే ప్రధాన పాత్ర నిర్వహిస్తాయి..."

" ఆధునిక కాలంలో పౌర సమాజం వర్గ పోరాటానికి వేదికగా మారిందని, ఇంకో మాటలో చెప్పాలంటే వర్గ ప్రయోజనాలు కాపాడే సాధనంగా మారిందని గ్రాంసీ వాదిస్తాడు. పెట్టుబడిదారీ వర్గపు సైద్ధాంతిక ఆధిపత్యాన్ని రక్షించేది పౌర సమాజం. పౌర సమాజంపై సైద్ధాంతిక ఆధిపత్యం సాధించే సారవంతమైన నేల రాజకీయ పోరాటాలేనని గ్రాంసీ చెప్పాడు. "

అందువల్ల మార్క్స్-ఏంగెల్స్‌గానీ, లెనిన్ గానీ సామాజిక ఉపరితలంలోని రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాల ప్రాధాన్యతను తక్కువ చేయలేదు. అయితే పశ్చిమదేశాల్లో స్థిరపడిపోయిన పెట్టుబడిదారీ వ్యవస్థ తన వర్గాధిపత్యాన్ని మొత్తం సమాజం మీద చెలాయించడానికి ఈ ఉపరితలాంశాలను ఎలా ఉపయోగించు కుంటున్నదో లెనిన్ తరువాతి నాయకత్వం గ్రహించలేకపోయింది. కానీ దీని గురించి గ్రాంసీ ప్రతిభావంతంగా వివరించాడు. ఈ సమాజంలో కార్మికవర్గ విప్లవాలు సాధించాలన్నా, తదనంతరం కార్మికవర్గ రాజ్యం కొనసాగించాలన్నా కూడా ఉపరితలంలోని అంశాలపైన కేంద్రీకరించాలని పేర్కొన్నాడు. ఇందులో భాగంగా ఆయన 'ఆధిపత్యం' (హెజిమోనీ), పౌర సమాజం (సివిల్ సొసైటీ), రాజకీయ సమాజం (పొలిటికల్ సొసైటీ) వంటి భావనలను విస్తృతపరిచాడు.

ఆధునిక కాలంలో పౌర సమాజం వర్గ పోరాటానికి వేదికగా మారిందని, ఇంకో మాటలో చెప్పాలంటే వర్గ ప్రయోజనాలు కాపాడే సాధనంగా మారిందని గ్రాంసీ వాదిస్తాడు. పెట్టుబడిదారీ వర్గపు సైద్ధాంతిక ఆధిపత్యాన్ని రక్షించేది పౌర సమాజం. పౌర సమాజంపై సైద్ధాంతిక ఆధిపత్యం సాధించే సారవంతమైన నేల రాజకీయ పోరాటాలేనని గ్రాంసీ చెప్పాడు. అందువల్ల పౌర సమాజం అనే క్షేత్రంలో జరిపే ఈ పోరాటాల ద్వారానే తొలుత భావజాల రంగంలోనూ, తదుపరి రాజకీయ రంగంలోనూ ఆధిపత్యం (హెజిమోనీ) సాధించడం జరుగుతుందని తెలిపాడు. ఒకసారి భావ జాల రంగంలో ఆధిపత్యం (హెజిమోనీ) కార్మికవర్గం చేతిలోకి వచ్చేసిందంటే అప్పుడిక పౌర సమాజపు అవసరం, అంటే ఆర్థిక వ్యవస్థకూ, రాజకీయ వ్యవస్థకూ మధ్య సంస్థాగతంగా జోక్యం చేసుకోవలసిన అవసరం ఉండదని గ్రాంసీ వివరించాడు. అంటే వ్యక్తుల ప్రయోజనాలకూ, సామాజిక ప్రయోజనాలకూ మధ్యవర్తిత్వం నడిపేది పౌర సమాజం. సోషలిస్టు సమాజంలో అటువంటి మధ్యవర్తిత్వం నడపాల్సిన అవసరం ఉండదు కనుక పౌర సమాజపు అవసరం ఉండదని వివరించాడు.



ఆంటోనియో గ్రాంసీ

పెట్టుబడిదారీ రాజ్యాన్ని ఓడించాలంటే పౌర సమాజంలో ఆ వర్గం తరపున పనిచేసే సంస్థలను గెలుచుకోవాలంటాడు గ్రాంసీ. విలువల్లోనూ, సంస్కృతిలోనూ కొత్త మార్పులు తీసుకురావాలి. ఈ పనిలో కార్మిక వర్గానికి చెందిన కొత్త మేధావులు కీలక పాత్ర నిర్వహిస్తారని చెప్పాడు. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య పౌర సమాజంలో రాజ్యానికీ, కార్మికులకూ మధ్య జరిగిన మధ్యస్థాల వల్ల పాలక పెట్టుబడిదారీ వర్గాల ఆధిపత్యాన్ని కార్మికులు ఆమోదించే విధంగా రాజకీయాలు మలచబడ్డాయని గ్రాంసీ వివరించాడు. మత సంస్థలు, యూనియన్లు, పౌర సమాజంలోని ఇతర సంస్థలు రకరకాల లక్ష్యాలతో పనిచేసేవన్నీ కూడా పెట్టుబడిదారీ వర్గ సైద్ధాంతిక ఆధిపత్యానికి కార్మికుల నుండి సమ్మతిని పదేపదే ఉత్పత్తి చేశాయని చెప్పాడు. పెట్టుబడిదారీ వర్గపు "మేధో పరమైన, నైతిక పరమైన ఆధిపత్యం" అనేది పౌర సమాజంలోని వివిధ సంస్థలు వ్యక్తీకరించే సమ్మతి ద్వారా వెల్లడవుతుందని గ్రాంసీ వివరించాడు. అందువల్ల మార్పు కోసం జరిగే వర్గ పోరాటం ఆర్థిక రంగంతో పాటు సైద్ధాంతిక ఆధిపత్యం కోసం, ఇంకో మాటలో చెప్పాలంటే చైతన్యాన్ని ప్రభావితం చేసే పోరాటంలో కేంద్రీకృతమవుతుందని చెప్పాడు. లెనినిస్టు సూత్రం ప్రకారం ఉత్పత్తికి సంబంధించిన భౌతిక పరిస్థితులు పెట్టుబడిదారీ వర్గపు సైద్ధాంతిక ఆధిపత్యాన్ని ఉత్పత్తి చేస్తాయి. అయితే ఈ ఆధిపత్యం (హెజిమోనీ) పౌర సమాజంలోని సంస్థల ద్వారా చెలాయించబడుతుంది. అందువల్లనే పౌర సమాజం రాజ్యంతో సంబంధం లేకుండా స్వతంత్రంగా ఉన్నట్లు కనిపిస్తుంది గానీ వాస్తవంగా రాజ్యంలో ఇది ఒక అంతర్భాగమేనని ఆయన వివరించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందిన దేశాల్లో పాఠశాలలు, విశ్వ విద్యాలయాలు, మత సంస్థలు వగైరాలు.. పెట్టుబడిదారీ వర్గపు ఆధిపత్య విలువలను ఉత్పత్తి చేసి పెట్టుబడిదారీ రాజ్యాన్ని రక్షించడం కోసం "బలమైన కోటలు, కందకాల వ్యవస్థగా" రూపొందాయని గ్రాంసీ చెప్పాడు.

రెండు ప్రపంచ యుద్ధాల కాలంలో పార్లమెంటరీయిజం, దానికి సంబంధించిన పార్టీలు, యూనియన్ల వ్యవస్థలు విస్తృతమైనాక,

> **"రష్యాలో "రాజ్యమే అన్నీ అయింది. పౌర సమాజం శైశవ దశలో, పలుచటి బంకలా ఉంది. పశ్చిమ దేశాల్లో రాజ్యానికీ, పౌర సమాజానికీ మధ్య సరైన సంబంధాలున్నాయి. అక్కడ రాజ్యం కుప్పకూలిపోతే వెనువెంటనే పటిష్టమైన పౌర సమాజం అనే బలమైన నిర్మాణం బయట పడుతుంది" అని గ్రాంసీ వివరించాడు."**

విస్తారమైన రాజ్య, 'ప్రయివేటు' అధికార యంత్రాంగం వేళ్లూనుకున్న తరువాత, ఆర్థిక, ఆర్థికేతర 'రాజకీయ' పార్టీలు, ఇతర సంస్థలు నాటి రాజకీయ వ్యవస్థల్లో భాగాలుగా మారాయి. ఆ విధంగా అవి మార్పుకు అడ్డంకిగా మారాయి అని గ్రాంసీ వివరించాడు.

రాజ్యం, పౌర సమాజాల మధ్యనున్న సంబంధం, ఈ రెంటికీ బూర్జువా వర్గపు అధిపత్య సిద్ధాంతంతో ఉన్న సంబంధం దాంతోపాటు ఒప్పించే యంత్రాంగం ద్వారా అంటే పాలితుల సమ్మతిని సాధించే పద్ధతి ద్వారా ఈ ఆధిపత్య సిద్ధాంతాన్ని పునరుత్పత్తి చేయడం అనేది గ్రాంసీ సూత్రీకరణల్లోని ప్రధానమైన అంశం. పౌర సమాజంలోని ఏ సంస్థ కూడా, దాని లక్ష్యం ఏదైనా కానీయండి అది నిరంతరాయంగా పెట్టుబడిదారీ సిద్ధాంతాన్ని పునరుత్పత్తి చేసే లక్షణం కలిగి ఉంటుంది.

గ్రాంసీ సూత్రీకరణ ప్రకారం పౌర సమాజమూ, దాని సంస్థలూ పెట్టుబడిదారీ వర్గంతోనూ, దాని సైద్ధాంతిక ఆధిపత్యం కిందనూ ఉన్నంత కాలం విప్లవోద్యమాన్ని అడ్డుకుంటూనే ఉంటాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ తనలోని అంతర్గత వైరుధ్యాల వల్ల కుప్పకూలిపోవడం కోసం వేచి ఉండడం విప్లవ చర్య కాజాలదు. అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాల పెట్టుబడారీ వ్యవస్థలు అంతర్గత వైరుధ్యాలతో కుప్పకూలిపోతే వాటిపై నియంత్రణ సాధించడం సాధ్యం కాదు. రష్యాలో "రాజ్యమే అన్నీ అయింది. పౌర సమాజం శైశవ దశలో, పలుచటి బంకలా ఉంది. పశ్చిమ దేశాల్లో రాజ్యానికీ, పౌర సమాజానికీ మధ్య సరైన సంబంధాలున్నాయి. అక్కడ రాజ్యం కుప్పకూలిపోతే వెనువెంటనే పటిష్టమైన పౌర సమాజం అనే బలమైన నిర్మాణం బయట పడుతుంది" అని గ్రాంసీ వివరించాడు. అందువల్లనే "అక్కడ ప్రజా సమూహాలను ఎడ్యుకేట్ చేసి, వారి సమిష్టి చైతన్యాన్ని సమీకరించాలి. వారిలోకి కొత్త విలువలను ఎక్కించి రాన్ను విప్లవం కోసం సిద్ధం చేయాలి. ఇటువంటి చర్య ద్వారా మాత్రమే వారిని కార్యాచరణలోకి దించగలం" అని ఆయన చెప్పాడు.

ఈ వివరణ ద్వారా గ్రాంసీ ఒక విషయం స్పష్టం చేశాడు: ప్రత్యామ్నాయ పౌర సమాజాన్ని సృష్టించడం ద్వారా ప్రత్యామ్నాయ రాజ్యాన్ని సృష్టించాలన్నాడు. కార్మికవర్గ విలువలు, లక్ష్యాలను పుణికిపుచ్చుకున్న విప్లవ యంత్రాంగం ద్వారా ఈ పనిచేయాలని ఆయన చెప్పాడు. ఈ విప్లవ యంత్రాంగం కార్మిక వర్గ విలువలనూ, సైద్ధాంతిక ఆధిపత్యాన్నీ మళ్లీమళ్లీ ఉత్పత్తి చేయగలగాలని చెప్పాడు. దీనికోసం కార్మికవర్గాన్ని అంతర్గతంగా ఎడ్యుకేట్ చేయడం, పెట్టుబడిదారీ పౌర సమాజానికి ప్రత్నామ్నాయ సంఘాలను సృష్టించడం జరగాలన్నాడు. మానవాళి దశల వారీగా తన స్వంత విలువలతో కూడిన చైతన్యాన్ని సంతరించుకుంటుంది. ఈ చైతన్యం మొదట కొద్ది మంది వ్యక్తుల్లో ఏర్పడుతుంది. తదుపరి మొత్తం వర్గం దాన్ని పుణికిపుచ్చుకుంటుంది. దాంతో అప్పటివరకు అణచివేయబడి ఉన్న వర్గం తిరుగుబాటుకు, సామాజిక పునర్నిర్మాణానికి పూనుకుంటుందని చెప్పాడు.

ఆ విధంగా గ్రాంసీ పశ్చిమ యూరప్‌లోని పెట్టుబడిదారీ దేశాల్లో అధికార వ్యవస్థలు ఎలా ఉంటాయో చెప్పడమే కాదు, ఆ దేశాల్లో కమ్యూనిస్టు విప్లవాలు జయప్రదం కావాలంటే ఏం చేయాలో కూడా చెప్పాడు. పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోసి కార్మికవర్గ రాజ్యాన్ని నెలకొల్పాలంటే ఆర్థిక సంక్షోభాలు వస్తేనే సరిపోదని ఆయన వాదించాడు. ఆర్థిక సంక్షోభాలు మాత్రమే పీడిత వర్గాలను పోరాటాలవైపు నెట్టవు, వారిలో బలమైన పోరాటేచ్ఛను పెంపొందించవు. లేక అవి మాత్రమే బూర్జువా వర్గపు ధైర్యాన్ని సడలించలేవు, చివరికి శిధిలాల్లో ఉన్నా కూడా పెట్టుబడిదారీ వర్గాన్ని యుద్ధ రంగం నుండి తరిమివేయలేవని గ్రాంసీ స్పష్టం చేశాడు. సాయుధ దాడుల ద్వారా మాత్రమే కార్మికవర్గం బూర్జువా వర్గాన్ని కూలదోయలేదని వాదించాడు. "కేవలం సైనిక నమూనాను నమ్ముకుని కూర్చోవడం వెర్రితనం. ఇక్కడ కూడా సైనిక చర్యల మీద రాజకీయాలే ప్రాధాన్యత వహిస్తాయి. రాజకీయాలు మాత్రమే వ్యూహాత్మకంగా వ్యవహరించడానికీ, ముందుకు కదలడానికీ అవకాశాలు కల్పిస్తాయి" అని చెప్పాడు. గ్రాంసీ దృష్టిలో రాజకీయ పోరాటాలు అంటే వర్గాధిపత్యం కోసం జరిగే పోరాటమే. రాజ్యాధికారాన్ని చేపట్టి రాజ్యాన్ని ఎడ్యుకేటర్‌గా మార్చేందుకు జరిగే వర్గ పోరాటమే 'ఆధిపత్యం' (హెజిమోనీ) కోసం జరిగే పోరాటం అని ఆయన చెప్పాడు.

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత తలెత్తిన అత్యంత తీవ్రమైన సంక్షోభ పరిస్థితుల్లో కూడా పశ్చిమ ఐరోపా దేశాల్లో కార్మిక వర్గం మొత్తంగా విప్లవ చైతన్యం పెంపొందించడంలో ఎందుకు విఫలమయ్యింది? పాలనా వ్యవస్థను కూల్చడానికి బదులుగా దానికి అనుగుణంగా ఆలోచించే సంస్కరణ వాదంలో ఎందుకు పడిపోయింది? ఈ ప్రశ్నలకు లెనిన్ 'ఏం చేయాలి' గ్రంథంలో కొంతవరకు వివరణ ఇచ్చాడు. బూర్జువా సిద్ధాంత బలం ఎంతగా ఉంటుందంటే కార్మిక వర్గాన్ని గనుక దాని మట్టుకు దాన్ని వదిలేస్తే దానికి అబ్బేది ట్రేడ్ యూనియన్ చైతన్యం మాత్రమే, అంటే పెట్టుబడిదారీ వ్యవస్థలోనే తమ జీవన పరిస్థితులను మెరుగుపరుచు కోవాలన్న కాంక్ష మాత్రమే అని లెనిన్ పేర్కొన్నాడు.

ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంలో గ్రాంసీ విశ్లేషణ మార్క్సిజానికి మరింతగా తోడ్పడుతుంది. పాలకవర్గాలు ఎలా పాలిస్తున్నాయో, పాలించాలో వివరించడానికి ఇతరుల కన్నా గ్రాంసీ విశ్లేషణ బాగా ఉపయోగపడుతుంది. 'ఆధునిక యువరాజు', 'అమెరికనిజం-ఫోర్డిజం' అన్న వ్యాసాల్లో ఆయన ఈ అంశాలపై మరింత విశ్లేషణ చేశాడు.

### ప్రతి-ఆధిపత్యం (కౌంటర్-హెజిమోనీ)

గ్రాంసీ చెప్పిందే నిజమైతే అంటే పాలక వర్గాలు ప్రజల సమ్మతితోనే తమ వర్గాధిపత్యాన్ని కొనసాగించగలుగుతుంటే, కేవలం చివరి అస్త్రంగా మాత్రమే వారు ప్రత్యక్ష

అణచివేత యంత్రాంగాన్ని ఉపయోగిస్తుంటే అప్పుడు పాలక వర్గాలను అధికారం నుండి తొలగించాలనుకుంటున్న విప్లవ వర్గాలు ఏం చేయాలి? పాలకులకూ, పాలితులకూ మధ్య ఏర్పడిన సైద్ధాంతిక బంధం ద్వారా పాలక పెట్టుబడిదారీ వర్గాలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించగలుగుతుంటే విప్లవ వర్గాల వ్యూహం ఎలా ఉండాలి? దానికి గ్రాంసీ ఇలా సమాధానం చెప్పాడు: పాలక వర్గాల సైద్ధాంతిక 'ఆధిపత్యం' (హెజిమోనీ)ని ఛేదించాలనుకునే వారు పాలకవర్గాలకు వ్యతిరేకంగా ''ప్రతి-ఆధిపత్యం'' (కౌంటర్-హెజిమోనీ) నిర్మించాలి. అంటే వారు సమాజ నిర్మాణంలో మార్పునూ, సైద్ధాంతిక మార్పునూ ఒకే పోరాటంలో భాగంగా చూడాలి. వర్గ పోరాటంలో పెట్టుబడికీ, కార్మికవర్గానికీ ఘర్షణ కేంద్రంగా ఉంటుంది. కానీ, పీడించబడుతున్న వర్గాలు తమను పరిపాలించేందుకు తమ రాజకీయ, ఆర్థిక యజమానులకు ఉన్న హక్కును ప్రశ్నించాలంటే, అలా ప్రశ్నించే చైతన్యం వారికి కలగాలి. అటువంటి చైతన్యం వారిలో సైద్ధాంతిక పోరాటం ద్వారా మాత్రమే వస్తుంది. దానికోసం పౌర సమాజంలో విజ్ఞత (కామన్ సెన్స్) రూపంలో స్థిరపడిపోయిన ప్రజా చైతన్యాన్ని సవాలు చేయాలి.

అయితే, ప్రజల్లో స్థిరపడిపోయిన చైతన్యాన్ని అధిగమించడం అంత తేలికైన పని కాదు. ఎందుకంటే పాలక వర్గాల సైద్ధాంతిక ఆధిపత్యం వల్ల సమాజంలో జరుగుతున్న దాన్ని 'విజ్ఞతగా' మెజారిటీ ప్రజలు అంగీకరిస్తారు. 'సమాజాన్ని నడపడానికి అదొక్కటే మార్గం' అనుకుంటారు. జరుగుతున్న పరిణామాల పట్ల ఫిర్యాదులు, అసంతృప్తులు ఉండవచ్చు. ప్రజలు మరింతమెరుగైన పాలన, సంస్కరణలు కావాలని కోరుకోవచ్చు. కానీ, సమాజంలోని మౌలికమైన నమ్మకాలు, విలువలు తటస్థంగా ఉన్నాయనీ, లేక వర్గ సమాజం అంతటికీ అవి సాధారణంగా వర్తిస్తాయనీ వారు భావిస్తారు. వాళ్లు రొట్టెల ఫ్యాక్టరీ నాది అనుకోరు. ఒకటో రెండో రొట్టె ముక్కలు అదనంగా లభిస్తే చాలు అనుకుంటారు. ఇలా సామాజిక విజ్ఞత (కామన్‌సెన్స్) రూపంలో చెలామణీ అయ్యే ఈ 'ఆధిపత్య' భావజాలాన్ని 'ప్రతి-ఆధిపత్య' భావజాలంతో సవాలు చేయాలి. 'ప్రతి-ఆధిపత్యం' అనేది నిజమైన 'ఆధిపత్యం' కాదు. కార్మికవర్గం లేక విప్లవ వర్గాలు తమ 'ఆధిపత్యాన్ని' (హెజిమోనీని) నెలకొల్పడానికి ఆర్థికంగా, రాజకీయంగా, సైద్ధాంతికంగా సిద్ధం కావడమే ''ప్రతి-ఆధిపత్యం''.

> **“'ప్రతి-ఆధిపత్యాన్ని' నిర్మించడంలో మేధావుల పాత్రకు గ్రాంసీ అధిక ప్రాధాన్యత ఇచ్చాడు. కార్మికవర్గ విప్లవ పోరాటానికీ, పురోగామి మేధావులకూ ఉండాల్సిన సంబంధాలను గురించి ఆయన విపులంగా చర్చించాడు. పురోగామి మేధావులను ఆయన రెండుగా విభజించాడు. మొదటి రకం, ఇతర వర్గాల నుండి వచ్చే ప్రజాతంత్ర మేధావులు. రెండు, కార్మికవర్గ పోరాటం నుండి పుట్టుకు వచ్చిన మేధావులు.”**

### ప్రతి-ఆధిపత్య నిర్మాణంలో మేధావుల పాత్ర

''ప్రతి-ఆధిపత్యాన్ని' నిర్మించడంలో మేధావుల పాత్రకు గ్రాంసీ అధిక ప్రాధాన్యత ఇచ్చాడు. కార్మికవర్గ విప్లవ పోరాటానికీ, పురోగామి మేధావులకూ ఉండాల్సిన సంబంధాలను గురించి ఆయన విపులంగా చర్చించాడు. పురోగామి మేధావులను ఆయన రెండుగా విభజించాడు. మొదటి రకం, ఇతర వర్గాల నుండి వచ్చే ప్రజాతంత్ర మేధావులు. రెండు, కార్మికవర్గ పోరాటం నుండి పుట్టుకు వచ్చిన మేధావులు. ఈ రెండు రకాలూ కలిసి విప్లవ కార్మికవర్గ ఉద్యమం అవుతారు. బూర్జువా వర్గాన్ని అధికారం నుండి తొలగించే చారిత్రక కర్తవ్యాన్ని కార్మికవర్గం నెరవేర్చాలంటే వారు మూడు రంగాల్లో అంటే ఆర్థిక, రాజకీయ, సైద్ధాంతిక రంగాల్లో సమగ్ర పోరాటం చేయాలి. ఈ మూడు రంగాల్లో సమగ్రంగా జరిగే పోరాటమే వర్గ పోరాటం. ఏదో ఒక రంగంలో మాత్రమే చేసే పోరాటం పాక్షిక పోరాటం అవుతుంది గానీ సమగ్ర పోరాటం కాదు. ఇలా సమగ్ర పోరాటం చేయకుండా కార్మికవర్గం విప్లవం ద్వారా బూర్జువా వర్గాన్ని అధికారం నుండి తొలగించడం సాధ్యం కాదని ఏంగెల్స్ చెప్పిన మాటలను లెనిన్ ప్రస్తావించాడు.

మేధావులు ఒక ప్రత్యేక వర్గం కాదని గ్రాంసీ చాలా స్పష్టంగా చెప్పాడు. వాళ్లు అటు పాలక వర్గంలో గానీ కార్మికవర్గ నాయకత్వంలోని శ్రామిక వర్గంలో గానీ అంతర్భాగంగా ఉంటారు. ఈ రెండు వర్గాల్లో అంటే అటు పాలక వర్గంలో ఇటు పాలిత వర్గంలో ఉండే మేధావుల మధ్య ఐక్యత-పోరాటం నిరంతరం సాగుతుంటుంది. ఈ ఐక్యతా-పోరాటమే ప్రజాస్వామ్యం, సోషలిజం కోసం జరిగే పోరాటంలో మేధావుల పాత్రను నిర్ణయిస్తుంది. కార్మికవర్గం 'ప్రతి-ఆధిపత్యాన్ని' నిర్మించే పనిని కార్మికవర్గ ''సజీవ మేధావుల'' ద్వారా సాగించాలని గ్రాంసీ చెప్పాడు. సజీవ మేధావులు ఎవరంటే ఆధిపత్య వర్గాల తరపున కింది వర్గాలపై సామాజిక ఆధిపత్యం, రాజకీయ పరిపాలన నిర్వహించే వారు. పాలకవర్గాల తరపున ఇతరులను సమీకరించడం, పరిపాలనసాగించడం, మార్గదర్శకత్వం వహించడం, ఎడ్యుకేట్ చేయడం, నాయకత్వం వహించడం వీరి పని.

'ప్రతి-ఆధిపత్యాన్ని' నిర్మించే కార్మికవర్గం కూడా ఆ పని కోసం తన స్వంత 'సజీవ మేధావులను' తయారు చేసుకోవాలని గ్రాంసీ చెప్పాడు. ఇక్కడ మేధావులు అంటే గ్రాంసీ ఉద్దేశంలో నాలుగు గోడల మధ్య పుస్తకాలతో కుస్తీపట్లు పడుతుండే అకాడమిక్ మేధావులు కాదు. ''ప్రజలందరూ మేధావులే'' అని ఆయన రాశాడు. ''అయితే సమాజంలో అందరూ మేధావుల పని చేయరు''. అంటే ప్రతి ఒక్కరికీ మేధస్సు ఉంటుంది, దాన్ని ఉపయోగిస్తారు గాని అందరూ సామాజిక పని విభజనలో మేధావుల పని చేయరు. ఉదాహరణకు, ఒక వ్యక్తి వంకాయ కూర వండుతాడు, ఇంకొకడు చొక్కాకు బత్తాయిలు కుడతాడు. అంతమాత్రాన వాళ్లను వంట వాడనీ, దర్జీ అనీ అనలేం. ఈ పనులను ప్రత్యేకంగా చేసేవారినే అలా పేర్కొంటాం. మేధావుల విషయం కూడా అంతే అని గ్రాంసీ వివరించాడు. అభివృద్ధి చెందే ప్రతి సామాజిక వర్గం తనతో పాటుగా తన మేధోపరమైన పనులు నిర్వహించే మేధావులను కూడా తయారు చేసుకుంటుంది. వాళ్లు మేనేజర్లుగానో, సివిల్ సర్వంట్లుగానో, పురోహితులుగానో, ఉపాధ్యాయులుగానో, టెక్నీషియన్లు, లాయర్లు, సైంటిస్టులు, డాక్టర్లు వగైరాలుగా పనిచేస్తారు. వాళ్లు పాలక వర్గంతో పాటు కలిసి అభివృద్ధి చెందిన పాలక వర్గాల ప్రయోజనాల కోసం పనిచేస్తారు. అందువల్ల మేధావులు సమాజంలో

**"పౌర సమాజం ద్వారా పాలక వర్గాల ఆధిపత్యాన్ని పాలితుల చేత ఒప్పించే పని నిర్వహించేది ప్రధానంగా మేధావులు. గ్రాంసీ రెండు రకాల మేధావులున్నారని చెప్పాడు. ఒకటి, సంప్రదాయ (ట్రెడిషనల్) మేధావులు, రెండు సజీవ (ఆర్గానిక్) మేధావులు. పాలకవర్గాలతో తమకు నిమిత్తం లేదని అనుకుంటూ, ప్రజలచేత కూడా అలా భావించబడేవారు సంప్రదాయ మేధావులు. సజీవ మేధావులు రెండో రకం. వీళ్లు ఆధిపత్య వర్గంతోబాటుగానే పుట్టి పెరుగుతారు."**

వర్గాలకు అతీతంగా తటస్థంగా ఉంటారనడం మిథ్య అని గ్రాంసీ స్పష్టం చేశాడు.

పౌర సమాజం ద్వారా పాలక వర్గాల ఆధిపత్యాన్ని పాలితుల చేత ఒప్పించే పని నిర్వహించేది ప్రధానంగా మేధావులు. గ్రాంసీ రెండు రకాల మేధావులున్నారని చెప్పాడు. ఒకటి, సంప్రదాయ (ట్రెడిషనల్) మేధావులు, రెండు సజీవ (ఆర్గానిక్) మేధావులు. పాలకవర్గాలతో తమకు నిమిత్తం లేదని అనుకుంటూ, ప్రజలచేత కూడా అలా భావించబడేవారు సంప్రదాయ మేధావులు. వాళ్లు స్వతంత్రంగా ఉన్నట్లు కనిపిస్తారు. సమాజంలో ఎన్ని మార్పులు జరుగుతున్నా ఈ రకం మేధావులు మాత్రం చారిత్రకంగా కొనసాగుతూ వస్తున్నట్లు కనిపిస్తారు. పూజారులు, రాయసగాళ్లు, తత్వవేత్తలు, ప్రొఫెసర్లు ఇలాంటి కోవకు వస్తారు. వీళ్లు పాలక వర్గాల నుండి తాము స్వతంత్రంగా ఉన్నామని అనుకుంటున్నా అదంతా మిథ్య మాత్రమే. ప్రధానంగా వాళ్లు పాలక వర్గంతో ఉండి వారికి సహకరించే పాతకాలపు లేక మితవాద మేధావులు మాత్రమే.

సజీవ మేధావులు రెండో రకం. వీళ్లు ఆధిపత్య వర్గంతోబాటుగానే పుట్టి పెరుగుతారు. వాళ్ల ఆలోచనలకు ప్రతిరూపాలుగా ఉంటూ ప్రజలను సమీకరించే పని చేస్తుంటారు. ఇటువంటి మేధావులు గురించి ఆలోచిండం ముఖ్యం అని గ్రాంసీ చెప్పాడు. సమాజంలో పాలకవర్గాల వ్యవహారాలు చక్కబెట్టడానికి విద్యావిధానం ద్వారా ఈ మేధావులు ఉత్పత్తి చేయబడతారు. వీరి ద్వారానే పాలక వర్గాలు మొత్తం సమాజం మీద తమ 'ఆధిపత్యం' (హెజిమోనీ)ని చెలాయిస్తాయి.

పాలకవర్గాలను అధికారం నుండి తొలగించాలనుకునే వారు 'ప్రతి-ఆధిపత్యం' నిర్మించాలి. అంటే చెలామణిలో ఉన్న ఏకాభిప్రాయాన్ని సవాలు చేయాలి, 'విజ్ఞత' పేరుతో సాగుతున్న భావజాలాన్ని ఎదుర్కోవాలి. ఎలా?

దీనికి గ్రాంసీ చెప్పిందేమంటే... కార్మికవర్గం సంప్రదాయ మేధావుల్లో గణనీయమైన భాగాన్ని తనవైపు తిప్పుకోవడమే కాకుండా కార్మికవర్గ ఉద్యమం తనదైన 'సజీవ మేధావులను' తయారు చేసుకోవాలి. "మానవ జీవితంలోని అన్ని రంగాల్లోనూ మేధావులకు పని ఉంటుంది" అంతేకాదు, ప్రతి మనిషీ తను చేస్తున్న వృత్తికి బయట ఏదో ఒక రకం మేధో కృషి జరుపుతూనే ఉంటాడు, ప్రాపంచిక దృక్పథాన్ని కలిగి ఉంటాడు, ఏదో ఒక నైతిక విలువకు కట్టుబడి ఉంటాడు. అందువల్ల అతను తన వంతుగా ప్రాపంచిక దృక్పథానికి తోడ్పడ్డమే కాదు దాన్ని తన దృక్పథానికి అనుగుణంగా మార్చడానికి ప్రయత్నిస్తాడు. ఆ విధంగా కొత్త ఆలోచనా విధానాలను ఉనికిలోకి తెస్తుంటాడు. అంటే, ప్రజలకు ఆలోచించే సామర్థ్యాలు ఉంటాయి. అయితే, సమస్యంతా ఆ సామర్థ్యాలను ఎలా బయటకు తీయాలి అన్నదే.

కార్మికవర్గంలో ఇటువంటి సామర్థ్యాలను బయటకు తీసి తనదైన 'సజీవ మేధావులను' తయారుచేసుకోవాలనీ, సంప్రదాయ మేధావుల్లో నుండి సాధ్యమైనంత ఎక్కువమందిని విప్లవ పోరాటంలోకి లాక్కోవాలనీ గ్రాంసీ బోధించాడు. తను నిర్వహించిన 'కొత్త శకం' పత్రిక ద్వారా అటువంటి మేధావులను ఆకర్షించడానికి ప్రయత్నించాడు. ఈ పత్రికకు 'వారం వారం సోషలిస్టు సంస్కృతిపై సమీక్ష' అనే ఉపశీర్షిక పెట్టాడు. 1919లో టురిన్ నగరంలో పెద్ద ఎత్తున పారిశ్రామిక సమ్మెలు, మిలిటెంట్ రాజకీయ కార్యకలాపాలు సాగుతున్న సమయంలో ఆయన ఈ పత్రిక నడిపాడు.

గ్రాంసీ సైద్ధాంతిక పోరాటం గురించి చెప్పిన విషయాలు కేవలం చైతన్యాన్ని పెంపొందించడానికి మాత్రమే పరిమితం కాలేదు. చైతన్యాన్ని మార్చాలని, సోషలిస్టు చైతన్యాన్ని సృష్టించాలని చెప్పాడు. కార్మికవర్గ దైనందిన జీవితానుభవాల ద్వారా అటువంటి చైతన్యం పొందేందుకు తోడ్పడాలని చెప్పాడు. అందువల్ల మేధావుల కృషి ఎక్కడో నాలుగు గోడల మధ్య కాకుండా ప్రజల దైనందిన జీవితంలో భాగంగా సాగాలని చెప్పాడు. "కొత్త మేధావులను ఎంతబాగా విషయాలు చెప్పగలుగుతున్నారన్న దాన్నిబట్టి కాకుండా దైనందిన జీవితంలో నిర్మాతలుగా, ఆర్గనైజర్స్‌గా వారి పనిని బట్టి నిర్ణయించాలి. నిరంతరం వెంటబడి పనులు జరిగేట్లు చూసేవారే గానీ కేవలం ఉపన్యాసాలు చెప్పేవారు సజీవ మేధాలు కాదు" అని ఆయన వివరించాడు.

దైనందిన జీవితంలో చురుకుగా పాల్గొనే కార్మికవర్గ మేధావులను తయారు చేసుకోవడం ద్వారా ప్రస్తుత సామాజిక సంబంధాలను బద్దలుగొట్టే ''ప్రతి-ఆధిపత్యం" ఏర్పాటుకు తోడ్పడాలి అని చెప్పాడు. ఆ విధంగా ఆయన సిద్ధాంతాన్ని ఆచరణకు ముడిపెట్టాడు. కార్మికవర్గం నుండి ఇతర పీడిత వర్గాల నుండి మేధావులను తయారు చేయడంలో అనియత విద్య ఎంతగానో తొడ్పడుతుందని గ్రాంసీ చెప్పాడు. అందువల్లనే గ్రాంసీ జైలు రచనల్లో ఎక్కువ భాగం విద్యా విధానం ఎలా ఉండాలి అన్నదానికి కేటాయించాడు.


### వర్తమాన సమాజం–
### గ్రాంసీ బోధనల ప్రాముఖ్యత

గ్రాంసీ తక్కువ కాలమే - 46 సంవత్సరాలు జీవించాడు. (పుట్టుక:1891 జనవరి 22, మరణం: 1937 ఏప్రిల్ 27) అందులోనూ చివరి 11 ఏళ్లు (1926 నుండి 1937 వరకు) తీవ్రమైన అనారోగ్యంతో ఫాసిస్టు ముస్సోలినీ జైల్లో మగ్గాడు. అయినప్పటికీ ఆయన బయట జరుగుతున్న పరిణామాలను తెలుసుకుంటూనే ఉన్నాడు. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య పశ్చిమ ఐరోపాలోని అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ వ్యవస్థలు కార్మికవర్గంపై ఎలా తమ ఆధిపత్యాన్ని (హెజిమోనీ) నెలకొల్పుతున్నాయో గమనించడమే కాదు ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థలో

జరుగుతున్న వ్యవస్థాగత మార్పుల గురించి కూడా "అమెరికనిజం, ఫోర్డిజం". "కొత్త యువరాజు" అనే రచనల్లో హెచ్చరికలు చేశాడు. అమెరికాలో జరుగుతున్న మార్పులు పెట్టుబడిదారీ వ్యవస్థకు "కొత్త ముఖాన్ని" సమకూరుస్తున్నాయని చెప్పాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో ఉన్న సమయంలో అమెరికన్ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో తెచ్చిన మార్పులు, అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ ప్రారంభించి తదుపరి అధ్యక్షులు కొనసాగించిన 'న్యూ డీల్' చర్యలు అమెరికాలోనే కాకుండా మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థలోని కార్మికవర్గంలో భ్రమలు సృష్టించింది. ఈ చర్యలన్నీ అప్పటికే రష్యాలో కార్మికవర్గ నాయకత్వంలో ఏర్పడిన కమ్యూనిస్టు రాజ్యం నుండి పశ్చిమ దేశాల కార్మిక వర్గ దృష్టిని మళ్లించేందుకు, సోషలిజానికి ప్రత్యామ్నాయంగా పెట్టుబడిదారీ వ్యవస్థ కొత్త రూపు సంతరించుకుంటోందని చెప్పడానికీ ఉపయోగపడ్డాయి.

సిపిఐ(ఎం) అగ్రనాయకుడు ఇఎంఎస్ నంబూద్రిపాద్ ఈ విషయంలో గ్రాంసీ ముందు చూపు గురించి ఈ విధంగా చెప్పారు: "అక్టోబర్ విప్లవం తరువాత 80 ఏళ్లు గడిచినా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు ఒక్క దాన్లో కూడా విప్లవం రాకపోగా సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాలే సోషలిజం నుండి వెనక్కు మళ్లి ఆర్థింగా పెట్టుబడిదారీ వ్యవస్థనూ, రాజకీయంగా బూర్జువా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కౌగలించు కున్నాయంటే పెట్టుబడిదారీ వ్యవస్థ ఉత్పత్తి క్రమంలో వచ్చిన మార్పుల ప్రాముఖ్యత అర్థమవుతుంది. సోషలిజాన్ని తుపాకులతో ఓడించలేదు....లెనిన్ ఊహించినట్లు ఆర్థిక ఉత్పత్తి విధానంలో జరిగిన చారిత్రక పోరాటంలో అది ఓడించబడింది. అమెరికాకు చెందిన అణ్వస్త్రాలు కాదు సోవియట్‌ను దెబ్బతీసింది. కొత్త శాస్త్ర-సాంకేతిక విప్లవం తాత్కాలికంగానైనా, సోషలిజం మీద పెట్టుబడిదారీ వ్యవస్థ మెరుగైనది అన్న భావన కలిగించింది. ....విశేషమేమంటే, ఆంటోనియో గ్రాంసీ తన జైలు రచనలు (ప్రిజన్ నోట్ బుక్స్)లో 'అమెరికనిజం, ఫోర్డిజం' అన్న రచనలో ఈ విషయాలను ముందుగానే గ్రహించ గలిగాడు."

> **"వర్తమాన పెట్టుబడిదారీ వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయి. సామ్రాజ్యవాద దశలోని పెట్టుబడిదారీ వ్యవస్థ కొత్త శకంలోకి - ద్రవ్య పెట్టుబడి చోదిత ప్రపంచీకరణ యుగంలోకి ప్రవేశించింది. అది పెంచి పోషిస్తున్న వినిమయదారీ విధానం ప్రపంచ వ్యాపితంగా కొత్త విలువలను సృష్టిస్తోంది. దీనికి తోడు మితవాద భావజాలం, మన దేశంలో మతతత్వ మితవాద భావజాలం కొత్త తిరోగమన విలువలను సృష్టిస్తున్నాయి."**



గ్రాంసీ జైలు రచనలు


వర్తమాన పెట్టుబడిదారీ వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయి. సామ్రాజ్యవాద దశలోని పెట్టుబడిదారీ వ్యవస్థ కొత్త శకంలోకి – ద్రవ్య పెట్టుబడి చోదిత ప్రపంచీకరణ యుగంలోకి ప్రవేశించింది. అది పెంచి పోషిస్తున్న వినిమయదారీ విధానం ప్రపంచ వ్యాపితంగా కొత్త విలువలను సృష్టిస్తోంది. ప్రజల్లో గతంలో ఉన్న భావాలకు అర్థాలను మార్చేస్తోంది. వ్యష్టి నుండి సమిష్టికి మారడం, సంపదను అందరికీ పంచడం వంటివి ఒక నాడు ఆర్థిక సంస్కరణలు అంటే ప్రజల్లో ఉండే భావన, గ్రాంసీ పరిభాషలో చెప్పాలంటే ప్రజల్లో పాలకవర్గాలు కల్పించిన సాధారణ 'విజ్ఞత' (కామన్ సెన్స్). కానీ నేడు సంస్కరణలంటే ప్రజల సంపదను ప్రయివేటు పరం చేయడం, లేనివానిపై భారాలు మోపి, ఉన్న వాని బొక్కసాలు నింపడం. సంపద సృష్టికి కార్మికుని శ్రమ మూలం అనే భావన స్థానంలో పెట్టుబడులే సంపదను సృష్టిస్తాయన్న భావన బలపడింది. అప్పులు చేస్తే తిప్పలొస్తాయనే భావం పోయి అప్పు మనిషి గొప్పకు చిహ్నంగా మారిపోయింది. కాయకష్టం చేసేవారు రోజురోజుకీ మరింత పేదరికంలోకి పోతున్నా, కుబేరులు మరింత కుబేరులవుతున్నా వ్యవస్థను ప్రశ్నిండం పిచ్చితనంగా మారిపోతున్నది. ద్రవ్య పెట్టుబడి దోపిడీని ప్రశ్నించడం తెలివి తక్కువ తనం కిందా, ఎన్ని రయితీలైనా ఇచ్చి దాన్ని ఆకర్షించేవాడు తెలివైన వాడుగానూ చెలామణీ అవుతోంది. దీనికి తోడు విద్యారంగంలోనూ ఇంకా అనేక జీవన రంగాల్లోనూ సృష్టించబడుతున్న కొత్త భావజాలం అంతా కూడా పాలితులపై పాలక వర్గాల ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకోడానికి తోడ్పడుతున్నాయి.

దీనికి తోడు మితవాద భావజాలం, మన దేశంలో మతతత్వ మితవాద భావజాలం కొత్త తిరోగమన విలువలను సృష్టిస్తున్నాయి. ప్రజల ఆలోచనలపై మతతత్వ ఆధిపత్యం సాధించగలిగింది గనుకనే నేడు మతం, కులం, ఇతర మూఢ భావాల పేరుతో ఎన్ని దురాగతాలకైనా పాలకులు పాల్పడగలుగు తున్నారు. ఈ ఆధిపత్య భావజాలం ప్రజలను పాలకులనుండి వస్తున్న నిజమైన కష్టాల నుండి దృష్టి మళ్లించగలుతున్నది. ఇది మన దేశంలోనే కాదు అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాలతో సహా ప్రపంచ వ్యాపితంగా జరుగుతున్న పరిణామం. అమెరికాలో పెంచిపోషించబడుతున్న తెల్లజాతి దురహంకారం, యూరప్‌లో వలసదారులకు వ్యతిరేకంగా తలెత్తుతున్న సంకుచిత భావజాలం. ఇటలీతో సహా అనేక దేశాల్లో నయా-ఫాసిస్టు శక్తులకు ఆదరణ లభించడం ఇవన్నీ కూడా దీనికి ఉదాహరణలే.

ఇలాంటి పరిస్థితుల్లో స్థిరపడిపోయిన పెట్టుబడిదారీ సమాజంలో విప్లవాలను జయప్రదం చేయడానికి మార్క్సిస్టు మహోపాధ్యాయుల రచనలకు తోడుగా గ్రాంసీ బోధనలు కార్మికవర్గానికి ఎంతగానో తోడ్పడతాయన్న దాంట్లో సందేహం లేదు. ❋

ఈ మాసం ప్రత్యేకం

# భారతదేశ వారసత్వ మూలాలు



రచయిత ప్రముఖ చరిత్రకారుడు

కేశవన్ వెలుతట్

సంస్కృతానికి యూరప్ ప్రాచీన భాషలైన గ్రీకు, లాటిన్ భాషలకి పోలికలు ఉన్నట్టు గమనించిన వెంటనే, ఆ రెండు భాషలు మాట్లాడేవారి మూలాలు "ఆర్యులని", వారే భారతదేశ నాగరికతకు ఆద్యులని ప్రతిపాదించడం జరిగింది. "ఆర్యజాతి" సిద్ధాంతం అందరికి అనువుగా మారింది. సామ్రాజ్యవాదులు దానిని భారతదేశం పై తమ పాలనను న్యాయబద్ధం చేసుకోవడానికి ఉపయోగించుకున్నారు. సామ్రాజ్యవాదుల చేత అవమానించబడుతున్న, కొత్తగా ఆవిర్భవించిన మధ్యతరగతికి ఇది కొంత ఉపశమనం కలిగించేదిగా, గాయానికి లేపనం రాసినట్టు తయారయింది. బ్రిటిష్ వారు భారతదేశానికి రావడాన్ని ఏకంగా, "విడిపోయిన దాయాదులు కలయిక" అనేంతవరకు కేశుబ్ చంద్రసేన్ వెళ్లారు. "ఆర్యుల భారతదేశం ఒక అద్భుతంగా" జాతీయవాదులకు అనిపించింది. సంస్కృతంలో రూపొందించబడినవన్నీ ఉత్తేజ కారకాలుగా తోచాయి. ప్రాంతీయ రాజకీయాలకు కూడా ఇది ఉపయోగపడింది. మద్రాసు ప్రెసిడెన్సీలోని ద్రవిడ ఉద్యమానికి "ఆర్యజాతి"ని "ఇతరులుగా" చూపించే సిద్ధాంతాన్ని రూపొందించడానికి పనికి వచ్చింది. దళిత ఉద్యమ నేత మహాత్మా జ్యోతి బాపూలేకి, "ఆర్యులు" దండయాత్రలు చేసి స్థానికులకు చెందాల్సిన భూమి నుంచి వారిని ఎలా తరిమి కొట్టారో చూపేందుకు వీలయింది. ఈ "సిద్ధాంతం" అన్ని అనుమానాలను నివృత్తి చేసే నిష్కలంకమైన సిద్ధాంతం అయింది.

తాము బయటి నుంచి వచ్చిన వారు అనడంతోనే "ఆర్యుల" గొప్పతనాన్ని ప్రతిపాదించే వారికి చిక్కు వచ్చి పడింది. భారతదేశ సంస్కృతి దిగుమతి చేసుకోబడిందనడం మింగుడు పడలేదు. భారతీయులు అనడానికి – దేశ సరిహద్దులే, ఇంతకీ అది ఏ దేశ సరిహద్దులో మరి! – వారి పితృభూమి, పుణ్యభూమి ఇదే అయి ఉండాలనుకునే వారి గొంతులో పచ్చి వెలక్కాయ పడింది – ఆర్యులు కూడా ముస్లింల లాగే భారతదేశం వెలుపలి నుంచి వచ్చి ఇక్కడ మహోన్నతమైన నాగరికతను స్థాపించినట్టు చెప్పుకోవడం అంటే, తామెక్కిన కొమ్మను తామే నరుక్కున్న చందంగా తయారయింది. బాలగంగాధర్ తిలక్ వేదాలకు పుట్టినిల్లు "ఆర్కిటిక్" అని రాసినప్పుడు ఒక సందిగ్ధత ఏర్పడింది. ఒక వైపు తిలక్ జాతీయవాదాన్ని అనుమానించ లేరు, మరో వైపు "ఆర్యుల" అసలైన పుట్టినిల్లు భారతదేశం కాదనే ప్రతిపాదన నుండి బయటపడవలసిన అవసరం కలిగింది. అయితే ఈ సందిగ్ధత నుండి బయటపడటానికి గోల్వాల్కర్ ఒక పరిష్కార మార్గాన్ని కనుగొన్నారు. "ఆర్యుల" అసలైన పుట్టిల్లు అయిన ఆర్కిటిక్ భారతదేశంలోనే ఉంది అన్నారు. అది భారతదేశంలోని ఒరిస్సా, బీహార్‌లో ఉందన్నారు. ఉత్తర ధృవం, ఉత్తరదిశగా తప్పటడుగులు వేసుకుంటూ ఉత్తర ధృవానికి చేరుకుంది! ఆర్యులు వెనక ఉండిపోయారు. ఈ ప్రతిపాదన మీకెలా అనిపిస్తోంది!!

1920 లలో హరప్పన్ నాగరికత బయటపడడంతో "ఆర్యులు" భారత నాగరికత మూలాలుగా భావించబడుతున్న ఆలోచన పటాపంచలు కావడం మొదలైంది. హరప్పన్ నాగరికత కేవలం ఆర్య నాగరికత కాకపోవడమే కాదు, ఆర్యుల కన్నా ముందున్న నాగరికత. ఈ ఆవిష్కరణను చాలామంది స్వాగతించారు – ఆర్యులు బయటి నుంచి వచ్చి భారతదేశాన్ని ఆక్రమించుకోలేదని భావించిన వారు, "ఆర్యులు" భారతదేశ నాగరికతకు మూలాలన్న వారిలో క్రమంగా ఇబ్బంది మొదలు అయింది. వారు హరప్పన్ నాగరికత కూడా ఆర్యులదని దావా చేయడం మొదలు పెట్టారు. మొదట్లో ఈ వాదన కొంత స్వాగతించదగ్గదిగా కనిపించింది. కానీ తరువాత తరువాత తిలక్ "ఆర్కిటిక్" సిద్ధాంతంతో ఇదో జోక్‌గా మారిపోయింది. కంప్యూటర్లలో మెరుగుపరచబడిన చిత్రాలు గుర్రాలు పైకి ఎగురుతూ సంస్కృతంలో హరప్పన్ ముద్రలు, కుడి, ఎడమ వైపుల నుండి చదవడాన్ని చూపించడం మొదలు పెట్టారు. అధికారంలో ఉన్న పార్టీ, ఇది సింధు నాగరికత కాదని, సరస్వతి నది నాగరికత అని, భారతీయ వేద సాహిత్యంలో ఈ విషయాలన్నీ నిక్షిప్తమై ఉన్నాయని, అందువలనే ఇది "ఆర్య" సంస్కృతి అని నిరూపించడానికి కోట్లాది రూపాయలు వెచ్చించింది. ఈ ప్రతిపాదన సారాంశం, భారతదేశ సంస్కృతి, "ఆర్య" సంస్కృతికి రుణపడి ఉంది. "ఆర్యులలో" చివరి వాడు కూడా భారత దేశంలోనే పుట్టాడు పెరిగాడు. దీనికి భిన్నంగా మాట్లాడితే మీరు దేశ ద్రోహులు అవుతారు.

టోనీ జోసెఫ్ రాసిన, "ది స్టోరీ ఆఫ్ అవర్ ఎన్సిస్టర్స్ అండ్ వేర్ వుయ్ కేం ఫ్రొం" అనే పుస్తకంలో దీనికి సంబంధించిన చాల సమాచారం ఉన్నది. ఇది కేవలం "ఆర్య జాతి" పవిత్రత లేదా దాని అసలైన పుట్టుకకు సంబంధించిన విషయం కాదు. ఇది భారత ప్రజల జాతి మూలాలను నిర్ధారించేందుకు చేసిన ప్రయత్నం. ఇందులో రెండు ప్రశ్నలు లేవనెత్తబడ్డాయి. మనం ఎవరం? మనం ఎక్కడి నుంచి వచ్చాము? "మనం" అంటే భారత దేశంలో నివసిస్తున్న వారందరూ – కులం, జాతి, మతాలతో సంబంధం లేకుండా, మనమెరిగిన కాలం నుంచి నేటి వరకు.

ఆ పరిశోధనలో దొరికిన సమాధానం సంక్లిష్టమైనది. ఎందుకంటే ఇక్కడ నివసిస్తున్న వివిధ తరగతుల వారసత్వం భిన్నంగా ఉంది. ఆ పోగులు ఒకదానితో ఒకటి పెనవేసుకుపోయి ఉన్నాయి. పైగా వాటి మూలాలు కూడా వేర్వేరుగా ఉన్నాయి. ఈ సంక్లిష్టమైన సమాధానాన్ని జోసెఫ్ రెండు ముక్కల్లో చెప్పారు – మనమంతా భారతీయులం. మనమంతా వలస వచ్చిన వారమే.

ఈ మధ్యకాలంలో మానవ చరిత్రకు పూర్వపు వారసత్వ శాస్త్రీయ పరిశోధనలో వెలువడిన ప్రధాన ఫలితాలు కూడా విస్ఫోటనం కలగ చేస్తున్నాయి.

**ఆఫ్రికా నుండి కదిలి వచ్చిన వైనం**

జీవ పరిణామ క్రమ శాస్త్రం, ప్రాచీన మానవుడు విభిన్న జాతులుగా పరిణామం చెందడం యొక్క ప్రాధాన్యతను గుర్తించినప్పు

టికీ, కేవలం ఈ మధ్య కాలంలోనే, మానవజాతి వలసలు ఆఫ్రికా నుంచి మొదలయ్యాయన్న సిద్ధాంతం వెలుగు చూసింది. ఈనాటి ఆధునిక మానవుడు, హోమో సేపియన్‌గా మొదలై తరువాత కాలంలో క్రమ క్రమంగా మానవునిగా అవతరించాడని నిర్ధారించడం జరిగింది. డిఎన్ఏ విశ్లేషణలతో ఇది సాధ్యపడింది. ఈ మధ్య డిఎన్ఏ విశ్లేషణలతో వచ్చిన పురోగతి శాస్త్రజ్ఞులకు మరింత ఆత్మ స్థైర్యాన్ని ఇచ్చాయి. వ్యక్తుల, సమూహాల, లేదా దేశ ప్రజలందరి పూర్వీకుల పూర్తి సమాచారాన్ని అందించగలమని నమ్మకంగా చెబుతున్నారు. ప్రపంచ మానవ జాతంతా 70 వేల సంవత్సరాల కిందట ఆఫ్రికా ఖండం నుంచి వచ్చిన కొద్ది మంది హోమో సేపియన్స్ నుండే ఆరంభమయింది అని ఘంటాపథంగా చెప్పగలుగుతున్నారు. ఇది ప్రపంచంలో పెద్ద గాలి దుమారాన్నే రేపింది. "మానవ" జీవి – అంటే దాదాపు మానవుడిగా ఏర్పడినది చాలా చాలా కాలం కిందట – ఎరెక్టస్, హోమో హేయదేల్బర్జెన్సీస్, హోమో నియదార్థాలేన్సిస్, వగైరాలుగా ప్రారంభమయింది. అయితే, బలహీనంగా ఉండే హోమో సేపియన్స్ మాత్రమే బతికి బట్ట కట్ట గలిగాయి–ప్రధానంగా అందుకు కారణం, మెరుగైన ఎత్తుగడలు, సాంకేతికత. ఇప్పుడు చేస్తున్న ఈ వాదన అర్థవంతంగా ఉంది.

డిఎన్ఏకి సంబంధించిన వంశపారంపర్య విధానం, తర్కం స్పష్టంగా తెలియ చేసిన తరువాత, భారతదేశ ప్రజలకు సంబంధించి జోసెఫ్, రెండు ప్రశ్నలు లేవనెత్తి, వాటికి సమాధానాలు చెప్పారు. దాదాపు మనుషులుగా మానవుడు ఉద్భవించి మూడు లక్షల ఏళ్ళు గడుస్తున్నప్పటికీ, ఆఫ్రికా బయట, 180000 ఏళ్ల కిందటి ఆధునిక మానవుడి అవశేషాలు, ఉత్తర ఇజ్రాయిల్‌లో ఒక కొండ గుహలో లభించాయి. ఇది కూడా కేవలం ఒక్క చోట మాత్రమే లభించాయి. ఆఫ్రికా బయటికి విజయవంతంగా వలసలు జరిగింది ఆ తరువాతి 110000 సంవత్సరాలకి, అంటే 70000 ఏళ్ల కిందట మాత్రమే. మానవుడు ఆవిర్భవించి అంతకు ముందు ఎన్నో సంవత్సరాలు అయినప్పటికీ, ఆ అవశేషాలు ఎక్కడా లభించలేదు. ఆధునిక మానవుడు భారతదేశానికి 65000 ఏళ్ల కిందట వలస వచ్చాడు. వారు తమకంటే బలవంతులైన దాదాపు మనుషుల వంటి వారిని ఎదుర్కొని ఉండవచ్చు. కానీ వలస వచ్చిన వారు మెరుగైన సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేసుకోక ముందు తమ కంటే బలవంతులతో తలపడడానికి ఇష్టపడకపోయి ఉండవచ్చు, ఆ తరువాత కాలంలో మరింత మెరుగైన సాంకేతికతను సాధించిన తరువాత మాత్రమే మైక్రో లిత్స్ వారిని అణచివేశారు. ఆఫ్రికా నుండి వలస వచ్చిన వారు ప్రపంచంలోని అనేక ప్రాంతాలకు కూడా తరలి వెళ్లారు.

ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో కూడా అప్పటికే మనుషులు నివసిస్తున్నందువలన ఆఫ్రికా నుండి వలస వచ్చిన వారి జీన్స్ కూడా పరిస్థితులకు అనుగుణంగా మార్పులకు గురయ్యాయి. ప్రతి సమూహం తన సొంత వారసత్వ లక్షణాలను పుణికి పుచ్చుకుంటూ వచ్చినా కొత్తగా వచ్చిన లక్షణాల జాడలను కూడా కలిగి ఉంది. అందువలనే ఆఫ్రికా నుండి వలస వచ్చిన జాతులలో ఇన్ని రకాల జీన్స్ ఉన్నాయి. ఈ వేట గాళ్ళు, ఫలాలు ఏరుకునే వారు, మెసోలిథిక్ యుగంలో ఆధునిక మైక్రోలిత్స్‌ల సాంకేతికతను, నియో లిథిక్ యుగంలో చేతి గొడ్డళ్లు పదును పెట్టడాన్ని నేర్చుకుని తమ గ్రామాన్ని మెరుగుపరచుకున్నారు. ఎన్నో మార్పులను చేసుకున్నారు. దీనినే గోర్డాన్ చిల్డే 'నియోలిథిక్ విప్లవం' అన్నారు.

క్రీస్తు పూర్వం 7000 బిసిఇలో బలూచిస్తాన్‌లోని బోలన్ పర్వత అంచుల్లో మెహ్గర్హ్ అనే గ్రామం ఉంది. అక్కడ కొత్తగా వ్యవసాయం మొదలయింది. ఆ రోజుల్లో సింధు, మెడిటరేనియన్ మధ్య ఉన్న అతి పెద్ద మానవ నివాసం అదే. అదేకాలంలో ఇరానియన్ వ్యవసాయ దారులు జాగ్రోస్ ప్రాంతం నుండి వచ్చారు. వారే 'మొదటిసారిగా' భారతీయులతో కలిసిన జాతి, జాతి సాకారానికి కారణం. అంటే అగ్రిక నుండి వలస వచ్చిన వారితో కూడిన జాతి. వారి వల్లనే అక్కడ మొదటి సారిగా పంటలు పండించే విధానంలో మార్పులు వచ్చాయి. ఇది బిసిఇ 4700–3000 మధ్య కాలంలో జరిగి ఉండవచ్చని జెనెటిక్ ఇంజినీర్ల అంచనా. బార్లీ, గోధుమలు సేద్యం చేయడం మొదలైంది. పెంపుడు జంతువులను తినడం ప్రారంభమయింది. ఇప్పటికే ఉత్తర పశ్చిమ భారతదేశంలో సిందూ, ఘగ్గర్, హక్రా లోయలలో, గుజరాతిలో కూడా వ్యవసాయ స్థిర నివాసాలు మొదలయ్యాయి అదే సమయంలో, అంటే 7000 బిసిఇ నాటికి ఉత్తరప్రదేశ్ లోని, గంగా నది పై పై భాగంలోని లహురదేవలో వరి పండించడం, కోసుకోవడం మొదలయిందని, జీవనం సుఖవంతంగా సాగుతున్నదని తెలియ చేసే సాక్ష్యాలు ఉన్నాయి. వ్యవసాయాన్ని స్థిరనివాసంగా ఏర్పరచుకుని, రకరకాల వ్యవసాయ విధానాలపై ప్రయోగాలు చేస్తున్న ప్రదేశం ఒక్క లహురదేవ మాత్రమే కాదు.

5500–2600 బిసిఇల మధ్య కాలంలో ఉత్తర పశ్చిమ ఉపఖండంలో అనేక పట్టణాలలో ప్రత్యేక తరహా వ్యవసాయ స్థిరనివాసాలు ఏర్పడ్డాయి. భారతదేశంలోని కలిబంగన్, రాఖీగర్హిలలో, పాకిస్థాన్లోని బన్వాలి, రెహ్మాన్ ధేరిలు అందులో కొన్ని. ఈ క్రమంలోనే సోతి, అమ్రి, కుల్లి అనే హరప్పన్ సంస్కృతులు అభివృద్ధి చెందాయి. ఇవన్నీ చేరి ఒక ఉన్నతమైన సంస్కృతి అభివృద్ధి చెందింది. వ్రాత, ముద్రలు, కుండల తయారీ, ఇటుకల తయారీ, కొలతలు, తూనికలు, వగైరాలు వచ్చాయి. మతురె హరప్పన్ సంస్కృతి ఆవిర్భవించింది. ఈ సంక్లిష్ట సంస్కృతిని తయారు చేసిన "మొదటి భారతీయులు" ఇరాన్ లోని జాగ్రోస్ కొండలలోని వ్యవసాయం చేసే ప్రజలు. మొదటి పట్టణాలు వెలయక ముందే ప్రజలు కలిశారు. మిశ్రమం జరిగింది. ఒక విధంగా చెప్పాలంటే, అది అధికారికంగా దక్షిణ ఆసియాకి చెందినది. ఆసియాకి, అమెరికాకి, యూరప్‌కి తరలి వెళ్లిన వారు ఇంకెంత మాత్రం ఆఫ్రికన్లు మాత్రమే కాదు. వారిలో అనటోలియన్ వారసత్వపు ఛాయలు లేనేలేవు.

ఈ జెరోమ్‌కి సంబంధించిన నిర్ధారణలకు, పురావస్తు శాస్త్రంతోనో భాష శాస్త్రం తోనో సంబంధం లేదు. కానీ జెరోమ్ నిర్ధారణ కాక ముందు మెహ్గర్హ్ పరిశోధనలు కూడా దాదాపు ఇటువంటి నిర్ధారణలకే వచ్చాయి. మెసొపొటోమియాలో మాట్లాడే అనేక భాషలలో ఒకటయిన

> **"క్రీస్తు పూర్వం 7000 బిసిఇలో బలూచిస్తాన్‌లోని బోలన్ పర్వత అంచుల్లో మెహ్గర్హ్ అనే గ్రామంలో కొత్తగా వ్యవసాయం మొదలయింది. ఆ రోజుల్లో సింధు, మధ్యధరా మధ్య ఉన్న అతి పెద్ద మానవ నివాసం అదే. అదేకాలంలో ఇరానియన్ వ్యవసాయ దారులు జాగ్రోస్ ప్రాంతం నుండి వచ్చారు. వారే 'మొదటిసారిగా' భారతీయులతో కలిసిన జాతి సాకారానికి కారణం. అంటే వలస వచ్చిన వల్లనే అక్కడ మొదటి సారిగా పంటలు పండించే విధానంలో మార్పులు వచ్చాయి."**

> **❝ నిజానికి ఆధునిక పరిశోధనలు కూడా చెప్పేదదే. అశోక్ పర్పోల, ఐరావతం మహదే వన్ తమ వ్యక్తిగత పరిశోధనల్లో హరప్పన్ల భాషకి ద్రావిడులు భాషకి సంబంధాలు ఉండి ఉండ వచ్చని సూచించారు. అయితే రెండు భాషలలో వ్రాతపూర్వక భాష అభివృద్ధి చెందినదని చెప్పడం లేదు. అది క్రమానుగతంగా సాగింది - సంకేతాలు, సంఘటనలకు సంభవించిన తీరుతెన్ను లు, క్రమానుగతం, సంయోగ విధానాలు, పరిస్థితులు, వారిని ఈ నిర్ధారణ లకు తెచ్చాయి. ❞**

ఇరానీయన్లు మాట్లాడే జాగ్రోస్ జాతి మాట్లాడే భాష బహుశా ఎలామైట్ అయి ఉండవచ్చని భావించారు. బలూచిస్తాన్ మాట్లాడే బ్రహుయికి, ఎలామైట్‌కి దగ్గరి పోలికలు ఉన్నట్టు తేలిపోయింది. బ్రహుయ్‌కి ద్రావిడ కురుమ భాషలకి ఉన్న సంబంధం తెలిసినదే. అంటే జెన్యుపరంగా నిరూపించబడినదే అని ఇదివరకటి పురావస్తు శాస్త్రజ్ఞులు, భాషా శాస్త్రజ్ఞులు కూడా సూచించారు. హరప్పన్‌ల భాషలో ద్రావిడుల భాష వాడకం చాలా ఎక్కువగా ఉంది.

నిజానికి ఆధునిక పరిశోధనలు కూడా చెప్పేదదే. అశోక్ పర్పోల, ఐరావతం మహదేవన్ తమ వ్యక్తిగత పరిశోధనల్లో హరప్పన్ల భాషకి ద్రావిడులు భాషకి సంబంధాలు ఉండి ఉండవచ్చని సూచించారు. అయితే రెండు భాషలలో వ్రాతపూర్వక భాష అభివృద్ధి చెందినదని చెప్పడం లేదు.

అది క్రమానుగతంగా సాగింది – సంకేతాలు, సంఘటనలకు సంభవించిన తీరుతెన్నులు, క్రమానుగతం, సంయోగ విధానాలు, పరిస్థితులు, వారిని ఈ నిర్ధారణలకు తెచ్చాయి. ఆర్యులు /సంస్కృతం దురభిమానుల ప్రయత్నాలు ఈ పరిశోధకులకు నవ్వు తెప్పిస్తున్నాయి.

పరిణితి చెందిన హరప్పన్ రెండో మిలీనియం మధ్య కాలం వరకు కొనసాగాడు. మేఘాలయాలో ఒక గుహలో బయటపడ్డ స్టలాగ్మైట్ (కాల్షియం కార్బొనేట్ యొక్క సిలిండర్ సున్నపు రాయి గుహ యొక్క నేల నుండి పైకి ప్రొజెక్ట్ చేస్తుంది) పొరలలోని ప్రాణవాయువుల అణువుల ఐసోటోప్స్‌లలో కల్లోలాలు దక్షిణ ఆసియాలో ఒకానొక కాలంలో భారీగా రుతుపవనాల వైఫల్యం వలన కరువు సంభవించిందని తెలియచేస్తున్నాయి. ఇది బహుశా 4200–4000 కిందట అయి ఉండవచ్చు. ఏడు దశాబ్దాల కిందట మోర్టిమే వీలర్ అన్నట్టు, జోసెఫ్ కూడా, హరప్పన్ నాగరికత ముగింపుకు కారణం – ఇంద్రుడు కాదు వరుణుడు అయి ఉంటాడని చమత్కరించారు. హాస్యాన్ని పక్కకు పెడితే, రెండో మిలీనియం రెండో భాగంలో హరప్పన్ నాగరికత పతనం ప్రారంభమయింది. ఉత్తర – పశ్చిమ వలసలు మళ్ళీ మొదలయ్యాయి. ఇది కూడా జెనెటిక్స్ నిర్ధారిస్తుంది. కొత్తగా వలస వచ్చిన వారిలో యురేషియన్ స్టెప్పీల మూలాలు కనిపించాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ సారి వచ్చిన వారిలో మగ వారికి ప్రాతినిధ్యం వహించే 'వై' క్రోమోజోములు, మహిళలో కనిపించే 'ఎక్స్' క్రోమోజోముల కన్నా ఎక్కువ ఉన్నాయి.

అంటే వలస వచ్చిన వారిలో అత్యధికులు పురుషులన్నమాట. వారు స్థానిక మహిళలతో కలిశారు. అదే మొదటి భారతీయుల మిశ్రమం. జాగ్రోస్ కొండప్రాంతాల నుండి వచ్చిన ఇరానీయన్లు. స్టెప్పీల నుండి వలస వచ్చినట్టు బాక్ట్రియా–మార్జియానా – ఆర్కియాలాజికల్ కాంప్లెక్ నిరూపించింది. ఈ మధ్యనే మైకేల్ విజెల్, అందుబాటులో ఉన్న ఆధారాలన్నిటిని పరిశీలించి," భారతదేశ సంక్లిష్ట గణాంకాలు, పురావస్తు శాస్త్రం, జెనెటిక్స్, భాషాశాస్త్రం, వేద ప్రామాణిక గ్రంధాలు –ఒకదానిపై ఒకటి పరుచుకుపోయినట్టు ఉన్నాయని రాశారు. అన్నిటిని కలిపి చూస్తే, స్థూలంగా ఒక నిశ్చితాభిప్రాయం కలుగుతుంది. ఆర్య భాష, కవిత్వం, మతం, క్రతువులు, సంస్కృతి, ఆఖరికి వంశ పారంపర్యాలు కూడా విస్తృతంగా వ్యాపించి ఉన్నాయి." ముగింపుగా చెప్పాలంటే, భారత దేశం ఒంటరిగా లేదు. అదే సమయంలో పురావస్తు శాస్త్రం, జెనెటిక్స్, భాషాశాస్త్రం, భారత దేశంలో వేటికవే అభివృద్ధి చెందలేదు. 60000 ఏళ్ల నాటి ఆఫ్రికా చరిత్ర ప్రభావం ఈ ఉపఖండంపై ఉంది. మరే ఇతర ఆసియాలోని ఉపఖండాలలాగే – ఒకనాటి పోడి నేల సుడాన్, ఈశాన్య ఆసియాల లాగ – భారత ఉపఖండం కూడా అంతర్గతంగా, బహిర్గతంగా కూడా వివిధ రకాలుగా ముప్పిరి గొలిపే రీతిలో అభివృద్ధి చెందింది. ఇది పూర్తిగా తెలియాలంటే నిష్పక్షపాతంగా, ఓర్పుతో అధ్యయనం చేయాల్సి ఉంది."

ఇండో యూరోపియన్ భాష మాట్లాడేవారు తమను తాము ఆర్యులుగా చెప్పుకునే ముందు, ఇప్పుడు భారతదేశంగా పిలుచుకునే ప్రాంతానికి స్టెప్పీల నుండి వలస వచ్చారు. వారు అస్ట్రోసియాటిక్ భాష మాట్లాడేవారు. రెండు ప్రధాన వలసలు సంద్రంలా వచ్చిపడ్డాయి. ఒకటి దక్షిణ – తూర్పు ఆసియా నుంచి భూమార్గం, రెండోది ద్వీపాన్ని దాటుతూ చైనా నుంచి మొదలైనది. అది దక్షిణ – తూర్పు ఆసియా రూపు రేఖలను మార్చేసింది. ధాన్యం, చిరుధాన్యాలు అప్పటికే యాంగ్జి, పసుపు నది ప్రాంతంలో పండించడం మొదలయింది. మొదటిసారిగా వలస వచ్చిన వారు అస్ట్రోసియాటిక్ భాషను తమతో పాటు తెచ్చారు. కొత్త రకాల మొక్కలు, కొత్త వరి వంగడాలు, రెండో శతాబ్దంలో భారతదేశానికి చేరాయి. ఇదే కాలంలో, అభివృద్ధి చెందిన హరప్పన్ నాగరికత విల్లంబులు ఉపయోగించడం మొదలు పెట్టింది. ఈ వలసవాదుల వారసులలో, వారి మాతృ వంశపారంపర్యాలలో "భారతదేశం లోని మొదటిసారిగా" అడుగిడిన వారి ఆనవాళ్లు బయటపడ్డాయి.

చివరి విషయం మరింత ఆసక్తిదాయకంగా ఉంది. స్టెప్పీ మైదాన భూముల నుండి వలస వచ్చిన వారిలో కూడా పురుషులే అధికంగా ఉన్నారు. ఆనాడు మహిళలో అత్యధికుల ప్రాకృత భాష మాట్లాడేవారు. "ఉన్నత కులం" లో పుట్టినవారు సంస్కృతం మాట్లాడేవారు. అందుకు కారణం బయటి నుంచి వచ్చిన పురుషులు స్థానిక మహిళలను వివాహం చేసుకోవడమే అయి ఉంటుందని జోసెఫ్ విశ్లేషిస్తూ అంటారు. మహిళలు అనార్యులు. భిన్నమయిన భాష, సంస్కృతి కలవారు అయి ఉండవచ్చు. స్టెప్పీల నుండి వలస వచ్చిన ఆర్యులు ఈ అనార్యులను వివాహం చేసుకుని ఉంటారని ప్రతిపాదించారు."

జోసెఫ్ వ్రాసిన పుస్తకం పాఠకులకు అందుబాటులో ఉంది. ఇందులో అనేక రంగాలకు చెందిన విజ్ఞానం పొందుపరచబడింది – పురావస్తు శాస్త్రం, భాషాశాస్త్రం, ప్రాచీన గ్రంథాలు విడివిడిగా జరిగిన అధ్యయనాలు–వాటిని అందరూ అంగీకరించచక పోవచ్చు. కానీ భారతదేశ చరిత్ర ఎక్కడి నుంచి మొదలైంది అనే విషయంపై ఒక కచ్చితమైన అభిప్రాయానికి వచ్చే అవకాశం ఉంది. ప్రధానంగా ఈ మధ్య జెనెటిక్స్‌లో జరిగిన అధ్యయనాలు ఇందుకు ఉపయోగపడతాయి. అసత్యాలు సత్యాలుగా, భ్రమలు, కల్పనలు వాస్తవాలుగా చలామణి చేసే ప్రయత్నాలు జరుగుతున్న ఈ దశలో ఇటువంటి పరిశోధనలు మరింత అవసరం.

**(అనువాదం: కె ఉషారాణి)**

# రుగ్వేదంలో సృష్టి గురించిన వివేచన

(2వ పేజీ తరువాయి)

పనికిరావు. నీవు మరియొక వ్యక్తి బాహువులను ఆలింగనము చేసుకో. నేను కాకుండా మరి ఒకరిని నీ పతిగా చేసుకో అని యముడు తన చెల్లెలి కోర్కెను సున్నితంగా తిరస్కరిస్తాడు. అప్పుడు యమి సోదరుడితో నిష్ఠురా లాడుతుంది. అన్న ఉండగా చెల్లెలు అనాథ అయితే ఆ సోదరుడు ఎందుకు? దుఃఖ పడే ఆ చెల్లెలు ఎందుకు? కామమునకు లోనై నేను ఇదంతా చెబుతున్నాను. నీ శరీరంతో నా శరీరాన్ని తృప్తి పరచుము అని అంటుంది యమి. నేను నా శరీరంతో నీ శరీరాన్ని ముట్టుకోను. చెల్లెలుతో సంపర్కం పాపం అన్నారు. నాకు భిన్నమైన వానితో నువ్వు ఆనందించు అంటూ అన్నా చెల్లెళ్ల శారీరిక సంబంధాన్ని తిరస్కరిస్తాడు యముడు. యమ, యమి సంభాషణ ద్వారా రెండు తరుణ హృదయాల ప్రేమాలాపం ప్రకటితమవుతుంది. అంతేకాకుండా అర్యులలో అన్నా చెల్లెళ్ల వివాహం నిషిద్ధంగా ఉన్నదన్న సంగతి కూడా తెలుస్తుంది.

అశ్వినీ దేవతలు ఆయన సోదరులు ఇద్దరూ సూర్య భగవానుని కూతురైన "సూర్య"తో కలిసి జీవించారు. తర్వాతి కాలంలో ఇక్ష్వాకు వంటి ఉన్నత వంశంలో కనీసం ఆపత్కాలంలో అన్నా చెల్లెలు వివాహం ఉన్నట్లు బుద్ధ వచన ములందు చెప్పబడింది. ఇక్ష్వాకుని నలుగురు పుత్రులు, చెల్లెళ్ల ను వివాహమాడి తమ వంశాన్ని కాపాడుకున్నారు. ఆ తరువాత అది శాక్య వంశంగా ప్రసిద్ధి కెక్కింది. బుద్ధ జాతక కథలలో సీతారాముల వివాహం కూడా చెల్లెలు అన్న వివాహంగా చెప్పబడుతుంది (దశరథ జాతక కథ). అత్యంత ప్రాచీన కాలంలో అన్నాచెల్లెళ్ల వివాహాలు జరిగేవి అని తెలుస్తున్నది. థాయి లాండ్ రాజవంశంలో ఇప్పటికీ ఈ ఆచారం ఉన్నది. ఈజిప్ట్ లోని "ఫారో"వంశీకులు కూడా రక్తాన్ని పవిత్రంగా ఉంచుకొనుటకు ఇలాగే చేసేవారు. ఇవన్నీ చరిత్రలో నమోదు అయినవే. యమ-యమిల సంవాదం వలన సప్తసింధు లోని ఆర్యులు ఈ ఆచారాన్ని మంచిదిగా అంగీకరించలేదని అర్థం అవుతున్నది.

### సోమపానం

ఋగ్వేదంలోని తొమ్మిదవ మండలం సోమపానం మండలం. లేదా సోముని మండలం. సోమం సప్త సింధు ఆర్యులకు ఆనందం ఇచ్చే, మత్తును కలిగించే శ్రేష్టమైన పేయము. 84 మంది ఋషుల చేత రచించబడిన సోమ స్తుతులు తొమ్మిదో మండలం అంతా ఉన్నాయి. కణ్వ పుత్ర శోభరి సోమపానం ఇంద్రునకు ప్రియమైనది అని చెప్పాడు. (8-71-7,8) "చమసుల్లో (గిన్నెల్లో), చమూల్లో (కొయ్య పాత్రల్లో) నీకొరకు సోమని వడగట్టి వుంచాము. ఓ ఇంద్రుడా నీవు దీన్ని త్రాగుము. పాత్రలోని సోమము నీటిలో చంద్రునివలె కనపడుతున్నది. నీవు దీన్ని త్రాగుము. దీనికి నీవు ఈశ్వరుడవు."

హిమాలయాలలో ఉన్న ముంజువాన్ పర్వత సానువులనుండి సోమ లతనుతెచ్చి నూరుదు రాళ్ళమీద నూరి పాలు తేనె కలిపి ఈ సోమరసాన్ని తయారు చేసేవారు. ఈ సోమరసాన్ని ఆవు చర్మంపైన లేదా గొర్రె చర్మం పైన ఉన్ని రోమాల మధ్య వడకట్ట పదుతుంది. ఇది తాగితే మత్తు కలుగుతుంది. దీనిని టిబెట్టులో "సోమ రాజం" అని పిలుస్తారు. ఆఫ్ఘనిస్తాన్ లో "సోమ"ను "ఓమా" అని పిలుస్తారు. ఈ సోమరసాన్ని, సోమ పానాన్ని గురించి, దాని గొప్పతనం మహత్యం గురించి 144 సూక్తాలలో వర్ణించారు.

ఈ సోమరసాన్ని కొయ్య పాత్రలలో ఉంచి ఇంద్రుడిని రమ్మని వచ్చి తాగమని ఆహ్వానించేవారు. ఈ సోమాన్ని గురించి ఉన్న 9 వ మండలం విశ్వామిత్ర పుత్ర మధు చందుని సూక్తంతో ప్రారంభమవుతుంది. ఓ సోముడా, నీవు ఇంద్రుడు తాగుట కొరకు వడకట్టబడి, స్వాధిష్టమై, మదిష్టమై ధారగా ప్రవహించును (9బి1-1).

ఓ సోముడా నిన్ను పది వ్రేళ్లు శుభ్రపరుస్తున్నాయి. ఏడు స్తుతులు ప్రసన్నం చేస్తున్నాయి. తర్వాత విప్రులు నిన్ను సేవించి మత్తిల్లు తున్నారు (9-8-4). ఓ సోముడా జారుడిని కన్య పిలిచినట్లుగా నిన్ను పది వేళ్ళు పిలుస్తున్నాయి (9-59-1). ఓ సోము డా త్రాగుట కొరకు ప్రవహిం చుము. నీ మత్తు చేతనే 99 పురాలు ధ్వంసం చేయబడినాయి (9-61-1,2,20). రాళ్లతో కొట్టబడి వడ కట్టబడి సోముడు సూర్యుడి వలె కలశాల్లోకి చక్కగా ప్రవహిస్తున్నాడు (9-63-13). ఆవు తోలు పై తయారు చేయబడి, జమదగ్ని ఋషిచే స్తుతించబడి, బంగారు రంగు గల సోముడు ప్రవహిస్తున్నాడు (9-65-25). మధురస ప్రదుడు సోముని రాళ్లతో నూరి ఇంద్రుడు తాగేందుకు సారం పిండుతున్నారు. సోముడు దేవుళ్ల నందు బ్రహ్మయై, కవులందు కవితయై, విప్రు లందు ఋషియై, మృగము ందు మహిష మై, గ్రంథమునందు డేగయై, వనములకు కుఠారమై శబ్దం చేస్తూ పాత్ర లందు పొంగుతూ ప్రవహిస్తున్నాడు(9-96-6).

యుద్ధంలో కూడా ఈ సోమ పానం చేసి మత్తిల్లిన వీరులు అద్భుత పరాక్రమాన్ని చూపేవారు. శాంతి కాలంలో సోమాన్ని త్రాగి ప్రజలు ఆనం దించేవారు.

**సురాపానం:** (మద్యం). ఋగ్వేద ప్రజల్లో కొందరు దీన్ని త్రాగే వారే కానీ ఎక్కువగా హీనదృష్టితోనే చూసేవారని కణ్వపుత్ర మేధాతిథి రుక్కు వలన తెలుస్తున్నది. ఈ మద్యం లేదా కల్లు తాగి మత్తిల్లిన వారి నడక ఎలా ఉంటుందంటే ఒట్టిపోయిన గోవు అంటే పాలులేని గోవు నడుస్తున్నప్పుడు ఆ స్థనాలు అటు ఇటు ఎలా కొట్టుకుంటాయో అలా నడుస్తూ ప్రేలుతుంటారు అని వర్ణించాడు. వశిష్ఠుడు కూడా ఈ సురాపానం పట్ల అయిష్టతను తెలిపాడు. ఓ వరుణుడా సుర కోపానికి, జూదానికి, అజ్ఞానానికి దారితీస్తుంది. కనుక మేము ఆ పాపం చేయము. సురను సేవించిన పెద్దలు పిల్లలను చెడగొడుతారు.(8-86-6). ఇలా సోముడిని గురించిన రుక్కులుఇంకా ఉన్నాయి. స్థల భీతి చేత రాయటం లేదు.

### జూదరి భోగం

జూదరి యొక్క జూదం గురించి పదవ మండలం 34వ సూక్తంలో అనేక రుక్కులలో కవస ఆయులూష ముని వర్ణించాడు. సప్త వ్యసనాల్లో జూదం ఒకటి. ఋగ్వేద కాలంలో కూడా జూదం ఆడేవారు ఉన్నారన్నది వేదమే సాక్ష్యం చెబుతున్నది. బహుశా వీరి నుండే నలుడూ, భారతంలో ధర్మరాజు జూదం అలవాటు చేసుకుని ఉండవచ్చునేమో. జూదం వల్ల అనేక మంది నాశనం అయిపోతుండటం వలన ఆర్య రుషులు జూదమాడరాదని హితవు పలుకుతూ ఉండటం కవష ఐలూషుడు తన రుక్కు లలోవివరించాడు. ముంజవాన్ పర్వతంలో పుట్టిన సోమం మాదిరిగానే మెలకువతో ఉన్నా ఈ కొయ్య పాచికలు నన్ను ఉత్సాహపరుస్తూ ఉన్నాయి. నా భార్య నన్ను ఎప్పుడూ చికాకు పెట్టలేదు. నాకు నా మిత్రులకు మేలు చేసింది. కేవలం జూదానికి లోబడిపోయి అనురాగవతి ఆగు నా భార్యను విడిచి పెట్టాను. అత్త ద్వేషిస్తుంది. భార్య విడిచి పెడుతుంది. అడిగినప్పుడు జూదరి ని ప్రేమించే వారు ఎవరూ ఉండరు. ముసలి గుర్రాన్ని కొననట్లు గనే

జూదరి భోగాన్ని ఎవరూ కోరుకోరు. జూదరిభార్య మొత్తుకుంటూ బాధపడుతుంది. ఆవారాగా తిరిగే కొడుకును గూర్చి తల్లి ఎక్కడున్నావ్ రా అని అడుగుతుంది. జూదంలో అప్పుబడి అప్పులపాలైన అతన్ని అప్పు తీర్చమని అడుగుతారు. భయంతో అతడు పొరుగు ఇండ్లలో రాత్రిళ్లు గడుపు తాడు. జూదంలో నేను గెలుస్తాను, నేనే గెలుస్తాను అంటూ జూదమాడే సభకు వెళతాడు. పాచికలు ఒకసారి అతడిని గెలిపిస్తాయి. మరొకసారి ప్రత్యర్థిని గెల్పిస్తాయి. జూదంలో మునిగి పోయిన వారి భార్యను ఇతరులు చెరుస్తారు. తల్లిదండ్రులు, సోదరులు "ఇతడు ఎవరో మాకు తెలియదు. ఇతన్ని కట్టి వైచి పట్టుకొని పొండు" అంటారు. ఓ జూదరి, నీవు పాచికలు ఆడ వద్దు. వ్యవసాయము చేయుము. వ్యవసాయాన్ని నమ్ముకుని సంతృప్తి పడు. ఇక్కడ నీ కొరకు గోవులు ఉన్నాయి. భార్య ఉంది. సవిత్ర దేవుడు నాకీ విషయం చెప్పాడు అంటూ జూదరి జూదం ఆడటం వలన వచ్చే నష్టాలను ఈ సూక్తం అద్భుతంగా వర్ణించింది. ❃

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume 18, issue : 11 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# పేద ప్రజలను పీడిస్తున్న అంటువ్యాధులు



ఇతర పేద, మధ్యస్థాయి దేశాల మాదిరిగా కాకుండా భారత దేశంలో ఇప్పటికీ అంటువ్యాధులు, వాటితోపాటు ఇతర వ్యాధులు ప్రబలంగా వ్యాపిస్తున్నాయని అమెరికన్ జాతీయ మెడిసిన్ లైబ్రరీ జరిపిన ఒక అధ్యయనం తెలిపింది. దాంతో భారతీయ కుటుంబాలపై రెండు రకాల భారాలు పడుతున్నాయని అది పేర్కొంది. భారత దేశంలో అంటు వ్యాధులను ప్రజలు ఎలా ఎదుర్కొంటున్నారు, వ్యాధినివారణ ఖర్చులు వారికి ఎక్కడి నుండి సమకూరుతున్నాయి అన్న విషయాలు తెలుసుకోడానికి ఈ అధ్యయనం జరిగింది.

భారత దేశంలోని రోగుల్లో ఇప్పటికీ 33 శాతం మంది అంటు వ్యాధులతోనే రోగ గ్రస్తులవుతున్నారని అధ్యయనంలో తేలింది. భారతీయ సమాజంలోని పేద ప్రజలు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ ప్రజలు, గ్రామీణులు, మహిళలు, 14 ఏళ్ల లోపు బాలబాలికలు, ముస్లింలు, నిరక్షరాశ్యులు, ఉమ్మడి కుటుంబాల్లో నివసిస్తున్న వారిలో అంటు వ్యాధులు ఎక్కువగా ఉన్నాయని అధ్యయనం తెలిపింది.

ఈ పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందుబాటులో లేక పోవడం వల్ల అంటువ్యాధులను నయం చేసుకునేందుకు వారు తమ స్వంత డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆసుపత్రుల్లో చేరే సందర్భాల్లో ఒక్కో వ్యక్తి సగటున రోజుకు 29.38 రూపాయలు, ఔట్ పేషెంట్స్‌గా అయితే సగటున రోజుకు 7.28 రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని అధ్యయనం తెలిపింది. అంటే అసుపత్రిలో చేరితే ఒక్కో మనిషి సగటున నెలకు 1,156.34 రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఔట్ పేషెంట్సుగా వైద్యం చేయించుకునే ఒక్కో వ్యక్తి సగటున నెలకు 881.56 రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఇది అంటు వ్యాధుల వైద్యం కోసం మాత్రమే. ఇతర వ్యాధుల వైద్యాన్ని కూడా కలుపుకుంటే పేదలు ఖర్చు చేసే మొత్తం ఇంకా చాలా ఎక్కువగానే ఉంటుంది.

భారత దేశంలో స్వంత జేబుల్లోనుంచి ప్రజలు వైద్యానికి ఖర్చు చేయడం అనేది దేశంలో పేదరికం మరింత శాతం పెరగడానికి కారణమవుతున్నది.

దేశంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నాణ్యత పెంచడం, పరిశుభ్రత పట్ల, అంటు వ్యాధుల పట్ల ప్రజల్లో చైతన్యం పెంచడం, రోగనిరోధక వ్యాక్సిన్‌లు వేయడం, సబ్సిడీ ధరలకు మందులు అందించడం, ఆరోగ్యం విషయంలో సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా అంటువ్యాధులను నివారించవచ్చని అధ్యయనం సూచించింది.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్: 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు ..........................................
వీధి.......................................................
గ్రామం ...................................................
మండలం లేదా పట్టణం ..............................
జిల్లా.......................................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.